# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 24 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 117 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## హేయమైన చర్య

### ప్రపంచ దేశాల ఖండన..



- ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్
- సంతాపం ప్రకటించిన జేడీ వాన్స్ దంపతులు, వివిధ దేశాధినేతలు
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ప్రపంచ దేశాల సంఘీభావం

2

## పాక్ పౌరులకు భారత్‌లో ప్రవేశం లేదు



### పహల్గాం ఉగ్రదాడి వెనుక దాయాది దేశ హస్తం

- ఆ దేశ పర్యాటకులు, ప్రత్యేక వీసాదారులు 48 గంటల్లో వెళ్లిపోవాలని తాఖీదు
- భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ నిర్ణయాలను వెల్లడించిన విక్రమ్ మిస్రీ

ఢిల్లీ, ఏప్రిల్ 23: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. దాడి నేపథ్యంలో ప్రధాని మోడీ నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీలో ...మిగతా 2లో

## సర్జికల్ స్ట్రైకా? మరోటా?

2

ప్రతీకార చర్య.. భారత్ స్పందనపై అంచనాలు.. ఊహాగానాలు



ఉగ్రవాదానికి

## భారత్ తలొగ్గదు

### పహల్గాం మృతులకు అంతిమ నివాళులర్పించిన అమిత్ షా

ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. 'భారమైన హృదయంతో పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి అంతిమ నివాళులర్పిస్తున్నాను. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం' అని షా తీవ్రంగా హెచ్చరించారు.

ఇవాళ ఉదయం శ్రీనగర్ చేరుకున్న అమిత్ షా పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారిని పరామర్శించి ఓదార్చారు. వారి వేదనను విన్నారు. ఈ సందర్భంగా తమ ఆప్తులను కోల్పోయిన వారు కేంద్ర మంత్రి ముందు కన్నీటి పర్యంతమయ్యారు. విహారయాత్ర కోసం వస్తే మావాళ్లను పొట్టన పెట్టుకున్నారంటూ రోదించారు. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉగ్ర ఘాతుకంపై కశ్మీరీల తీవ్ర నిరసన

### జమ్ముకశ్మీర్ స్వచ్ఛంద బంద్

### పాల్గొన్న రాజకీయ పార్టీలు, నాయకులు




జమ్మూకశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాం ఉగ్రదాడిపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దీంతో శ్రీనగర్ సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ ...మిగతా 2లో

## ఊపిరి బిగబట్టి బిక్కుబిక్కుమంటున్నం

### శ్రీనగర్ హోటల్‌లో చిక్కుకు పోయిన 80 మంది తెలంగాణ వారి ఆవేదన

### తమను హైదరాబాద్‌కు చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వీడియో విడుదల

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లిన యాత్రికులు శ్రీనగర్‌లో చిక్కుకుపోయారు. పహల్గాం సమీపంలో ఉగ్రదాడి జరిగిన కారణంగా తాము బస చేస్తున్న హోటల్ నుంచి బయటకు రాలేకపోతున్నామని, తీవ్ర భయాందోళనతో ఉన్నామని వారు ...మిగతా 2లో

## హీరోచితుడు

### పర్యాటకులను రక్షించే యత్నంలో ఉగ్రవాదులపై తిరగబడ్డ హార్స్ రైడర్ అదిల్ హుస్సేన్ షా



2

## దీటుగా జవాబిస్తం

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటనపై కేంద్ర రక్షణమంత్రి రాజ్నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టిబదులిస్తుందని ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఉగ్రదాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని..ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వారిని..కుట్ర పన్నిన వారిని బయటకు లాగి, తగిన బుద్ధి చెబుతామని అన్నారు. పహల్గాం ఘటనకు సంబంధించిన విషయాలు, శ్రీనగర్లో భద్రతా చర్యలు వంటి వాటి గురించి ఆయన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠితో చర్చలు జరిపిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు.

## 2017 నుంచి పార్టీలో ఉన్నోళ్లకే పదవులు

### త్వరలో పీసీసీ పూర్తి స్థాయి ప్రక్షాళన

- గుజరాత్ మోడల్‌లో సంస్థాగత నిర్మాణం
- జిల్లాకిద్దరు పరిశీలకుల నియామకం
- మీటింగ్‌కు రానివారి, ఆలస్యంగా వచ్చిన వారి పదవుల తొలగింపు




హైదరాబాద్, మనం బ్యూరో: త్వరలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో పూర్తి స్థాయి ప్రక్షాళన జరుగనుంది. 2017 నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారికే పార్టీ పదవులు ఇవ్వనున్నారు. ఈనెల 25 నుంచి 30 వరకు జిల్లా స్థాయి, మే 4 నుంచి 10వ తేదీ వరకు అసెంబ్లీ/బ్లాక్ స్థాయి, 13 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీసీసీ అబ్జర్వర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 70 మంది అబ్జర్వర్లను ఆహ్వానించగా, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ఐదుగురు హాజరు కాలేదు. దీంతో వారిని పదవి నుంచి తొలగించారు. అదే విధంగా సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వారిపై సైతం ...మిగతా 2లో

## పిరికిపందల చర్య

### పహల్గాం ఉగ్ర దాడిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### ఘటనకు బీజేపీ రాష్ట్రవ్యాప్త నిరసన.. కొవ్వొత్తుల ర్యాలీ



హైదరాబాద్, మనం బ్యూరో: పహెల్గాంలో అమాయక పర్యాటకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి హెచ్చరించారు. పహెల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద బీజేపీ నేతలు నిరసనకు దిగారు. అలాగే, ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళిగా ఎంపీలు కిషన్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేవలం ఒక వర్గం వారిని టార్గెట్‌గా చేసి జరిపిన ...మిగతా 2లో

## 78.57 శాతం పోలింగ్

### జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో ఓటేసిన..

ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ● ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్





భాగ్యనగరం బ్యూరో, మనం న్యూస్: అనేక ఊహాగానాలకు దారి తీసిన జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌లలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారీ బందోబస్తు, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ పోలీసులు కట్టుదిట్టంగా ఆంక్షలను అమలు చేస్తూ పోలింగ్ ...మిగతా 2లో



## మే 22 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

హైదరాబాద్, ఏప్రిల్ 23: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేసింది. మే 22 నుంచి 29వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ ఇంటర్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు.



## రేవంత్‌కు ఘన స్వాగతం

### జపాన్ నుంచి హైదరాబాద్ చేరుకున్న తెలంగాణ రైజింగ్ టీం

### శంషాబాద్ నుంచి నేరుగా సంగారెడ్డికి సీఎం

హైదరాబాద్, మనం బ్యూరో: జపాన్ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో సీఎంకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు, కార్పొరేషన్ ...మిగతా 2లో

## నాపై కేసు కొట్టివేయండి

2

## మతం అడిగి హతమార్చడం దారుణం: ఒవైసీ

### పహల్గామ్ ఉగ్రదాడిపై ఎంఐఎం అధినేత ఒవైసీ స్పందన

2



- దాడికి నిఘా వైఫల్యమే కారణమని తీవ్ర ఆరోపణ
- కేంద్రం జవాబుదారీ వహించాలని డిమాండ్

## రేపట్నుంచి భారత్ సమ్మిట్

### 100 దేశాల నుంచి 450 మంది ప్రతినిధుల రాక

- రాహుల్, ఖర్గే, ప్రియాంక హాజరయ్యే అవకాశం
- హైదరాబాద్ డిక్లరేషన్‌ను ఆమోదించనున్న సమ్మిట్
- ఏర్పాట్లపై సీఎం సమీక్ష

హైదరాబాద్,మనం బ్యూరో: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వేదికగా శుక్రవారం నుంచి భారత్ సమ్మిట్ 2025 జరుగనుంది. అలీనోద్యమానికి పునాది వేసిన చారిత్రక బాండుంగ్ సమావేశం 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమృద్ధి భారత్ ఫౌండేషన్‌తో కలిపి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. నోవాటెల్ హెచ్ఐసీసీలో ...మిగతా 2లో

## అకుంఠిత దీక్ష.. 5 సార్లు విఫలమై.. ఆరోసారి సివిల్స్‌లో 68వ ర్యాంక్ కొట్టిన సాయిచైతన్య

హైదరాబాద్, మనం ప్రతినిధి: కష్టపడితే.. ఖచ్చితంగా ఫలితం దక్కుతుంది.. అని పెద్దలు ఊరికే చెప్పలేదు?.. జీవితంలో ఎంతో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకున్న ఎంతోమంది మధ్యలోనే నిరుత్సాహంతో వారి ప్రయాణాన్ని ఆపేస్తుంటారు. అతి తక్కువ మంది మాత్రమే నిరుత్సాహానికి గురి కాకుండా వారి లక్ష్యం దిశగా ప్రయాణం చేస్తుంటారు. ఇలాంటి విజేతల్లో ఒకరు సాయి చైతన్య. జీవితంలో ఏదైనా సాధించాలనే అకుంఠిత దీక్ష ఉండాలనేదానికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన సాయి చైతన్య ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. సివిల్ సర్వీసెస్‌లో చైతన్య చివరకు అద్భుతమైన ఫలితాన్ని సాధించి, తన కలను సాకారం చేసుకున్నారు. సివిల్స్ ఫలితాల్లో ఆయన 68వ ర్యాంక్ సాధించారు. దేశంలోనే అత్యున్నత ప్రభుత్వ ఉద్యోగంలో చేరబోతున్న చైతన్య కృషి.. ఆషామాషీ కాదు. 5 సార్లు ఆయన సివిల్స్ పరీక్షల్లో నిరాశను ఎదుర్కొన్నారు. అయినా, పట్టుదల వదలని విక్రమార్కుడిలా, డీలా పడకుండా, తన ప్రయత్నాన్ని కొనసాగించారు.

# 2017 నుంచి పార్టీలో ఉన్నోళ్లకే పదవులు

(మొదటి పేజీ తరువాయి)

వేటు పడింది. లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి మాట్లాడుతూ ప్రతీ మండలం నుంచి ఐదుగురి పేర్లను మండలాధ్యక్ష పదవి కోసం పంపించాలనీ, అలాగే ముగ్గురి పేర్లను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుని కోసం పంపించాలని సూచించారు. ఇకపై పార్టీలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందనీ, బ్రిటీష్ వారితో పోరాడిన ఘన చరిత్ర పార్టీ సొంతమని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అనీ, జాతీయ స్థాయి ఆలోచనలతోనే ముందుకు వెళు తుందని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలన్నారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చిత్తశుద్ధితో పనిచే యాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గుజరాత్ మోడల్‌గా చేపట్టాలని పార్టీ అధిష్టానం నిర్ణ యించిందని మీనాక్షి వెల్లడించారు. దేశంలోనే తొలిసా రిగా తెలంగాణలో కులగణనతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చారిత్రాత్మకమ న్నారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేప ట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేప ట్టిన కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవ సరం ఉందని ఈ సందర్భంగా సమావేశంలో నిర్ణ యించినట్లు మీనాక్షి తెలిపారు.

**కోమటిరెడ్డి వివరణ**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ న్‌తో భేటీ అయ్యారు. ఇటీవల పార్టీ సీనియర్ నేత జానారెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగ నుందంటూ ప్రచారం జరుగనున్న నేపథ్యంలో తనకు మంత్రి పదవి రాకుండా జానారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి పార్టీ గీత దాటితే ఎవరిపైనైనా వేటు పడుతుందని హెచ్చ రించారు. ఈ నేపథ్యంలో జానారెడ్డి అంటే తనకెంతో గౌరవమనీ, తనకు మంత్రి పదవిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని వ్యాఖ్యానించారు.

# రేవంత్‌కు ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.
అక్కడి నుంచి సీఎం రేవంత్ రెడ్డి నేరుగా పార్టీ సీని యర్ నేత జగ్గారెడ్డి కుమార్తె వివాహ నిశ్చయ కార్యక్ర మానికి వెళ్లేందుకు సంగారెడ్డికి రోడ్డు మార్గాన బయ ల్దేరి వెళ్లారు.కాగా, ఈనెల 16న జపాన్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఏడు రోజుల పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రూ.12062 కోట్ల మేర పెట్టుబ డులు పెట్టేందుకు ఆ దేశంలోని పలు ప్రముఖ కంపె నీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది.

# నాపై కేసు కొట్టివేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది పార్ల మెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్త గూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీకి నష్టం కలి గించేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. బీజేపీ మళ్లీ అధికా రంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగానికి సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్పింగ్స్‌ను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలనీ సీఎం రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ చేపట్టవద్దనీ, దీనిపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరుగనుంది.

# హీరో చితుడు

పహల్గాం ప్రాంతంలో జరిగిన దాడి సందర్భంగా ఉగ్రవాదుల బుల్లెట్ల నుంచి తమను తాము, తమ కుటుంబాలను రక్షించుకోవాలని ప్రతి ఒక్కరూ ప్రయత్నించారు. ఆ భయానక పరిస్థితిని చూసిన హార్స్ రైడర్ సయిద్ అదిల్ హుస్సేన్ షా హీరోచిత పోరాటం చేశాడు. ఉగ్రవాదులు పర్యటకులపై దాడికి దిగడాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. వారినుంచి తుపాకీ లాక్కొనేందుకు ప్రయత్నించే క్రమంలో ఉగ్రవాదులు కాల్పులకు బలయ్యాడు. పహల్గాం నుంచి మూడు వేల అడుగుల ఎత్తులో ఉన్న టులియన్ సరస్సుకు వెళ్లాలంటే బైసరన్ పచ్చిక బయళ్ల మీదుగా నడక, గుర్రపుస్వారీ తప్ప మరో రవాణా సదుపాయం లేదు. పర్యటకులను కార్ పార్కింగ్ ప్రాంతం నుంచి బైసరన్ పచ్చిక బయళ్ల వద్దకు అదిల్ హుస్సేన్ షా గుర్రం మీద తీసుకువెళ్లిన సమయంలోనే ఈ కాల్పులకు తెగబడ్డ టెర్రరిస్టులపై ఈయన దాడి చేశాడు.

# ఊపిరి బిగబట్టి బిక్కుబిక్కుమంటున్నం

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేశారు. తమను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వానికి.. వారు వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారు. భాదితులు, వారి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, వరంగల్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన సుమారు 80 మంది పర్యాటకులు, జమ్ముకశ్మీర్ పర్యటనకు వెళ్లారు. వీరిలో హైదరాబాద్ నుంచి 20 మంది, వరంగల్ నుంచి 10 మంది, మహబూబ్ నగర్ నుంచి 15 మంది, సంగారెడ్డి జిల్లాకు చెందిన 10 మంది ఉన్నట్లు సమాచారం. మెదక్ పట్టణానికి చెందిన రెండు కుటుంబాలు కూడా వీరిలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా శ్రీనగర్‌లోని ఒక హోటల్‌లో బస చేస్తున్నారు. పహల్గాంలో ఉగ్రదాడి ఘటనతో నెలకొన్న భద్రతా పరిస్థితుల కారణంగా వీరంతా హోటల్‌కే పరిమితమయ్యారని చెప్తున్నారు. తామున్న



ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొని ఉందన్నారు. దాడి కారణంగా.. ఇక్కడి హోటల్‌లో చిక్కుకుపోయామని పర్యాటకులు ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో వారు తమను వీలైనంత త్వరగా, సురక్షితంగా హైదరాబాద్‌కు తరలించాలని కోరుతున్నారు.

# పిరికిపందల చర్య

(మొదటి పేజీ తరువాయి)

దాడిని ప్రపంచమంతా ఖండిస్తోందన్నారు. పాకిస్థా న్‌లో అసమర్థ నాయకత్వం ఉందనీ, అంతర్గత వ్యవ హారాన్ని సరిదిద్దుకోలేని స్థితిలో ఆ దేశం ఉందని విమ ర్శించారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ భారత్‌పై కయ్యానికి కాలు దువ్వుతోందనీ, ఇలాంటి దాడులతో మన దేశాన్ని భయపెట్టలేరని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటా మనీ, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. అదే విధంగా పహెల్గాం దాడి నేపథ్యంలో రాష్ట్రవాప్తంగా నిరసన చేపట్టాలని బీజేపీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పాక్ పౌరులకు భారత్‌లో ప్రవేశం లేదు

(మొదటి పేజీ తరువాయి)

పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఘాతుకం వెనుక పాక్ హస్తం ఉందని పేర్కొన్న కేంద్రం, పాకిస్థాన్ పర్యాటకులతో పాటు ప్రత్యేక వీసాదారులు 48 గంటల్లో భారత్‌ను వీడాలని ఆదేశించింది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయాలను భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. పాక్ పౌరుల్ని భారత్లోకి అనుమతించ రాదని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. రాయబార కార్యాలయాల సిబ్బందిని 55 నుంచి 30కి తగ్గించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అటారీ- వాఘా చెక్ పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు చెప్పిన కేంద్రం.. పాకిస్థాన్ తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించిందన్నారు. ప్రత్యేక వీసాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సరిహద్దు దాటిన వారు మే 1లోగా వెళ్లిపోవాలని మిస్రీ ప్రకటించారు.

# ఉగ్ర ఘాతుకంపై కశ్మీరీల తీవ్ర నిరసన

(మొదటి పేజీ తరువాయి)

డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. కశ్మీరీలు సిగ్గుతో తల దించుకుంటున్నారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కూడా లాల్ చౌక్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టింది. దాడికి పాల్పడినవారు జమ్మూ కశ్మీర్ ప్రజల మేలు కోరే వారు కాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, శ్రీనగర్ ఎంపీ అగా సయ్యద్ రుహుల్లా మెహ్దీ పేర్కొన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టం ముందు నిలబెడుతామన్నారు.

**ఆర్టికల్ 370 రద్దు తర్వాత బంద్ జరగడం ఇదే ప్రథమం..**

రాజకీయ పార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలు ఉగ్ర చర్యలను ఖండిస్తూ నిరసనలు చేపట్టారు. శ్రీనగర్ సహా అనేక చోట్ల బంద్ పాటించారు. కశ్మీర్ ఆర్థిక వ్యవస్థ మూలాలను దెబ్బతీశారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఇటీవలి కాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. ఆగస్టు 2019కు ముందు ఇక్కడ ఇటువంటివి సర్వసాధారణం కాగా.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, గత ఆరేళ్లలో కశ్మీర్లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.''ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకూడదు. కశ్మీర్ పేరుతో, ఏదైనా వర్గం పేరుతో ఇలాంటివి మరోసారి జరగకూడదు. అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం'' అని హజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి మీడియాతో పేర్కొన్నాడు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలను పెకిలివేసేలా చర్యలు చేపట్టాలని స్థానిక పండ్ల వ్యాపారి జీఎం బాండే పేర్కొన్నాడు. కశ్మీరీ ప్రజలు ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమేనన్నాడు. అయితే, కశ్మీరీ సమాజాన్ని కించపరచడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్య తీసుకున్నా తాము మద్దతు ఇస్తామన్నారు.ఉత్తర కశ్మీర్లోని కుప్వారా జిల్లా హంద్వారాలో నిరసనలు చేపట్టారు. ఉగ్ర చర్యకు వ్యతిరేకంగా దక్షిణ కశ్మీర్లోనూ నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇదే విధంగా స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కశ్మీరీలు ఉగ్రవాదంతో లేరనే సందేశాన్ని ప్రపంచానికి చాటేందుకే ఈ నిరసనలు చేస్తున్నామని, పర్యాటకులపై దాడిని ఖండిస్తున్నామని స్థానిక సామాజిక కార్యకర్త తౌసీఫ్ అహ్మద్ పేర్కొన్నారు. రాంబన్ జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిలలాడుతున్నప్పటికీ.. ఉగ్రదాడికి నిరసనగా బంద్ పాటించి శాంతియుతంగా నిరసనలు చేపట్టారు.

# 78.57 శాతం పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్‌లో భాగంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబర్-2లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తెలంగాణ జన సమితి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం కల్లా ఎంఐఎం పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలాఉండగా ఉదయం పది గంటల కల్లా 37.51 శాతం ఓట్లు నమోదయ్యాయి. మధ్యాహ్నం పన్నెండు గంటల కల్లా సుమారు 77.68 శాతం ఓట్లు నమోదు కాగా, మధ్యాహ్నం రెండు గంటలకు 78.57 శాతం ఓట్లు పోలైనట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల మధ్య ఓటింగ్ కోసం ఓటర్లెవ్వరూ రాకపోవటంతో నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది.

# మతం అడిగి హతమార్చడం దారుణం: ఒవైసీ

**హైదరాబాద్, మనం ప్రతినిధిః** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన భయానక ఉగ్రవాద దాడి ఘటనపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ దాడి పూర్తిగా నిఘా వైఫల్యం వల్లే జరిగిందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో బుధవారంనాడు ఒవైసీ మీడియాతో మాట్లాడుతూ... పహల్గామ్ ఘటనను ఒక 'ఊచకోత'గా అభివర్ణించారు. ఉగ్రవాదులు మతం అడిగి అమాయక ప్రజలను అత్యంత కిరాతకంగా హతమార్చారని ఇది అత్యంత దారుణమన్నారు. 'పహల్గామ్‌లో మతం అడిగిన తర్వాత ఉగ్రవాదులు అమాయక ప్రజలను విచక్షణారహితంగా చంపారు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనకు నిఘా వైఫల్యమే కారణం' అని ఆయన స్పష్టం చేశారు. ఈ దుశ్చర్యకు నరేంద్ర మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది గతంలోని ఉరి, పుల్వామా సంఘటనల కన్నా ప్రమాదకరమైనదని, తీవ్ర విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని, బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత త్వరగా న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. నిన్న కూడా ఒవైసీ ఈ దాడిని ఖండించారు. సైనిక దుస్తుల్లో వచ్చి అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం హేయమైన చర్య అని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్రాన్ని కోరారు.

# హేయమైన చర్య

**కశ్మీర్, ఏప్రిల్ 23ః** ఉగ్రమూక పాల్పడిన అనాగరిక చర్యను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ దీనిని హేయమైన చర్యగా అభివర్ణించారు. అమాయకులైన పౌరులపై దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ఈ ఘటనపై స్పందిస్తూ.. పహల్గామ్లో జరిగిన విధ్వంసకర ఉగ్రవాద దాడి బాధితులకు సంతాపం తెలియజేశారు.

ఉగ్రదాడి దిగ్భ్రాంతి కలిగించింది. ఇది అమానవీయ చర్య. బాధితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. అన్నిరకాల ఉగ్రవాదాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. - చైనా రాయబారి జు ఫీహాంగ్ భారత ప్రభుత్వానికి, ప్రజలకు, బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో శ్రీలంక.. భారత్‌కు ఎప్పుడూ తోడుగా ఉంటుంది - శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ

ఈ నేరపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జరిగే అన్నిరకాల ఉగ్రవాద చర్యలను ఖండిస్తున్నాం'' - యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ

దారుణమైన ఉగ్రదాడిలో డజన్ల కొద్దీ పౌరులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. - ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్

దాడిని ఖండిస్తున్నాం. ఇందులో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈయూ ఎప్పటికీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటుంది. - ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్‌దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారత్ తో కలిసి పనిచేస్తుంది'' - ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇటువంటి అమానవీయ చర్యలు బాధాకరం. బాధిత కుటుంబాలకు, భారత్ కు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం - ఇటలీ ప్రధాని జార్జియా మెలోని

భయంకరమైన ఉగ్రవాద దాడి.. బాధితుల దృశ్యాలు కలిచివేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో మాల్దీవుల ప్రభుత్వం స్థిరంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌కుమద్దతుగా ఉంటాం. - మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు అమాయక ప్రజల మరణం తీవ్రంగా కలిచివేసింది. ఈ కష్ట సమయంలో జర్మనీ భారత్ వెంట ఉంటుంది.

# సైనికులను చసి గజగజ వణికిన బాధితులు

బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడులు చేయడంతో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రూరమైన దాడిలో బతికి బయటపడిన బాధితులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఉగ్రదాడి సమాచారం అందుకున్న సైనికులు ఘటనా స్థలానికి వెళ్లి.. వారిని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా అక్కడ ఉన్న పర్యటకులు.. వారు కూడా ఉగ్రవాదులే అనుకొని భయంతో వణికి పోయారు. ఉగ్రవాదులు మళ్లీ ఆర్మీ దుస్తుల్లో తమపై దాడి చేయడానికి వచ్చారేమో అనుకొని సైనికులను చూసిన ఓ మహిళ తన చిన్నారిని ఏమీ చేయొద్దని బోరున విలపిస్తూ.. చేతులు జోడించి వారిని వేడుకుంది. ఇతర పర్యటకులు కూడా భయంతో తమ పిల్లలను దాచడానికి ప్రయత్నించారు. ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్తూ.. తాము భారత ఆర్మీ నుంచి.. మిమ్మల్ని రక్షించడానికే ఇక్కడికి వచ్చామని భరోసా ఇచ్చారు. దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్కు గురైన ఆ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని.. ఆ బాధలో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు పేర్కొన్నాయి.

దాడి చేసింది మేమే

ప్రకటించుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్

కశ్మీర్లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడికి తామే బాధ్యలమంటూ పాకిసాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించుకుంది.

# ముగ్గురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలు విడుదల

పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. మూసా, యూనిస్, ఆసీఫ్ అనే కోడ్నేమ్లు కూడా ఉన్నట్లు పీటీఐ పేర్కొంది. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో సభ్యులు. ఉగ్రదాడి నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఈ చిత్రాలను తయారు చేశారు. టెర్రరిస్టులు పురుషులను వేరు చేసి వారి గుర్తింపులను పరిశీలిస్తున్న సమయంలో బాధితులు వారి ముఖాలను చూశారు. దీంతో జమ్మూకశ్మీర్లో ఉగ్ర వేట తీవ్రమైంది. దీంతోపాటు ఓ ఉగ్రవాది ఆటోమేటిక్ ఆయుధంతో ఉన్న ఫొటోను కూడా విడుదల చేశారు.

**ఉగ్రవాదులు వ్యూహాత్మక ఎంపిక బైసరన్ లోయ**

ఉగ్రవాదులు పర్యటకులపై దాడికి బైసరన్ లోయనే వ్యూహాత్మకంగా ఎన్నుకొన్నట్లు తెలుస్తోంది. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలు తీసేందుకు వీలుగా దీనిని లక్ష్యంగా చేసుకొన్నారు. ఈ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు అంతగా ఉండవన్న విషయాన్ని వారు వాడుకొన్నారు. దీనికితోడు పహల్గాం నుంచి ఇక్కడికి రావాలంటే 6.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అది కూడా కాలినడకన లేదా గుర్రాలపైనే సాధ్యమవుతుంది. దీంతో భద్రతా బలగాలు వెంటనే రాజాలవు. లోయ చుట్టూ చిక్కటి అటవీ ప్రాంతం ఉండటం.. మంచు కరిగిపోవడంతో ఉగ్రవాదులు పారిపోవడం కూడా తేలిక. ఇక ఇక్కడ సైన్యం ఆపరేషన్ చేపట్టినా.. వెంటనే ముష్కరులను గుర్తించలేని పరిస్థితి ఉంటుంది.

**బాడీ కెమెరాలతో చిత్రీకరించి..**

మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో పహల్గాం దాడి మొదలైంది. ముష్కరులు బాడీ కెమెరాలతో దాడిని చిత్రీకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వీటిని హెల్మెట్లకు ధరించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. తొలుత బాధితులు అందరినీ ఉగ్రవాదులు ఒకచోటుకు చేర్చి వారి గుర్తింపులను తనిఖీ చేశారు. అనంతరం హత్య చేశారు.



# రేపట్నుంచి భారత్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ పాల్గొనే అవ కాశం ఉంది. అలాగే, దాదాపు 100 రాజకీయ పార్టీల నుంచి 50 మంది మంత్రులు, సెనేటర్లు, ఎంపీలతో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన రాజకీయ సంస్థల నుంచి వాటి అధిపతులు పాల్గొననున్నారు. ఈ ప్రపంచ శిఖరాగ్ర సమావేశంలో విధాన నిర్ణేతలు, విద్యా వేత్తలు, రాజకీయ నాయకుల కీలక ప్రసంగాలు, ఆలో చింపజేసే సెషన్‌లు ఉంటాయి. ఆర్థిక న్యాయం, వాతా వరణ న్యాయం, బహుపాక్షిక కీల అంశాలు చర్చించను న్నారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ ధృక్పదం, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, వ్యవ స్థాపకులు తెలంగాణలో ఎలా పెట్టుబడి పెట్టవచ్చో వివ రించనున్నారు. దీంతో పాటు భారత్ సమ్మిట్ సంద ర్భంగా హైదరాబాద్ డిక్లరేషన్‌ను కూడా ఈ సమావేశంలో ఆమోదించనున్నారు. కాగా, భారత్ సమ్మిట్ ఏర్పాట్లపై గురువారం సీఎం రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంట ర్‌లో సమీక్షించనున్నారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, ఉన్నతాధి కారులతో సీఎం చర్చించనున్నారు.

# సర్జికల్ స్ట్రైకా? మరోటా?

2016లో ఉరి ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆ ఏడాది అక్టోబర్‌లో పాకిస్తాన్ సరిహద్దు వెంట ఉన్న ఉగ్రవాద శిబిరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్ జరిపిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడిపై కూడా భారత్ ఇదే రీతిలో బదులిస్తుందని అంచనా. అది కూడా ఎప్పుడో కాకుండా నేడో,రేపో ఈ ఆకస్మిక దాడులు జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమంటున్నారు పరిశీలకులు. సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ తన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. విమానాం దిగీదిగగానే విమానాశ్రయం వద్దే జాతీయ భద్రతా సలహాదారు, విదేశాంగ మంత్రి, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యాయి. ఆ వెంటనే భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీతో కూడా మోడీ సమావేశమై దాదాపు రెండున్నర గంటలు చర్చలు జరిపారు. అయితే, దీని వివరాలేవీ బయటకు వెల్లడించలేదు. గుంభనంగా జరుగుతున్న ఈ భేటీలు, సమీక్షలన్నీ పాక్‌పైనా, అక్కడి ఉగ్రతండాలపైనా ఆకస్మిక దాడులపై చర్చించాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఉగ్రదాడులకు బలైన వారికి నివాళులర్పించిన సీసీఎస్ ఎలాంటి సీరియస్ ప్రకటనా చేయకపోవడం.. కశ్మీర్‌లో మృతులకు శ్రద్ధాంజలి ఘటించిన కేంద్ర మంత్రి అమిత్ షా 'ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు' అన్న ప్రకటన, '..ధీటుగా జవాబిస్తం' అన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటనలు దీనినే సూచిస్తున్నాయని పలువురు చెప్పుకుంటున్నారు. ఇక సోషల్ మీడియాలో అయితే చెప్పనే అవసరం లేదు. మరోసారి సర్జికల్ స్ట్రైక్ జరిగిపోయినంత హడావుడి చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సర్జికల్ స్ట్రైక్ జరుగుతుందా? లేక మరో రూపంలో ప్రతిచర్య ఉంటుందా? అన్నది ఆసక్తికరమైన అంశంగా ఉంది.

# హాట్ సమ్మర్ హెచ్చరికల బేఖాతర్?

పహల్గాం ఉగ్రదాడి కదలికలను ముందే కనిపెట్టి హెచ్చరికలు జారీ చేసినా.. అరికట్టడంలో అధికారులు విఫలం అయ్యారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మార్చి 10వ తేదీన కేంద్ర హోం సెక్రటరీ గోవింద్ మోహన్ అధ్యక్షతన జమ్మూలో ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష జరిగింది. నెల కూడా గడవకముందే.. కేంద్ర హోం మంత్రి స్వయంగా ఏప్రిల్ 6వ తేదీన జమ్మూకశ్మీర్ యూనిఫైడ్ కమాండ్ తో సమావేశం అయ్యారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ సమావేశాల ఉద్దేశం మాత్రం ఒక్కటే. జమ్మూకశ్మీర్లో హాట్ సమ్మర్ (భారీ రక్తపాతం సృష్టించేందుకు) కోసం పాక్ యత్నాలు చేస్తోందని హెచ్చరించడమే. జమ్మూకశ్మీర్లో భద్రతను ముఖ్యమంత్రి నేతృత్వంలోని యూనిఫైడ్ కమాండ్ చూసుకొంటుంది. **స్థానికులా? పాకిస్థానీలా?** ఈ దాడిలో దాదాపు నలుగురు అంతకంటే ఎక్కువమంది పాల్గొని ఉండొచ్చని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి.

# రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేద్దాం



- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ ఏప్రిల్ 23 (మనం న్యూస్): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 27 వ తేదీన వరంగల్ లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలో చంపాపేట డివిజన్ లో జెండా పండుగ కార్యక్రమం కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ నందు జరిగే సభను మన నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళ.
- విద్య ప్రదాత విగ్నేష్ గౌడ్
- అభినందించిన ఆర్డీవో, ఎంఈఓ, తహసిల్దార్, సిఐ.

చేవెళ్ల , ఏప్రిల్ 23 (మనం న్యూస్ ): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్డీవో చంద్రకళ సూచించారు.విద్య విలువ తెలిసిన బిఆర్ఎస్ నాయకులు విగ్నేష్ గౌడ్ ఇంటర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో చేవెళ్ల మండల కేంద్రంలో మెరిట్ మార్కులు సాధించిన ప్రభుత్వ , ప్రైవేటు కళాశాలలోని విద్యార్థులకు బుధవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో నగదు రూపంలో ప్రైజ్ మనీ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళ, తహసిల్దార్ బి. కృష్ణయ్య గౌడ్, ఎంఈఓ పురన్ దాస్, సీఐ భూపాల్ శ్రీధర్ పాల్గొని విద్యార్థులను పేరెంట్స్ కళాశాల ప్రిన్సిపల్స్ సమక్షంలో శాలువాతో సన్మానించి ప్రైజ్ మనీ అందజేశారు. అనంతరం ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ... అమ్మాయిలు అంటే సమాజంలో దేంట్లో తక్కువ కాదని ఆధునిక సమాజంలో చులకన భావం ఉందని దాన్ని తలకిందులు చేసే విధంగా చదువు విద్యార్థినిలు ప్రతిభ సాధిస్తున్నారని కొనియాడారు. ఏ విజయం... ఏ ఓటమి... అంతిమము కాదని జీవితం అంటేనే ఓ పోరాటమని స్పష్టం చెశారు. ప్రతిభ సాధించిన విద్యార్థినిలు తమ కెరియర్ ముగిసేంతవరకు పెళ్లి అంశం రానీయకూడదని అలానే పేరెంట్స్ కూడా పెళ్లి ప్రస్థానం తెకూడదని చెప్పారు. ప్రతిభకు పదునెట్టి నీట్ సివిల్స్ పై దృష్టి సాధించాలని వైద్యులుగా, ఆఫీసర్ హోదాలో సమాజ సేవకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. చదువు విలువ తెలిసి ఎప్పటికప్పుడు విద్యార్థులకు



ఆర్థిక చేయూతనందిస్తున్న నాయకులు విగ్నేష్ గౌడ్ ను వారు అభినందించారు. సివిల్ సర్వీసులో రాణిస్తున్న వారు వెనుకబడిన గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వారేనని ప్రభుత్వ పాఠశాల కళాశాలలో చదివిన పునాదే వైద్యరంగం, సివిల్స్ లో వారిని నిలబెట్టిందన్నారు. ప్రస్తుత సమాజంలో కొందరు కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నారని కార్పొరేట్ వ్యవస్థ ఎంత విస్తరించిన ఒక స్థాయిలో ఆగిపోతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల ప్రతిభకు అవధులు లేవని ఉద్బోధించారు. నేడు విద్యార్థులు చదువుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని తద్వారా తుది ఫలితాలలో రాణించలేకపోతున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు సమాజ శ్రేయస్సుకు అందరూ చదువులో రాణించాలన్నారు. చదువుతారనే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్ బ్యాగులు నిషేధించండి

క్లాత్ బ్యాగులు వాడండి • ఇఫో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య



తుర్కయంజాల్, ఏప్రిల్ 23( మనం న్యూస్): ప్రజల ఆరోగ్యం పర్యావరణం తో ముడిపడివుందని ఇఫో రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని జన్నూర్ గృహకల్ప రాగన్నగూడ లో ఇఫో ఆర్గనైజర్ పి. శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 22వ తేది రాత్రి.... దరిత్రి దినోత్సవాని పురస్కరించుకొని జరిగిన మహిళల సమావేశంలో శివకుమార్, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ, తమ ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యాంగా ఉంటారని అన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్ లను ఉయోగించడం మానేసి క్లాత్ బ్యాగ్ లను ఉయోగించాలని చెప్పారు. ఒక ప్లాస్టిక్ కవర్ జీవితకాలం 200 సంవత్సరాలనుండి 400 సంవత్సరాల వరకు ఉంటుందని, పర్యావరణాన్ని కాపాడుకోవటం మన అందరి బాధ్యత అన్నారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్నా పర్యావరణ విధ్వంసం సరైనది కాదని, పర్యావరణనికి నష్టం లేకుండా అభివృద్ధి ఉండాలని అన్నారు. భూమి, నీరు, గాలి, వెలుతురూ, వృక్షాలు ఎవరు సృష్టించలేదని, వాటిని నాశనం చేసే హక్కు కూడ ఎవరికీ లేదని అన్నారు.

కొంతమంది స్వార్ధ ప్రయోజనాలకోసం సమస్త జీవులకు హాని చేకూర్చడం మంచిది కాదని అన్నారు. అనంతరం మహిళలకు క్లోత్ బ్యాగ్ లను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో రోజరాణి, శశికళ , శివ ప్రసాద్, డి. యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

రంగారెడ్డి ఏప్రిల్ 23 (మనం న్యూస్): సరూర్ నగర్ మున్సిపల్ వార్డు ఆఫీసులో నిర్వహించిన భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొని రైతులకు భుభారతి చట్టంలోని కీలక అంశాల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ధరణి సమయంలో రైతులు భూ సమస్యలకు చాలా ఇబ్బందులు పడేవారని సమస్యలను



రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం భూభారతి చట్టం-2025 ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుకు హాజరైన రైతులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్, సమాధానాలు ఇవ్వడం జరిగినది. ఈ సదస్సు లో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ,సరూర్ నగర్ తహసిల్దార్ వేణుగోపాల్ , డిప్యూటీ తహసిల్దార్ జంగయ్య ఆర్ ఐ లు సహదేవ్ రెడ్డి గీత మరియు కార్యాలయ సిబ్బంది హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మున్సిపాలిటీనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల , ఏప్రిల్ 23(మనం న్యూస్)ః చేవెళ్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో రోడ్డు శుభ్రపరిచే యంత్రం, డోజర్ ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేవెళ్ల మున్సిపాలిటీకి మరిన్ని నిధులు తీసుకువచ్చి రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయడానికి ప్రణాళిక ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీకి ప్రతిఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తాం

- చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి



చేవెళ్ల, ఏప్రిల్ 23(మనం న్యూస్)ః విద్యార్థుల చదువుల అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తామని చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో మోడల్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇందులో భాగంగా బుధవారం చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజా ఆగిరెడ్డిలు విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి అభినందించారు. విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువును ఇష్టంగా చదివి ఉన్నత స్థాయిలో ఎదగాలని తెలిపారు. అనంతరం వారి ప్రతిభకు సహకరించిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ , యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, పిఎసిఎస్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నప్ప రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రంగారెడ్డి ఏప్రిల్ 23 (మనం న్యూస్): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి లు హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ కే రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూధన్ రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్ (సురేష్), శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఛైర్మెన్ తలాటి రమేష్ నేత, జ్ఞానేశ్వర్ , శేఖర్ , బొడ్డుపల్లి మహేందర్, పెద్దవూర సైదులు, లింగ స్వామి గౌడ్, పగడాల శ్రీశైలం, సుజాత, మహ్మద్, మామిడి రామకృష్ణ గౌడ్, రేణుక, విప్లవ్, శశి యాదవ్, రఫీ, ప్రేమ్ నాయక్, సంతోష్, మాధవి, స్వరూప, శ్రీనాథ్, రాజు, కవిత, సంతోష, నాను నాయక్, భాగ్య పాల్గొన్నారు.

# పోచంపల్లి కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రారంభోత్సవం

- రాష్ట్ర రోడ్డు రహణా సంస్థ కార్పొరేషన్ చేర్మెన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి





తుర్కయంజాల్, ఏప్రిల్ 23 (మనం న్యూస్):మున్సిపాలిటీ పరిధి బ్రిలియంట్ స్కూల్ ఎక్స్ రోడ్లు లో నూతనంగా ఏర్పాటు చేసిన పోచంపల్లి కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 11వ బ్రాంచ్ ను రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు బ్యాంకు నాణ్యమైన సేవలను అందించాలని అన్నారు. అతి తక్కువ సమయంలోనే పోచంపల్లి బ్యాంక్ కు సంబంధించి 11 బ్రాంచ్ లను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం బ్యాంకు చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ, ఖాతాదారులు అతి తక్కువ బ్యాలెన్స్ తో ఖాతా ఓపెనింగ్ చేసుకోవచ్చని, కరెంట్ ఖాతా సదుపాయం ఉందని తెలిపారు. ఆధార్ కార్డు అనుసంధానా తో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే సబ్సిడీలు, నగదు బదిలీలు, ఉపాధి హామీ నగదు పొందే సౌకర్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, సీనియర్ నాయకులు సామ బీమ్ రెడ్డి, గుండా ధనరాజ్, పుల్ల గుర్రం విజయనంద్ రెడ్డి, బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు డైరెక్టర్లు, కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, ఏలే హరి శంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కవ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో శివాని కాలేజీ ప్రభంజనం: కళాశాల కార్యదర్శి వెదిరె సుదర్శన్ రెడ్డి




ఎల్బీనగర్ ఏప్రిల్ 23 (మనం న్యూస్): ఇంటర్ ఫలితాల్లో కొత్తపేట శివాని మహిళా కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు కళాశాల కార్యదర్శి వెదిరె సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను దీకొండ పూజిత 467 మార్కులు సాధించిందని తెలిపారు.. ఇంటర్ ప్రథమ సంవత్సరం విభాగంలో కె. రోహిణి (466), ఆర్. హర్షిత యాదవ్ (464), జి.ఊహ(461), జి. శ్రీలేఖ(457), 440 మార్కులకు గాను జి. కృతిక (431), హద్య జాన్బీ(426), అదే విధంగా 500 వందల మార్కులకు గాను ఎం. సుల్తాన్ (492), కె. కీర్తన (490),సిహెచ్. శరణ్య(478), వి. రమ (474), పి.శివాని(458).. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విభాగంలో వెయ్యి మార్కులకు గాను ఎర్ర వర్షిత (985), వై. శ్రావ్య (983), వి. పూజిత (983), సభా మహ్మద్ (976), బి. శ్రీజ (975),జి.శ్రీ హిత(970), టి.రేఖ(969), అర్షి ద్వివేది (964), నుత నహిమ (956)లు మార్కులు సాధించినట్టు తెలిపారు.

# ఇంటర్ లో ఫెయిల్..

## సుసైడ్ చేసుకున్న విద్యార్థిని బిక్కనూర్ లో ఘటన



కామారెడ్డి క్రైమ్, ఏప్రిల్ 23 ( మనం న్యూస్ )ః తల్లిదండ్రులు లేకున్నా ఈ విద్యార్థినినానమ్మ దగ్గర ఉంటూ కష్టపడి చదువుకుంది.. నానమ్మే అన్నీతానై చూసుకుంది. అయితే ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో దిగులుపడి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర ఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రెడ్డి పూజ(17)కు తల్లిదండ్రులు లేరు. నానమ్మతో ఉంటుంది. కామారెడ్డి పట్టణంలోని ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ చదువుతోంది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో పూజ ఫెయిలైంది. ఇంట్లో నానమ్మ లేకపోవడంతో తన పెద్దమ్మ ఇంట్లో నిద్రించింది. తాను ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిలయ్యానని చెప్పుకుని బాధపడింది. ఉదయం ఇంటిముందు వాకిలి ఊడ్చి వస్తానని వెళ్లిన పూజ తిరిగి రాకపోయేసరికి పెద్దమ్మ వెళ్లి చూడగా.. అప్పటికే ఒళ్లంతా కాలిపోయి విగతజీవిగా పడి ఉంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుల భూములకు రక్షణ కవచంలా భూ భారతి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్,ఏప్రిల్ 23,(మనం న్యూస్)ః దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విశ్వాసం కల్పించే విధంగా, వారి భూములకు రక్షణ కవచంలా ఉండేలా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. బుధవారం పట్టణంలోని సాయిబాబా గుడి ఫంక్షన్ హాల్ ఏర్పాటుచేసిన భూ భారతి చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల లో ఆయన మాట్లాడారు .గతం లో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ధరణిస్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు ,రైతు సంఘాలు, అందరితో చర్చించి,గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతి ని తీసుకొచ్చిందన్నారు. ధరణి పార్ట్ బి లో సుమారు పది లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. కొత్త చట్టంలో భూముల రికార్డుల బాధ్యత, భద్రత రెవెన్యూ శాఖ తీసుకుంతుందన్నారు .అలాగే రైతుల భూముల హక్కులను పరిరక్షిస్తుందని తెలిపారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లే భూమి ఉన్న ప్రతి రైతుకి భూ ధార్ కార్డును ప్రభుత్వ ఇవ్వనుందని,దీని ద్వారా ఏ సర్వే నెంబర్ లో ఎంత భూమి ఉందో రైతుకు తెలుస్తుంది అన్నారు .ధరణి రాకముందు భూములన్నింటిని వీఆర్వో వ్యవస్థ నిర్వహించేదని, ధరణి వచ్చిన తర్వాత వీఆర్వో వ్యవస్థను ప్రభుత్వం తీసివేసిందని, ఇప్పుడు ప్రభుత్వం తిరిగి దానిని పునరుద్ధరించనుందన్నారు. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని,భూ భారతిలో కిందిస్థాయిలో ఎమ్మార్వో తప్పు చేస్తే సవరించే అవకాశం ఆర్డిఓ కు ఉందని తెలిపారు. భూముల సర్వే కోసం లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి నియమించనుందని, దీని ద్వారా రైతుల భూములకు హద్దులు కల్పించే అవకాశం ఉందన్నారు. గతంలో ఉన్న చట్టానికి, ఇప్పటి చట్టానికి పోలికనే లేదని, రైతులకు ఎంతో మేలు కలిగించే భూ భారతి చట్టం నిజంగా రైతుల పాలిట చుట్టమని తెలిపారు.

**తెలంగాణలో భూ భారతి చట్టం రావడం శుభసూచకం**

**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ తెలంగాణలో భూ భారతి చట్టం రావడం శుభసూచకమని అన్నారు. ఈ చట్టం ద్వారా రైతులకు భూదార్ కార్డు ఇవ్వడం, రికార్డుల నిర్వహణ, సవరణ వంటివి శాశ్వతంగా ఉండిపోతుందన్నారు .అలాగే ఈ చట్టంలో అప్పీల్ పద్ధతి ఉందని, ఎక్కడైనా తప్పు జరిగితే సవరించే అవకాశం చట్టంలో ఉందని, గతంలో లాగా సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. రికార్డులను సవరణలు చేసే అధికారం, ప్రతి సంవత్సరం రికార్డులను భద్రపరిచే అవకాశం భూభారతిలో ఉందని తెలిపారు. మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో కాకపోతే ఆటోమేటిక్ గా మ్యుటేషన్ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు,స్థానిక తహసిల్దార్ జమీరుద్దీన్,మున్సిపల్ చైర్మన్ చౌగొని రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పత్రాల అందజేత




ఎల్బీనగర్ ఏప్రిల్ 23 (మనం న్యూస్)ః దారుల్ షిఫా ప్రభుత్వ ప్రాథమిక అంద బాలుర పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో భాగంగా విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహదూర్పుర - 1 డిప్యూటీ ఐఓఎస్ హరి నారాయణ హాజరు అయ్యారు. మాట్లాడుతూ చదువుకొని విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తూ అంచలంచలుగా ఎదగాలని అన్నారు. ఈ పాఠశాలకు అడ్మిషన్స్ తీసుకొచ్చి పాఠశాల పురాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి , ఉపాధ్యాయులు. విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు

# బహుజన హక్కుల స్ఫూర్తిదాత బి. ఆర్ అంబేద్కర్



అనేక కారణాంతరాల నేపథ్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి రాయడం ఒకింత కష్టసాధ్యమే. అయినప్పటికీ, భారతరత్న బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంత్యుత్సవాల మొన్న జరుపుకున్నాం. ఇక సమకాలీన సామాజిక యవనికలో సంభవిస్తున్న పరిణామాల నేపథ్యంలో ఆయన మార్గాన్ని మరొక సారి సింహావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది. స్ఫూర్తిదాయకమైన ఆయన జీవనయానం ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో కోరలు చాస్తున్న విద్వేష విషమ సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన మార్గాంతరాల అన్వేషణకు ఆలంబనగా నిలుస్తుంది. అంబేద్కర్ రచనలు, తాత్విక వివేచన, కృషి విశ్వజనీన సత్యాన్వేషణకు ఒక సమంజసమైన చేర్పుగా నిలుస్తాయి. సామాజిక, రాజకీయ అధికార కేంద్రాల అహేతుకతను, అమానవీయతను ఆయన ధిక్కరించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాధికారం, సంపద, హింసలపై కొనసాగుతున్న అపోహలను ఆయన సవాలు చేశారు. హిందుత్వం, సంప్రదాయం, జాతీయవాదం, న్యాయం, సత్యం వంటి అధిభౌతిక వ్యర్థ భాషణలపై అంబేద్కర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. బోధనలు, జ్ఞాపకాల రూపంలో ఆయన ఉనికి మనలోని చెడు నమ్మకాలను, చెడ్డ అంతరాత్మను నిరంతరాయంగా ఎత్తి చూపుతోంది. కుల వ్యవస్థ నిర్మూలనకు, హింసలేని, దోపిడీ లేని శాంతియుతసాంఘిక వ్యవస్థ నిర్మాణానికి దారిచూపిన నవయాన బోధిసత్వుడు ఆయన. డాక్టర్ అంబేద్కర్ యుగకర్త. జ్ఞానాన్ని ఆర్జించటమే కాదు, దాన్ని సమాజ ప్రయోజనానికి ఉపయుక్తం చేశారు. రాజ్యాంగ రచనపై తనదైన శైలిలో ప్రగాఢమైన తాత్విక ముద్రను వేశారు. మనిషిని మనిషిగా చూడటం నేరమనే అమానవ మనుస్మృతిని తోసిపుచ్చుతూ అంటరానితనం రద్దును రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ద్వారా సాధించాలని అంబేద్కర్ స్వప్నించారు. నిజాయితీ, వివేకవంతమైన ఆలోచన, సమాజ హితమైన కార్యక్రమంతో ఆయన జీవించారు. ప్రపంచంలో దుఃఖాన్ని తొలగించాలని చెప్పిన బుద్ధుడి సూత్రాన్నిఅంబేద్కర్ రాజ్యాంగంలోకి అనువర్తింప చేశారు. భౌతికంగా నిష్క్రమించిన తరు వాత కూడా అంబేద్కర్ ఆలోచనలు దేశంలోని సామాజిక న్యాయశక్తుల ఆచరణకు పురిగొల్పుతూనే ఉన్నాయి. గాంధీ, నెహ్రూలతో సమంగా ఎన్నదగిన నాయకుడిగా ఆయనకు గుర్తింపు దక్కకపోవడం యాదృచ్ఛికమేమీ కాదు. భారత స్వాతంత్ర్య సమరంలో, తరువాత దేశ నవ నిర్మాణం కోసం, సామాజిక న్యాయం కోసం రాజకీయ ప్రక్రియతో బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు న్యాయమైన వాటా కోసం రచించిన వ్యూహా లపై నిర్దేశించిన విధానాలపై నిర్వహించిన సమరశీల పోరాటాలపై చెరగని ముద్ర వేసిన మహనీయుడు అంబేద్కర్. దేశ సామాజిక వ్యవస్థ భౌగోళిక స్వరూపం ఆధారంగా నిరుపమాన అధ్యయనంతో జాతీయోద్యమ ప్రజల ఆకాంక్షలతో ప్రతిబింబించే రాజ్యాంగాన్ని అందించాడు. ప్రపంచ జ్యోతి బుద్ధుడు సామాజిక విప్లవ ఆరంభకుడు పూలేల దివిటీని అందుకుని ఒక ఇతిహాసంగా సామాజిక ఆర్థిక విప్లవాన్ని గొప్ప ముందంజ వేయించి దేశ చరిత్ర గతిని మార్చిన మహోన్నతుడు అంబేడ్కర్. అంబేద్కర్ చేసిన సేవలు, ఆలోచనలు మానవ మర్యాద కోసం, అంతరాలులేని సమాజం కోసం, దోపిడీ పీడనలులేని వ్యవస్థ నిర్మాణం కోసమనే స్పృహను భారతీయ సమాజం కలిగి ఉన్నందువల్లే ఆయన దూరమయ్యి అరవై మూడు సంవత్సరాలు దాటిన ఈ నాటికీ ప్రజలు ఆయన జయంతి, వర్ధంతులు జరుపుకుంటున్నారంటే తమ జీవిత వెలుగు లకు అంబేద్కర్ చేసిన త్యాగభరిత కృషిపట్ల కృతజ్ఞత, ఆయన చెప్పిన విషయాలు ఎంతటి సమకాలీనతను, ప్రాసంగికతను కలిగి ఉన్నాయనడానికి నిదర్శనం.

ప్రపంచ చరిత్రలో కొంతమంది వ్యక్తులు మాత్రమే తమ ఆలోచనలతో, కార్యాచరణతో సమాజాన్ని ప్రగతిపథంలో నడిపించగలరు. అలాంటి వ్యక్తుల్లో డాక్టర్ భీమరావ్ రామ్జీ అంబేద్కర్ ఒకరు. సామాజిక సమానత్వం, రాజనీతిక న్యాయం మరియు ఆర్థిక ప్రగతికి ఆయన చేసిన కృషి ఎనలేనిది. ప్రతి ఏప్రిల్ 14న ఆయన జన్మదినాన్ని దేశవ్యాప్తంగా 'అంబేద్కర్ జయంతి'గా జరుపుకుంటారు. డాక్టర్ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్య ప్రదేశ్ లోని మౌతో గ్రామంలో జన్మించారు. ఆయనకు పుట్టినప్పుడు పేరు 'భీమా'. ఆయన తండ్రి రామ్జీ మాలోజీ సబ్బేదార్గా బ్రిటిష్ ఆర్మీలో పనిచేశారు.

అంబేద్కర్ మహార్ అనే అణగారిన కులానికి చెందినవాడు. బాల్యదశ నుంచే ఆయన తలచిన సమాజం కులాల ఆధారంగా విడిపోయి, అణగారినవారిని చిన్నచూపుతో చూడటం ఆయనను ఆవేదనలో ముంచెత్తింది. అంబేద్కర్ విద్య అభ్యాసం కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. అణగారిన కులానికి చెందినవారు అన్న కారణంగా పాఠశాలల్లో ఆయన్ను ప్రత్యేక స్థలంలో కూర్చోబెట్టేవారు. ఆయన నీళ్లు తాగాలంటే ఎవరైనా ఉపాధ్యాయుడు వచ్చి పోయాలి. ఈ అన్యాయాలను నిశ్శబ్దంగా తట్టుకుంటూ విద్యలో అపారమైన ప్రతిభను ప్రదర్శించారు.

విద్యలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన అంబేద్కర్, తనకు అనుభవించిన కుల వివక్షను తట్టుకోలేక పోయాడు. సమాజంలో అణగారిన వర్గాలకు సమాన హక్కులు రావాలన్న సంకల్పంతో ఉద్యమాలు మొదలుపెట్టాడు. అస్పృశ్యత ఒక మానవ హక్కుల ఉల్లంఘన అనే దృష్టితో ఆయన ఎన్నో ఉద్యమాలకు నాంది పలికాడు.మహారాష్ట్రలోని మహాడ్ అనే గ్రామంలో 1927లో జరిగిన 'చావదార్ ట్యాంక్ ఉద్యమం' అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ ఉద్యమం ద్వారా అంబేద్కర్ అణగారిన వర్గాలు కూడా ప్రజలే, వారికి కూడా తాగునీటి హక్కు ఉండాలని గట్టిగా తెలియజేశారు. తర్వాత కాలంలో 'కాలిన పత్రాలు ఉద్యమం' ద్వారా మనుస్మృతి వంటి పుస్తకాలను నిప్పుతో కాల్చారు. అలాంటి గ్రంథాలు అణగారిన వర్గాలను అపహాస్యం చేస్తున్నాయని భావించారు. ఈ చర్యలు అప్పట్లో తీవ్ర చర్చనీయాంశాలుగా మారాయి. అంబేద్కర్ హిందూ మతంలో ఉండే కులవ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నో ప్రయత్నాలు చేసినా సమాజంలో మార్పులు కనబడకపోవడంతో చివరకు హిందూ మతాన్ని వదిలి బౌద్ధ మతాన్ని స్వీకరించారు. 1956లో అక్టోబర్ 14న నాగపూర్ లోని ఒక భారీ సభలో ఆయన తన అనుచరులతో కలిసి బౌద్ధమతంలో ప్రవేశించారు. నా జన్మ హిందూగా జరిగింది, కానీ మరణం హిందూగా జరగదు అన్న ఆయన మాటలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

బౌద్ధ మతం గురించి 'బుద్ధ మరియు ఆయన ధర్మం' అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథం ద్వారా బుద్ధ ధర్మంలోని నైతికత, సమానత్వం, శాంతిని ప్రజలకువివరించారు.దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత, దేశ నిర్మాణంలో అతిపెద్ద బాధ్యతలలో ఒకటి రాజ్యాంగ రచన. అంబేద్కర్ గారు 1947లో రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన నేతృత్వంలో ప్రపంచంలోని ప్రముఖ రాజ్యాంగాలన్నిటిని అధ్యయనం చేసి భారతదేశానికి ప్రత్యేకమైన, సమతామూలక రాజ్యాంగాన్ని రూపొందించారు. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం, ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం. ఇందులో అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి మూల సిద్ధాంతాలను చేర్చారు. అంబేద్కర్ చేసిన ఈ కృషికి భారతదేశం ఎప్పటికీ ఋణపడి ఉంటుంది. డాక్టర్ అంబేద్కర్ రాజకీయ రంగంలో కూడా తన విలక్షణతను చాటారు. ఆయనకు న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సమాజ శాస్త్రాల్లో ఉన్న లోతైన అవగాహన, ప్రజల పట్ల నిబద్ధత, అతుల్యమైన నైతిక ధైర్యం రాజకీయాల్లో ఆయనను ఒక మహత్తర నాయకుడిగా మార్చాయి. 1936లో ఆయన 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ' అనే రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ పార్టీ ద్వారా శ్రమికులు, అణగారిన వర్గాల పక్షాన నిరంతరం పోరాడారు. 1942లో అతను షెడ్యూల్ కాస్ట్స్ ఫెడరేషన్ అనే మరో పార్టీని స్థాపించారు. స్వాతంత్ర్యం తర్వాత భారత తొలి కేబినెట్‌లో ఆయన న్యాయమంత్రిగా పనిచేశారు. ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పలు ముఖ్యమైన చట్టాలను రూపొందించారు. అంబేద్కర్ రాజకీయాల్లో విజయం పొందాలని ఆశించలేదు, కానీ ప్రజల హక్కుల కోసం ఎప్పటికీ నిలబడ్డారు.

అంబేద్కర్ గారు ఒక గొప్ప రచయిత, ఆలోచనాపరుడిగా ప్రసిద్ధి పొందారు. ఆయన రచనలు సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై విశ్లేషణాత్మకంగా ఉంటాయి. ముఖ్యమైన రచనలు:

Annihilation of Caste - కులవ్యవస్థపై అతికఠిన విమర్శ, The Problem of the Rupee - భారత ఆర్థిక వ్యవస్థపై లోతైన విశ్లేషణ, Thoughts on Linguistic States - భాషా ఆధారంగా రాష్ట్రాల ఏర్పాటుపై అభిప్రాయం, Buddha and His dhamma-బుద్ధ మతంపై సమగ్రమైన గ్రంథం, ఇతర రచనలతో పాటు ఆయన సమకాలీన రాజకీయ పరిస్థితులపై కూడా అనేక వ్యాసాలు రాశారు. ఆయన రచనలు నేటికీ విద్యార్థులు, పరిశోధకులు అధ్యయనం చేసే మూల స్రోతసులుగా ఉన్నాయి.అంబేద్కర్ గారి సేవలు భారతదేశానికి ఓ మార్గదర్శక దీపంలా నిలిచాయి. ఆయన మానవత్వం, సమానత్వం, స్వేచ్ఛపై విశ్వాసం దేశ నిర్మాణంలో కీలక పాత్ర వహించాయి. ఆయన ఆలోచనలు రాజ్యాంగ పాఠశాలలో మాత్రమే కాదు, సమాజంలో ప్రతి వర్గానికీ మార్గదర్శకంగా నిలిచాయి.నేడు దేశంలో పలు విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు అంబేద్కర్ పేరిట ఉన్నాయి. యునివర్శిటీ ఆఫ్ హైదరాబాద్లో 'అంబేద్కర్ స్టడీస్' కేంద్రం, ఢిల్లీలో అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ వంటి ఎన్నో సంస్థలు ఆయన ఆలోచనల ప్రచారానికి కృషి చేస్తున్నాయి. అంబేద్కర్ గారి జీవితం ఒక ఉద్యమం. ప్రతి యువతకి ఆయన జీవితం నుండి పాఠాలు చాలా ఉన్నాయి.ఆయన జీవితం విద్యతోనే మార్పు సాధ్యమని చెబుతుంది. వ్యక్తిగత హక్కులు, అభివృద్ధికి స్వేచ్ఛ ఉండాలి.

**నైతిక విలువలు:** ధైర్యం, సత్యం, నిబద్ధత - ఇవే నిజమైన జీవన మూలాలు.డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఒక మేధావి, రాజనీతి శాస్త్రవేత్త, ఆర్థికవేత్త, న్యాయవాది మాత్రమే కాక, భారత దేశానికి ఒక ప్రాణం. ఆయన చేసిన సేవలు, ఉద్యమాలు, రచనలు ఈ దేశపు భావితరాలకు దిశా నిర్దేశనం చేస్తాయి. ప్రతి ఏప్రిల్ 14న ఆయన జయంతిని ఘనంగా జరపడం ఆయన పట్ల మన గౌరవాన్ని వ్యక్తపరచే పద్ధతి. కానీ అదే సమయంలో, ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టి, సమాజాన్ని సమతా మార్గంలో నడిపించడం నిజమైన అంబేద్కర్ జయంతి ఉత్సవం.

**- మన్నారం నాగరాజు**
**రాష్ట్ర అధ్యక్షుడు**
**తెలంగాణ లోక్‌సత్తా పార్టీ**
**95508 44433**

## నే చేసిన తప్పేంటి



భవిష్యత్‌పై మధురోహలతో
ఏడడుగులు నడచిన చెలికానితో
ప్రకృతి ఆస్వాదిస్తున్న వేళ
మతమౌఢ్యపు ముసుగులో
ఉన్మాదంతో ఉగ్రవేదం రాస్తూ
దానవత్వాన్ని ప్రభోదిస్తూ
సాటి మనుషుల ఉసురుదీయ
అసురులైన మనుషుల చేతిలో
పెళ్ళైన నాల్గోరోజే నాకు వైధవ్యం
నే చేసిన తప్పేమిటి? నా కెందుకీ శిక్ష?
నా గుండెల్లో రగులుకున్న
కార్చిచ్చుకెవరు బాధ్యులు
మాటలురాని మృగాలు
మంచిగ కలిసి జీవిస్తున్నా,
మానవత్వాన్ని మంట గలుపు తోన్న
ఓ మతమా!
నీవల్ల మాయమైన
మనిషి తత్వాన్ని ఎక్కడని వెతకాలి?
నీకు తెలిస్తే కాస్తంత చెప్పవూ!

**(ఉగ్ర దాడిలో పెళ్ళైన నాల్గో రోజే వైధవ్యం)**
**వేమూరి శ్రీనివాస్**
**9912128967**

# లెనిన్ ఖనన ప్రక్రియను నిలిపివేయాలి



ప్రథమ సోషలిస్ట్ రాజ్య నిర్మాత, రష్యా మాజీ అధ్య క్షుడు వి.ఐ.లెనిన్ అంత్యక్రి యలకు రష్యన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రసార మాధ్యమాలు వెల్లడిస్తున్నా యి.'లెనిన్ చనిపోయిన 101 ఏళ్లకు అంత్యక్రియ లు నిర్వహించాలి' అని రష్యన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి.

లెనిన్ భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం రెడ్‌స్క్వేర్ మ్యూజియంలో 1930 నుండి ప్రజల సందర్శనార్థం గత 95 ఏళ్లు పైగానే పటిష్టంగా భద్రపరుస్తూనే ఉన్నారు. కాని ఇప్పుడు 'సామాన్యుల మాదిరిగా లెనిన్ భౌతికకాయానికి 2025 సెప్టెంబర్ 3నాడు ఆయన స్వస్థ లం ఉల్యానోవ్స్కోలో ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు హాజరయ్యే కార్యక్రమంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలి' అని రష్యా అంతర్గత శాఖా నిర్ణయించడం గమనార్హం. ఈ తరుణంలో లెనిన్ మృతదేహాన్ని ఈ క్రమంలో నిత్యం వేలాది మంది సందర్శించే లెనిన్ మ్యూజి యం శాశ్వతంగా మూతపడడం విచారకరం.

1924 జనవరి 21 నాడు వ్లాదిమిర్ లెనిన్ 53 సంవత్సరాల వయసులో మరణించాడు. మరణించిన రెండు రోజుల తర్వాత సోవియట్ దళాలు లెనిన్ మృతదేహాన్ని గోర్కిలోని ఆయన ఇంటి నుండి రైలులో మాస్కోకు తీసుకెళ్లి అక్కడ హౌస్ ఆఫ్ ది యూనియన్స్ యొక్క గ్రాండ్ హాలులో ఒక శవ పేటికలో ఉంచి మూడు రోజుల పాటు ప్రజల సందర్శనార్థం ఉంచి జనవరి 27న మృత దేహాన్ని రెడ్ స్క్వేర్‌కు తరలించారు. ఆయన మృత దేహాన్ని సంతాపానికి వచ్చేవారు సందర్శించ డానికి అను వైన నిర్మాణాన్ని నిర్మించే పనిని ఆర్కిటెక్ట్ అలెక్సీ షుసెవ్ అప్పగించారు. మాస్కోలోని క్రెమ్లిన్ గోడకు దగ్గరగా ఉన్న రెడ్ స్క్వేర్లో నిర్మించిన చెక్క సమాధి లోపల జనవరి 27న లెనిన్‌ని శవ పేటికలో ఉంచారు.

మాస్కోలోని రెడ్‌స్క్వేర్ అంచున క్రెమ్లిన్ గోడల పక్కన సోవియట్ యూనియన్ వ్యవస్థాపక పితామహుడు వ్లాదిమిర్ లెనిన్ మృతదేహాన్ని సంరక్షించిన రాతి సమాధి ఉంది. ప్రపంచ నాయకులను ఎంబామ్ చేసి తరువాత ఖననం చేసినప్పటికీ లెనిన్ మరణించిన ఒక శతాబ్దం తర్వాత కూడా ప్రత్యేక పర్యవేక్షణ చర్యల మూలంగా ఆయన భౌతికకాయం చెక్కుచెదరకుండా అలానే ఉండడం ప్రత్యేకతని సంతరించుకుంది. లెనిన్ మృతదేహాన్ని పూర్తిగా ఆచరణాత్మక కారణాల వల్లే ఎంబామ్ చేశారు అని స్పష్టంగా చెప్ప వచ్చు. సోవియట్ యూనియన్ యొక్క ఆదర్శా లు లెనిన్ సమాధి ద్వారా ప్రతిబింబి స్తూనే ఉన్నాయి. సోవియట్ ప్రజ లు కమ్యూనిస్ట్ శ్రమ ఫలా లను అందరూ ఆస్వాదించగల ప్రకా శవంతమైన భవిష్యత్తు కోసం ఎదురుచూడాలని ఆయన సమాధి చెప్పకనే చెబుతుం డటం గమనార్హం.

'నేడు మాస్కో నడిబొడ్డున లెనిన్ సమాధి కమ్యూనిస్ట్ శక్తికి ఒక చిహ్నంగా మారింది'.

ఆర్కిటెక్ట్ అలెక్సీ షుసేవ్ రూపొందించిన పాలరాయి,పోర్ఫిరీ,గ్రానైట్ మరి యు లాబ్రడోరైట్లతో కూ డిన కొత్త శాశ్వత రాతి సమాధి నిర్మాణం పదహారు నెలలు కొన సాగి చివరకు 1930 అక్టోబర్లో పూర్త యినప్పటి నుండి లెనిన్ మృతదేహాన్ని దాదాపు నిరంతరం ప్రజల సందర్శనార్థం ఉంచారు. 1941 అక్టోబర్ నెలలో రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా లో గ్రేట్ పేట్రియాటిక్ యుద్ధంగా పిలువబడే సమ యంలో మాస్కోను స్వాధీనం చేసుకునే అవకాశం కనిపించినప్పుడు లెనిన్ మృతదేహాన్ని సైబీరియాలోని త్యూమెన్‌కు తరలించి యుద్ధ విరమణ తర్వాత ఆయన భౌతికకాయాన్ని తిరిగి యథాస్థానానికి తీసుకురావడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

1991లో సోవియట్ యూనియన్ పతనం చెందే వరకు లెనిన్ మృతదేహం నిరంతర సంరక్షణ పనులకు సోవియట్ ప్రభుత్వం నిధులు సమకూర్చింది. 1991 తర్వాత ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని నిలిపివేయగా ఆ తర్వాత సమాధికి ప్రైవేట్ విరాళాల ద్వారా నిధులు సమకూర్చారు. 2012 నుండి సమాధి పునాది పునర్నిర్మాణానికి నోచుకుని 2013 నాడు తిరిగి తెరవబడింది. 2016లో రష్యన్ ప్రభుత్వం తన మునుపటి నిర్ణయాన్ని మా ర్చుకుని లెనిన్ మృతదేహాన్ని సంరక్షించడానికి 13 మిలియన్ రూబిళ్లు ఖర్చు చేస్తామని ప్రకటించి ఆ దిశగానే ముందుకు సాగింది.

1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత లెనిన్ భౌతిక కాయాన్ని క్రెమ్లిన్ వాల్ నెక్రో పోలిస్‌కు తరలించాలనే ఆలో చన బహిరంగంగా తీవ్ర చర్చనీయాంశమైంది. 'లెనిన్ సమా ధిని కూల్చివేసి సెయింట్ పీటర్స్ బర్గ్‌లోని వోల్కోవ్ స్మశాన వాటిక లో ఆయన తల్లి మరియా అలె గ్జాండ్రోవ్నా ఉలియానోవా పక్కన లెనిన్ భౌతికకాయాన్ని ఉంచాలి' అని రష్యన్ ఆర్థోడాక్స్ చర్చి మద్దతుతో అప్పటి రష్యా అధ్యక్షుడు బోరిస్ యెల్ట్సి న్ ప్రణాళిక రచించారు. అయితే ఆనాడు వ్లాదిమిర్ పుతిన్ అభ్యంతరం వ్యక్తం చేయడం గమనార్హం.

ఆర్థిక భారం దృష్ట్యా లెనిన్ అంత్యక్రియలు నిర్వహించాలి అని ప్రభుత్వం భావిస్తుంది అని రియా నోవెస్టి ఏజెన్సీ వెల్లడించడం గమనార్హం. 'లెనిన్ మృతదేహాన్ని సంరక్షించడానికి చాలా ఎక్కువ ఖర్చు కావడంతో ఆర్థిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోబడింది.లెనిన్ చనిపోయి 100 ఏళ్ళు దాటి 101 ఏళ్ళు కావస్తుంది. ఆయన భౌతికకాయాన్ని భద్రపరచడం కోసం ప్రతి నెల ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఇలా 100 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న మృతదేహాన్ని సంరక్షించడానికి అవసరమైన నెలవారీ అవసరాలను మేము ఇకపై తీర్చలేము. ఇది ఆర్థికంగా భారమవుతుంది' అని రష్యా ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి పేర్కొనడం ఏమాత్రం సహేతుకం కాదు.

రష్యన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయా భావజాలాలతో సంబంధం లేకుండా కమ్యూనిస్టులు మరియు కమ్యూనిస్టు యేతరులు లెనిన్ అంత్యక్రియలు నిర్వహించడంపై తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు. అందువల్ల ప్రభుత్వ నిర్ణయం ఏమాత్రం ఆమోదయోగ్యం కానేకాదు. ఒక రకంగా ప్రభుత్వ నిర్ణయం 101 ఏళ్ళ చరిత్ర ఉన్న లెనిన్ భౌతిక కాయానికి ఘోర అవమానాన్ని మిగుల్చగలదు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రెస్ ఆఫీస్ తీవ్ర అసంతృప్తిని వెల్లడించి అధ్యక్షుడు పుతిన్‌ను వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని దానిని రద్దు చేయాలని పిలుపునివ్వడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. అందువల్ల ఇకనైననూ రష్యన్ ప్రభుత్వం లెనిన్ ఖనన ప్రక్రియను నిలిపివేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ దిశగా అంతర్జాతీయంగానూ కమ్యూనిస్ట్ శక్తులు రష్యన్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అంతిమంగా 'లెనిన్ వ్యక్తిత్వ ఆరాధనను సజీవంగా ఉంచడానికి, సోవియట్ చట్టబద్ధతను నిలబెట్టడానికి మరియు అసాధారణంగా విలాసవంతమైన అంత్యక్రియల అవసరాన్ని నివారించడానికి బలీయమైన కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించిన లెనిన్ ఆశయాలకు నేడు లెనిన్ భౌతికకాయం ప్రతిరూపంగా నిలుస్తుంది' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.



**- జె.జె.సి.పి. బాబూరావు**
**94933 19690**

## పహెల్గాం

ఇప్పుడు నువ్వు రావు
లేవు అని తెలుసు
నాకు మాత్రమే ఇలా
జరిగింది అని
నేనేం
అనుకోవడం లేదు

కానీ !
ఈ యుద్ధం ఎప్పుడు ఆగుతుందని
ముగుస్తుందని మాత్రమే
నేను అడుగుతున్నాను

ఈ సుందర ప్రదేశంలో
నీతో పాటు , నాతో పాటు
ఎందరో క్షతగాత్రులయ్యారు
మరెందరో మరణించారు

అయినా ! ఇలా కాదు కదా
మరణించాల్సింది
టెర్రరిస్టులు గన్ మోతలకు
పిట్టల్లా రాలిన మిమ్మల్ని చూసి
నా గుండె ఆగిపోయింది
నేను బతికివున్నా లేనట్టే
ఇప్పుడు ! నా ఆలోచన
ఈ యుద్ధాన్ని
ఈ టెర్రరిస్టులను ఎలా ఆపాలని
ఎలా అంతం చేయాలని మాత్రమే !
మీరెవరు రారు , లేరని తెలుసు.

**(పహెల్గాం దాడిలో మరణించిన వారికి నివాళి)**
**- తంగిరాల. సోని**
**96766 09234**



# పంచాయతీల బలోపేతానికి చర్యలేవి?



చారిత్రకంగా భారత దేశంలో మొట్టమొదట చోళుల పరిపాలన వ్యవస్థ'స్వయం పరిపాలన'కు నాంది పలికింది.స్వాతంత్ర్య అనంతరం మన దేశంలో పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా స్థానిక స్వపరిపాలన కొరకు మూడంచెల 'పంచాయతీ రాజ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడం జరిగినది.ఇది కిందిస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన మైలురాయిగా చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకుంది.అదేవిధంగా స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష వేదికగా నిలిచింది.మనదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే.. గ్రామీణ ప్రజల ఆర్థిక,సామాజిక అభివృద్ధిని ఆకాంక్షిస్తూ భారత ప్రభుత్వం మొట్టమొదటిసారిగా 1952లో సామాజిక అభివృద్ధి కార్యక్రమాన్నిప్రారంభించింది.తదుపరి జాతీయ విస్తరణ సేవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం లేకపోవడంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమం, జాతీయ విస్తరణ సేవా పథకంక్షేత్ర స్థాయిలో అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాయి.వీటి అమలు విధానాన్ని అధ్యయనం చేసి వాటిని మరింత పటిష్టం చేయడానికి అవసరమైన సూచనల కొరకు భారత ప్రభుత్వం1957లో బల్వంతరాయ్ మెహతా కమిటీని నియమించింది.ఈ కమిటీ సూచించిన ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానమే నేటి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థకు దారి తీసింది. తదుపరి అనేక కమిటీల సిఫార్సుల మేరకు బలమైన మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రం రాజస్థాన్ కాగా రెండవది ఆంధ్ర ప్రదేశ్. ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో స్థానిక సంస్థల పరిపుష్టం చేయడానికి73 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. దీనిని 1993,ఏప్రిల్ 24 నుంచి అమలు చేయడం జరిగింది. భారత ప్రభుత్వం అధికారికంగా 2010నుండి ప్రతి ఏటా ఈ రోజు 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం'గా నిర్వహించడం జరుగు తుంది.ఈ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగం 9వ భాగంలో పంచాయతీల పేరుతో ఒక కొత్త అధ్యయనం చేర్చి అధికరణ 243అ నుండి 243 వరకు నిబంధనలు పొందుపరిచారు. రాజ్యాంగంలో 11 షెడ్యూల్ అదనంగా చేర్చి,పంచాయతీరాజ్ సంస్థలు నిర్వర్తించాల్సిన 29 విధులను కూడా పొందుపరచారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో40వ అధికరణం యొక్క ఆచరణీయ కార్యక్రమానికి నిదర్శనంగా పంచాయితీ రాజ్ వ్యవస్థను పేర్కొనవచ్చు. 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీ వ్యవస్థకు రాజ్యాంగపరమైన హోదా కల్పించడం జరిగింది. దీనిని మొదట అమలుపరిచిన రాష్ట్రం మధ్యప్రదేశ్. గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో మండల పంచాయతీ, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ వ్యవస్థ ఏర్పాటు చేయబడినది. వీటి సభ్యు లందరూ ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నుకోబడతారు. గ్రామ పంచాయతీ పౌర సరఫరాల కల్పన, మంచినీటి సరఫరా, పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణ,రోడ్లు, జనన మరణాలు నమోదు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం లాంటి అనేక అంశాలను నిర్వహించడం జరుగుతుంది. పంచాయతీ వ్యవస్థ ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్లి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషించిన, క్షేత్ర స్థాయిలో అనేక వైఫల్యాలను చవిచూడడం జరుగుతుంది.ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామ సభలే నిర్వహించాలి కానీ ఆచరణలో జరగడం లేదు.ఆర్థిక వనరుల కొరత స్థానిక సంస్థల స్ఫూర్తిని నిరుగారుస్తున్నాయి. మహిళలకు బలహీన వర్గాల వారికి చట్టపరంగా సముచిత ప్రాధాన్యత కల్పించినప్పటికీ ఆచరణలో ఆశించిన మేరకు తమ ఉనికిని చాటుకోలేకపోతున్నారు. దీనికి గల కారణం తరతరాలుగా కొనసాగుతున్న సాంప్రదాయాలు,కుల వ్యవస్థ, పురుషాధిపత్యం అని పేర్కొనవచ్చు. పేదరికం, నిరక్షరాస్యత, రాజకీయ చైతన్యం,లేకపోవడం వల్ల స్థానిక సంస్థల పనితీరుకు అడ్డంకిగా మారుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టాన్ని అమలులో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వడం వలన కూడా రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం, ఆర్థిక సంఘం సిఫార్సులను కూడా ఖేతారు జరుగుతుంది. పంచాయతీరాజ్ వ్యవస్థలోనీ లోపాలను సవరించి మరిన్ని అధికారాలు ఇస్తూ తెలంగాణ రాష్ట్రంలోని నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 రూపొందించడం జరిగింది. ఆచరణలో మాత్రం పటిష్టంగా ముందుకు పోవడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కూడా గత సంవత్సర కాలం నుంచి పంచాయతీ ఎలక్షన్లు జరగడం లేదు. దీంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా రాక పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుంది. 11వ షెడ్యూల్లో పొందుపరిచిన అంశాలను పూర్తిగా స్థానిక సంస్థలకు బదిలీ జరగకపోవడం వలన వాటి పనితీరు దెబ్బతింటుంది. గ్రామ స్థాయిలో ప్రభుత్వం నెలకొల్పిన అనేక సంఘాలు,కమిటీలు సమాంతర వ్యవస్థలుగా మారి పంచాయతీలను బలహీనపరిస్తున్నాయి. ఈ మధ్య పంచాయతీ పాలకవర్గంలో రోజురోజుకు పెరిగిపోతున్న రాజకీయ జోక్యం వలన పాలకవర్గం ప్రభుత్వ ప్రతినిధులకు అనుచరులుగా మారి పంచాయతీల స్వతంత్రను దెబ్బతీస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల పనితీరును బలోపేతం చేయడానికి 'కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రిత్వ శాఖ' పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా దేశంలో ప్రతి జిల్లాలో జిల్లా ప్రణాళిక కమిటీ ఏర్పాటు చేసి, పంచాయితీలకు అన్ని అధికారుల బదిలీ చేసి రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయ నిధులను కేంద్రం మంజూరు చేయాలన్నది. పంచాయతీలకు పలు అంశాలపై పన్నులు విధించే అధికారం కల్పించి, పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొనడం జరిగింది. అదేవిధంగా రెండో పరిపాలనా సంస్కరణల సంఘం కూడా అనేక సూచనలు చేసింది. ఇది స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ స్వయం ప్రతిపత్తి కల్పించడమే కాకుండా,స్థానిక సంస్థలకు జవాబుదారిగా ఉన్నాయి. వీటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు పరచి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడే గ్రామస్వరాజ్యం సాధ్యమౌతుంది.



**(నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం)**
**- సంపతి రమేష్ మహారాజ్**
**7989579428**

# భూ భారతితో పొరపాట్ల సవరణకు అవకాశం

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**చొప్పదండి, ఏప్రిల్23( మనం న్యూస్):** రైతుల భూములకు సంబంధించి పాస్ పుస్తకాల్లో పొరపాట్ల సవరణకు భూభారతి చట్టంలో అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 పై బుధవారం చొప్పదండిలోని ఎఖ్ఖు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా లభించనుందని అన్నారు. రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఆధారాలతో దరఖాస్తు చేస్తే పాస్ పుస్తకాల్లోని తప్పులను సవరిస్తామని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టాలు ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. గతంలో తహసిల్దారు పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయి లోని సత్వరం పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి ఎటువంటి నియమ నిబంధనలు లేకపోవడంతో రైతులు, అధికారులు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. రైతులు తమ భూమిని తాము అవసరానికి అమ్ముకునే పరిస్థితి కూడా ఉండేది కాదని అన్నారు. ధరణిలో సవరణకు, సమస్యల పరిష్కారానికి, కింది స్థాయి అధికారులకు ఎటువంటి అధికారాలూ లేనందున వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ ఉండేవని, ఆరు నెలల క్రితం అధికారాలు విభజించడం ద్వారా సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వ్యవసాయ అదనపు సహాయ సంచాలకులు ప్రియదర్శిని, మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పద్మాకర్ రెడ్డి, రెవిన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ ఎస్సారెస్పీ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- **ఏసీబీకి చిక్కిన ఎస్సారెస్పీకి చెందిన ఇద్దరు ఉద్యోగులు**



ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలియజేశారు.

**సుల్తానాబాద్, ఏప్రిల్ 23 (మనం న్యూస్):** లంచగొండి అధికారులు మరోసారి ఏసీబీ వలలో చిక్కారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ భద్రయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 20వేల రూపాయల లంచం తీసుకుంటుండగా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ డివిజన్ సిక్స్ సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ లు పట్టుబడ్డారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఇజాజ్ సిక్ లీవ్ పెట్టగా, అది ధ్రువీకరించేందుకు 20వేల రూపాయలు లంచం అడగ్గా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు దాడులు నిర్వహించి

# ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం




- **ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు**

**కరీంనగర్, ఏప్రిల్ 23 (మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులను సాధించి మరోసారి విద్యాసంస్థల కీర్తిని దశదిశలా చాటారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అన్ని విభాగాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన అల్ఫోర్స్ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఇంటర్మీడియట్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను జె.అంజనా 997 మార్కులు సాధించి రాష్ట్రంలో అగ్రగామిగా నిలవగా, మరో 11 మంది విద్యార్థులు 990 ఆపై మార్కులు సాధించడం విశేషం. అలాగే ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను కె.రుత్విక్ అనే విద్యార్థి 996 సాధించి రాష్ట్రవ్యాప్తంగా అత్యున్నత స్థానంలో నిలవగా పి. శ్రీనిత్యారెడ్డి 995, ఎం.రుత్విక 995, ఎ.లక్ష్మీప్రసన్న 995, ఎస్.సేవిత 994, వి.ఋషికేష్ 994, ఎం.అక్షిత 994, వి.సాహితి 994, ఎస్. కార్తికేయ 994, జి.లక్ష్మిప్రసన్న 994. కె.వర్షిణి 994, ఎం.కీర్తి 994 చొప్పున మార్కులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేశారు. ఇదే గాకుండా మరో 128 మంది విద్యార్థులు 990 ఆపైన మార్కులు సాధించగా, 2వేల293 మంది విద్యార్థులు 900 ఆపై మార్కులు సాధించారు. ఎంఇసి విభాగంలోను 1000 మార్కులకు గాను వి.అక్షయ్‌వర్థన్ 988, వి.రిషిత 988 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. సిఇసి విభాగంలో 1000 మార్కులకు గాను బి.గ్రీష్మ 987 మార్కులు సాధించింది.

**ప్రథమ సంవత్సరంలో...**

జూనియర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను ఎస్. లహరి 468, హప్సహస్నాన్ 468, తహూరా నూర్ 468, టి. అన్వితారెడ్డి 468, సిహెచ్. అమతౌరాజ్ 468, పి.కిర్తిశ్రీ 468, జె. ప్రసూనాశ్రీ 468, ఎన్.క్రిష్ణవేణి 468, జి.తరుణ్ 468, డి.నాగాసాగర్ 468, జె.ప్రణవ 468, జి.సూర్యప్రకాశ్ 468, ఎ. శశివర్ధన్ రెడ్డి 468, ఎల్.హాసిని 468, ఎం.శ్వేత 468, కె.పల్లవి 468, కె.అనుపమ 468, ఏ.నిచిత 468, జి.తరుణ్ 468, జి. లక్ష్మిప్రియ 468, మొత్తం 20 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించి అత్యుత్తమ స్థానంలో నిలిచారు. 66 మంది విద్యార్థులు 467 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు. బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను నభిలాతరీమ్ 438, జోహ మహవీష్ 438, సామాపిరదోష్ 438 మార్కులు సాధించగా, మరో పది మంది విద్యార్థులు 437 ఆపై మార్కులు సాధించారు. ఎంఇసి విభాగంలో 500 మార్కులకు గాను ఆర్. చిద్విలాస 491, మార్కులు సాధించగా, సిఇసి విభాగంలో 500 మార్కులకు గాను పి.భవజ్ఞ 493 మార్కులు సాధించింది.

**నాణ్యమైన బోధన, చక్కని క్రమశిక్షణతోనే విజయాలు: అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి**

తమ విద్యాసంస్థల్లో నాణ్యమైన బోధనకు చక్కని క్రమశిక్షణ తోడవడంతోనే సంచలనాత్మక విజయాలు సాధిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సుశిక్షితులైన అధ్యాపకుల పర్యవేక్షణలో తమ విద్యారుర్థులు నాణ్యమైన విద్యానందు కుంటున్నారనడానికి ప్రతి ఏటా సొంతమవుతున్న సంచలనాత్మక విజయాలే నిదర్శనమన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటి మెయిన్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్, ఎంసెట్ పరీక్షల్లో కూడా అఖండ విజయం సాధిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన, పర్యవేక్షణకు తోడు విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఇంటర్ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన తమ అల్ఫోర్స్ ఆణిముత్యాలతో పాటు వారి తల్లిదండ్రులను మన స్ఫూర్తిగా అభినందించారు.

# వడదెబ్బ వివరాలు తెలుసుకొనడానికి త్రీ మెన్ కమిటీ ఏర్పాటు




- **మంచిర్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి**
- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు**

**మంచిర్యాల, ఏప్రిల్ 23 ( మనం న్యూస్):** మంచిర్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి వడదెబ్బ వాటి వివరాలు తెలుసుకొనడానికి త్రీ మెన్ కమిటీ ని ఏర్పాటు చేసినట్లుమంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు కోరారు .ఈ మేరకు వాతావరణ శాఖ కూడా హెచ్చరికలు చేసిందని అన్నారు . బుధవారం అయన మాట్లాడుతూ , ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, మండల పరిధిలో వడదెబ్బకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, స్థానిక వైద్యాధికారి, పోలీస్ ఇన్స్పెక్టర్, తహసిల్దార్ లను వడదెబ్బ వాటిపైన వివరాలను తెలుసుకొనడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు . అదేవిధంగా జిల్లాలోని అన్ని డిపార్ట్మెంట్ లతో మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డిస్టిక్ టాస్క్ ఫోర్స్ మీటింగ్ ఏర్పాటు చేయడమైనదని, ప్రజల్లో అవగాహన కలిగించడానికి ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, చిన్నపిల్లలు, గర్భవతులు, షుగర్ వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా వృద్ధులు, ఎండలో బయటకు రావద్దని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ఎండ దెబ్బ తగిలే అవకాశం ఉన్నదని, అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని సూచించారు . ప్రజలు ముఖ్యంగా వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవాలని మంచినీటిని ఎక్కువగా తాగాలని, రోడ్డుపైనే అమ్మే పదార్థాలను తీసుకోరావద్దని , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉప కేంద్రాలలో సిబ్బందిని వైద్యులను అలర్ట్ చేయడం ,ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ డిపోను పెట్టడం జరిగిందని , అదేవిధంగా జిల్లాలో 74 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్యులకు ఆదేశించ్చామన్నారు .

ప్రజలు త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని, ఎండకు ఇంటి దగ్గరనే ఉండాలని, ముఖ్యంగా ఉపాధి పనికి వెళ్లేవారు, రేషన్ షాపుల దగ్గర, ఇటుక పట్టీల దగ్గర, ఎండలో పనిచేసే ఇంటి పని దగ్గర, కన్స్ట్రక్షన్ బిల్డింగ్ దగ్గర, నీటి చలివేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు . అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ లను అందుబాటులో ఉంచడం జరిగినదని జిల్లా ఆస్పత్రిలో కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉంటారని వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

మంచిర్యాల జిల్లాలోని చాలా స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకుల దగ్గర, మెయిన్ రోడ్లలో, ఇతర ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలలో, చలివేంద్రాలను ఏర్పాటు చేశారని, ఇంకా స్వచ్ఛంద సంస్థలు నీటి దాహం ,నీటి త్రాగే నీటిని అందుబాటులో ఉంచడానికి ముందుకు రావాలని అయన విజ్ఞప్తి చేశారు .

జిల్లాలో కరపత్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు . భానుడి భగభగలతో ప్రజలు చాలా కష్టాలు పడుతున్నారని , వాతావరణంలో మార్పుల వలన ఉష్ణోగ్రతలు పెరగడం వలన మనమే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్ ఎపిడి మాలజిస్ట్, బుక్ వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి తదితరలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థుల విజయభేరి

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయభేరీ మోగించారు. కరీంనగర్, పెద్దపల్లిలోని ట్రినిటీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి సంచలనం సృష్టించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలో చేరిన విద్యార్థుల ఫౌండేషన్ మెరుగుపరుస్తూ, ఖచ్చితమైన ప్రణాళికతో సిలబస్ పూర్తి చేయడంతో పాటు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన సాధించడం వల్లనే తమకు విజయాలు సొంతమవు తున్నాయన్నారు. తగినంత సమయం రివిజన్ కొరకు ఉపయోగించి, విద్యార్థులలో నమ్మకం కలిగించడం ద్వారా వారు ఒకరికి ఒకరు పోటీపడి రాష్ట్రస్థాయి మార్కులు సాధించడానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఒత్తిడిలేని విద్యా విధానం తమ ప్రత్యేకతని, విద్యార్థులు చదువులో ఉన్న వెనుకబాటుతనాన్ని గుర్తించి సరిచేయడం ద్వారా ఉత్తమ మార్కులు సాధించడం వీలైందని తెలిపారు.

**ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు:**

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను జి.మధురిమ 468 మార్కులు సాధించగా, డి. సిరి వైష్ణవ్య, ఆర్.ఉమాదేవి, వికాస సాహి, కె.శశాంక్, ఎ.లహర్షిక, ఇ.అనూష, బి. వైష్ణవి, వి.అర్చన, మేకల వైష్ణవి, ఏ.హారిక, టి.శ్రీవర్ష, ఎస్.శ్రీజ, పి.రిపిక, జె.శరణ్య, ఫలిత ఐనాయత్, ఏం.రశ్మిత, జి.నేహ, పి.నిఖితతో పాటు మొత్తం 18 మంది 467 మార్కులు సాధించారు. మరో 48 మంది విద్యార్థులు 456 పైన, 67 మంది 455 మార్కులకు పైగా సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 450 మార్కులకు గాను పి.సహస్ర, ఎల్. హేమ నందిని 438 మార్కులు సాధించారు. జె.సౌమ్య, కె.విజయలక్ష్మి, సిహెచ్.హాసినిలు 437 చొప్పున, 16 మంది విద్యార్థులు 436 మార్కులు, 21 మంది విద్యార్థులు 435 మార్కులు చొప్పున సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారు. సిఇసి విభాగంలో వైష్ణవి 494 మార్కులు, డి.రాహుల్ 490 మార్కులు, ఆర్.పి.దీపిక 490 మార్కులు సాధించారు. అలాగే ఎంఇసి విభాగంలో భువనవిజయ్ 479 మార్కులు, ఎ. శ్రావణి 467 మార్కులు సాధించారు.

**ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రభంజనం:**

ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 1000 మార్కులు గానూ వి.రశ్మిత 995 మార్కులు సాధించగా, జి.అజయ్, బి. హితేష్, సిహెచ్.బాలాజి, ఎమ్.సంధ్య, కె.ప్రణతి, కె.సాయి సంహిత మొత్తం ఆరుగురు విద్యార్థులు 994 మార్కులు, 13 మంది విద్యార్థులు 993 మార్కులు, 21 మంది విద్యార్థులు 992 మార్కులు, 27 మంది విద్యార్థులు 991 మార్కులు, మొత్తం 30 మంది విద్యార్థులు 990 మార్కుల పైన సాధించారు. బైపీసీ విభాగంలో డి.జోత్స్నశ్రీ 996 మార్కులు. వి.మహతి, కె.పల్లవి 994 మార్కులు సాధించారు. మరో నలుగురు విద్యార్థులు 993 మార్కులు సాధించగా, ఏడుగురు విద్యార్థులు 992 మార్కులు, 12 మంది 991 మార్కులు, 16మంది 990 మార్కులు సాధించారు. సిఇసి విభాగంలో ఎ. కృతి 981 మార్కులు, ఎంఇసి విభాగంలో దేశకశర్మ 980 మార్కులు సాధించారు.




# భూభారతిపై రైతులకు అవగాహన కల్పించాలి

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**వేములవాడ రూరల్, ఏప్రిల్ 23 (మనం న్యూస్):** : భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.భూభారతి చట్టంపై అవగాహన సదస్సును వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో బుధవారం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ,భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూభారత చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.భూ సమస్యలతో బాధపడే వారంతా చట్టాన్ని సద్వినియం చేసుకొని హక్కులు పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని వివరించారు.ప్రజా ప్రభుత్వంలో 20 వేల కోట్ల పై చిలుకు రూపాయలతో 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని వివరించారు.ప్రజా ప్రతినిధులు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. హన్మాజీపేట్ పేట బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు.

హన్మాజీపేట్ పేట బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఎదురైతే తాను, కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కారం చేయడం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు - భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు, పాసుపుస్తకాలలో భూమి పటం ఉంటుందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఏ ఎమ్ సీ చైర్మెన్ రొండి రాజు, వేములవాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు విజయ్ ప్రకాష్ రావు, అబూ బాకర్, వ్యవసాయ అధికారి సాయి కిరణ్ పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతులు తదితరులు ఉన్నారు.

# ప్రతిరోజు పారిశుద్యసిబ్బందికి సహకరించాలి

- **పరిసరాల పరిశుభ్రతను పాటించాలి**

**మంచిర్యాల, ఏప్రిల్ 23, ( మనం న్యూస్):** ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని చెత్తను మూడు డస్ట్ బిన్ లో వేయాలని, ప్రతిరోజు పారిశుద్ధ సిబ్బందికి సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, మంచిర్యాల నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ టి శివాజీ కోరారు. బుధవారం మంచిర్యాల నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచిర్యాల మున్సిపాలిటీలోని వార్డు నెంబర్ 34 , మంచిర్యాల కార్యాలయం లో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు తడిచెత్త-పొడిచెత్త లపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ కు సంబంధించిన అవగాహన ర్యాలీని 61 మంది గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో మంచిర్యాల నగలపాలక సంస్థ కార్యాలయం నుంచి పట్టణంలోని కూరగాయల మార్కెట్ వరకు భారీగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ బి రాజ మనోహర్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఇంచార్జులు టి ఉదయ్ కిరణ్, ఎం వైకుంఠం, ఎం శివరామకృష్ణ, శానిటరీ జవాన్ ఎస్ రాజం శానిటరీ సిబ్బంది ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుజాత, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్లేలను పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. వేరు చేద్దాం వేరు చేద్దాం, తడి చెత్త పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేద్దాం అందరు అంటూ నినాదాలు చేశారు.



# ఎ.ఎన్.సి పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23( మనం న్యూస్):** నగరం లోని ఏఎన్‌సి పాఠశాలలో శ్రేష్ఠత ఉత్సవం పేరుతో వార్షిక దినోత్సవం నిర్వహించారు. దీనికీ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్రా మధుసూధన్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహిపాల్రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి,సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి వేడుకని ప్రారంభించారు. తధుపరి చిన్నారులు వివిధ కళల నృత్యాలని ప్రదర్శించి చూపరులని ఆకట్టుకన్నారు.ఈ వేడుకలో తల్లితండ్రులు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ తక్కువ సమయంలో చిన్నారులు నృత్యాలని నేర్చుకొని పాటలతో నాటికలతో ఎక్సలెన్స్ వేడుకని విజయవంతం చేశారని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన మధు సూధనరెడ్డికి, తల్లితండ్రులకి కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలి

- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి, ఏప్రిల్ 23 ( మనం ప్రతినిధి):** అర్హత కలిగిన కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం లింగం పేట్ మండల కేంద్రం లోని బిసి కాలనీ కి చెందిన ఇబ్రహీం మమత రేకులషెడ్ ను కలెక్టర్ పరిశీలించారు. తాను కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను అని, తన భర్త మరణించాడని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనీ కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం ఉన్న రేకుల షెడ్ ను తొలగించి, అదే స్థలంలో ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల రూపాయలతో పాటు ఇతర మార్గాల ద్వారా ఇల్లు నిర్మించుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఇతర సిబ్బంది ఉన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టం

- **ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**వాజేడు, ఏప్రిల్ 23, (మనం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన భూభారతి చట్టం లో భూమికి సంబంధించిన అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలో గల రైతు వేదికలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సు లో బుధవారం ఆయన పాల్గొని చట్టంలో గల ముఖ్యమైన విషయాలను రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మమేకమై మాట్లాడుతూ భూభారతి చట్టం లోగల విషయాలను క్లుప్తంగా వివరించారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ధరణిలో పరిష్కరించలేని సమస్యలను భూభారతిలో సరి చేయవచ్చని తెలిపారు. రైతు పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులను తక్షణమే పరిష్కరించవచ్చని తెలిపారు. గతంలో సెటిల్మెంట్ పట్టాలు ఉన్న రైతులు ధరణిలో పట్టా మార్పు చెంది వస్తుందనే సమస్యకు కూడా పరిష్కారం వెంటనే లభిస్తుందన్నారు. రైతులు సాగు చేసుకునే భూములలో గతంలో అసైన్మెంట్ భూమి అని ఉండేవి ఇప్పుడు గవర్నమెంట్ భూమి అని చూపిస్తుంది అనే సమస్యలను రెవిన్యూ శాఖ వారు పరిశీలించి పరిష్కరిస్తారని అన్నారు. రైతుల యొక్క సమస్యలను ప్రస్తావిస్తూ గతంలో ఉన్న ఆధారాలను జతపరుస్తూ స్థానికంగ గల రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు సూచించారు. భూమి పొజిషన్లో ఒకరు ఉండి పట్ట మరొకరి పేరు వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయని అలాంటి సమస్యలకు భూభారతిలో వెంటనే పరిష్కారం దొరుకుతుందని అన్నారు. వారసత్వ భూములకు సంబంధించిన విభజన సిబ్బంది ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించి వారసత్వంలో కుటుంబ సభ్యులు అందరూ ఒప్పుకున్న తర్వాతనే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ఒక సంవత్సరం గడువు ఇచ్చిందని ఎవరు ఆందోళన చెందవద్దని రైతులతో మాట్లాడారు. భూభారతి చట్టంలో సమస్యలన్నీ స్థానికంగానే పరిష్కారం అవుతాయని, ఒకవేళ అక్కడ భూమి కలిగిన ఆసామి తృప్తి చెందని యెడల పై అధికారులను ఆశ్రయించే అవకాశం భూభారతిలో ఉందని తెలిపారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో న్యాయం జరగలేదని అనుకుంటే, ఆర్డీవో కార్యాలయం, అనంతరం జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించవచ్చని తెలిపారు. గతంలో చాలాచోట్ల భూ రికార్డులలో ఒకచోట తప్పుడుగా పేరు నమోదైన వారు అదే అలుసుగా తీసుకొని అక్రమ పట్టాలు చేయించుకొని, పట్టాదారుగా కొనసాగుతున్నారని, ఇప్పుడు భూభారతి చట్టంలో అలాంటి పట్టాదారులను తొలగించబడుతుందని అన్నారు. రైతుకు వెసులుబాటుగా సెకండ్ లెవెల్ అప్పీల్ సిస్టం ఉందని తెలిపారు. భూభారతి చట్టానికి అటవీ భూములకు ఎటువంటి సంబంధం లేదని ఈ సందర్భంగా తెలియజేశారు. భూమి గల వారికి పట్టతోపాటు భవిష్యత్తులో భూధార్ కార్డు ఇవ్వబడుతుందని, ఇందులో సర్వేనెంబర్ పట్టాదారు పేరు, విస్తీర్ణం, భూమి పొజిషన్, డిజిటల్ సర్వే రికార్డు పొందవలసి ఉంటుందని అన్నారు. కావున రైతులు, భూ ఆసాములు తొందరపడకుండా వారి యొక్క సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం సమయం ఇవ్వడం జరిగిందని ఎవరు బ్రోకర్లని ఆశ్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం చదువురాని రైతుల కోసం ప్రభుత్వం వీరికి సహాయంగా ఒక ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి సమస్య పరిష్కారానికి సమాధానాలు, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఓ సర్దార్ సింగ్, స్థానిక ఎమ్మార్వో శ్రీనివాస్, ఆర్ ఐ కుమార స్వామి, ఎంపీ ఓ శ్రీకాంత్ నాయుడు, ఎంపీడీవో విజయ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది , ప్రజలు,పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా శిబిరం



**హైదరాబాద్, ఏప్రిల్ 23(మనంన్యూస్):** ఉద్యోగ నిర్వహణలో శిక్షణ లో నేర్చుకున్న విషయాలు మరింత మెరుగ్గా పని చేసేందుకు ఉపయోగ పడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ కార్యాలయంలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ఈ శిక్షణ కార్యక్రమం తీసుకోవడం వల్ల వారికి తెలియని విషయాలు తెలుసుకోవచ్చని. ముఖ్యంగా రోజు వారి ఉద్యోగంలోని సవాళ్లను అధిగమించేందుకు ఈ శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రిసోర్స్ పర్సన్స్ పి.కృష్ణ రిటైర్డ్ డీపీఓ, అడ్డాకల్ ఎంపిడిఓ విజయ్ కుమార్,, జడ్చర్ల మండలం ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలు శిక్షణ కార్యక్రమం లో పాల్గొన్న 35 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు సమాచార హక్కు చట్టం-2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామ సభ సమాచార హక్కు, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018, వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి పార్థ సారథి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ హనుమంతు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం

- **భూసమస్యల పరిష్కారానికి మంచి రోజులు వచ్చాయి.**
- **నాగర్ కర్నూల్ జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి**



**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 23 ( మనం న్యూస్):** బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా, నియాజకవర్గము లోని ఊరుకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ,. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల యొక్క దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకు విప్లవాత్మకమైన 'భూ భారతి చట్టం'ను రూపొందించిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందన్నారు. ఎంతోమందిమేధావులు,అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. గతంలో సరైన రిజిస్ట్రేషన్ లేకుండా జరిగిన సాధాబైనామా లావాదేవీలకు ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన వారు నిర్దేశిత ప్రక్రియ ద్వారా తమ సాధాబైనామాలను క్రమబద్ధీకరించుకోవచ్చు నని సూచించారు. అంతేకాకుండా, వారసత్వ భూముల విషయంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. భూ సమస్యకు సంబంధించి తహశీల్దార్ స్థాయిలో పరిష్కారం లభించని పక్షంలో, బాధిత పక్షం ఆర్.డి.ఓ (రెవెన్యూ డివిజనల్ అధికారి), జిల్లా కలెక్టర్, లేదా సి.సి.ఎల్.ఎ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) లకు వరుసగా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలియజేశారు. ఈ అప్పీల్ ప్రక్రియ కూడా నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయబడుతుందని జిల్లా కలెక్టర్ వివరించినారు.

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరింత పారదర్శకత మరియు కచ్చితత్వం కోసం ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుందని కలెక్టర్ వెల్లడించారు. ఇకపై ప్రతి భూమి రిజిస్ట్రేషన్ సమయంలో తప్పనిసరిగా ఆ భూమి యొక్క సర్వే నిర్వహించి, మ్యాప్ తయారు చేయబడుతుంది. ఈ మ్యాప్ను కూడా భూమి యజమానికి అందించే పాస్ పుస్తకంలో పొందుపరుస్తారు. దీనివల్ల భవిష్యత్తులో భూ సరిహద్దులు మరియు యాజమాన్యానికి సంబంధించిన వివాదాలు తలెత్తే అవకాశం ఉండదని తెలియజేశారు.

భూ భారతి చట్టం ప్రజలందరికీ మేలు చేకూర్చే ఒక గొప్ప చట్టమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి విజ్ఞప్తి చేశారు. ఈ చట్టం అమలుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆమె తెలిపారు.

ఈ సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్.డి. ఓ, శ్రీనివాసులు,తహశీల్దార్, ఎంపీడీవో, ఎండి యూసుఫ్ అలీ , వ్యవసాయ అధికారి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యాన్ని పోయవద్దు

- **తొగుట సిఐ లతీఫ్**

**తొగుట, ఏప్రిల్ 23, (మనం న్యూస్):** రోడ్ల పై ధాన్యం కుప్పలు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోతున్నారని, సాధ్యమైనంత వరకు రైతులు రోడ్ల పై ధాన్యం పోయారాదని తొగుట సిఐ లతీఫ్ సూచించారు. బుదవారం తొగుట సిఐ లతీఫ్ మీడియాతో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక కొంతమంది గాయాలపాలు కావడం, ప్రమాదం జరిగి చనిపోతున్నారని, బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం



పోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు అవి తగిలి చనిపోవడం జరుగుతుందని, ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.

# గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- **వైద్యులు,ఆశాలు, సమన్వయంతో సేవలందించాలి**
- **మాతా శిశు మరణాలు జరగకూడదు.**
- **వైద్య ఆరోగ్యశాఖ సేవలపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్**

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి) :** గర్భిణులపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, నిరంతరం వారి ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.మాతా శిశు మరణాలు, టీబీ కేసులు, కుష్టు తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ఈ సందర్భంగా గత నెలలో జిల్లాలో డెలివరీ ఎన్ని చేశారో ఆరా తీశారు. మొత్తం దాదాపు 666 డెలివరీలు చేశామని జిల్లా వైద్యాధికారి రజిత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల మరణాలు జిల్లాలో .ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు,డాక్టర్లు, ఆశా కార్యకర్తలు నిత్యం గర్భిణులతో మాట్లాడాలని వారి కుటుంబ ఆరోగ్య చరిత్ర ఇతర వివరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు ఫోన్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ఎక్కువ ప్రసవాలు అయ్యేలా వైద్యులు శ్రద్ధ పెట్టాలని, జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో గైనకాలజిస్టు అవసరం ఉంటే వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులపై ప్రత్యేక నిగా పెట్టాలని, వైద్యానికి శాఖ నిబంధన మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.భ్రూణ హత్యలు ఎక్కడా జరగకూడదని పేర్కొన్నారు. అన్ని హాస్పిటల్ లో పని వేళల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ఉత్తమ సేవ అందించాలని సూచించారు. జిల్లాలో టీబీ కేసులో గుర్తించేందుకు పరీక్షలు నిరంతరం చేయాలని పాజిటివ్ వచ్చిన వారికి తగిన మందులు అందిస్తూ ఆత్మస్థైర్యం కల్పించాలని పేర్కొన్నారు.ఆర్ బిఎస్ కే లో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు ఎక్కడి వరకు చేశారు ప్రోగ్రాం ఆఫీసర్ ను ఆరా తీశారు లక్ష్యం మేరకు కంటి పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉత్తమ సేవలందిస్తూ నిత్యం నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు వీర స్ఫూర్తితో మిగతా వైద్యులు సిబ్బంది సేవలందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రజిత జిల్లా ప్రభుత్వ దారుణ సూపరిండెంట్ లక్ష్మీనారాయణ వేములవాడ ఏరియా హాస్పిటల్ సూపర్ ఇండెంట్ పెంచలయ్య ప్రోగ్రామ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



- **బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్**

**కొమురవెల్లి, ఏప్రిల్ 23, (మనం న్యూస్):** ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని, విద్యార్థి, యువజన విభాగం పెద్ద ఎత్తున తరలి రావాలని కొమురవెల్లి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా కొమురవెల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సూచన మేరకు వరంగల్ ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డులో నిర్వహించే సభకు విద్యార్థి, యువజన విభాగం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలన తెలంగాణ రాష్ట్రానికి శాపంగా మారిందని, కాంగ్రెస్ వైఫల్యాలు తెలంగాణ ప్రజలకు అర్థమయ్యాయన్నారు. యావత్ తెలంగాణ ప్రజలు కెసిఆర్ గురించి మాట్లాడుతున్నారని, కెసిఆర్ సందేశం కోసం రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, ప్రజారంజక పాలనను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలం అయిందని విమర్శించారు. పెండింగ్ లో ఉన్న ఫీ రియంబర్స్మెంట్, గురుకుల పాఠశాలల్లో చనిపోయిన విద్యార్థులకు 50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, యువ వికాసం కింద విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డ్ అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండ శ్రీధర్, గౌటె రవి, గజ్జె వెంకటేష్, ముక్కు విరాట్ బాబు, మహేందర్ యాదవ్, లింగంపల్లి అజయ్ కుమార్, మ్యాకల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

- **డీఈవో శ్రీనివాసరెడ్డి**



**కొండపాక, ఏప్రిల్ 23, మనం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం .లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. పిల్లలను స్మార్ట్ ఫోన్ లకు దూరంగా ఉంచాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల ముందు ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్ వాడకూడదన్నారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని యువత మాదక ద్రవ్యాలకు గురి కాకుండా చూడాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో ఆయా తరగతుల్లో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉత్తీర్ణత ధ్రువపత్రాలను డీఈవో, పాఠశాల బృందం అందజేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న డయాస్ సుందరీకరణకు సుమారుగా రెండు లక్షల రూపాయలను డొనేట్ చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఎం. కిరణ్మయిని, విద్యార్థులకు స్టీల్ బాటిల్ అందజేసిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. తల్లిదండ్రుల సమావేశానికి క్రమం తప్పకుండా హాజరైన తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్మార్ట్ ఫోన్ వాడకంపై బాలురు నిర్వహించిన నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఇంటి వద్ద ఉండే వృద్ధుల ప్రాముఖ్యతను తెలిపే నాటక ప్రదర్శన హాజరైన తల్లిదండ్రులందరినీ ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఈ శ్రీనివాసరెడ్డి, కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ పి . రంగనాథ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం . లక్ష్మీ, హాస్టల్ వార్డెన్ పి.రాజు,టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దీప, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై .బాలయ్య, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం




- **జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**సిద్ధిపేట రూరల్, ఏప్రిల్ 23, మనం న్యూస్:** భూమికి సంబంధించిన సమస్యలు భూ భారతి చట్టం ద్వారా త్వరగా వరిష్కారం కావడం జరుగుతుందని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం నాడు సిద్దిపేట రూరల్ మం డలం రాఘవాపూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టం గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థ సమయంలో ఏదైనా అభ్యంతరాలుంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు.దీని ద్వారా కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్లవచ్చన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జెడ్పి సిఈఓ రమేష్, తహసీల్దార్ వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో శ్రీ చైతన్య కళాశాల విద్యార్థుల విజయభేరి




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23( మనం న్యూస్) :** మంగళవారం విడుదలైన ఇంటర్-2025 ప్రథమ, ద్వితీయ ఫలితాలలో కరీంనగర్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మ్రోగించారు. మంగళవారం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బొకెలతో సత్కరించారు. రెండవ సంవత్సర ఫలితాలలో యం.పి.సి విభాగంలో 1000 గాను ఆర్ వైష్ణవి 993, ఎ. లాస్యికా 992, జి. శ్రీనిత్య 991, పి. భరత్ రెడ్డి 991, ఇ. అకిరానందన్ 991, బైపిసి విభాగంలో ఎ. అభ్యుదయ 994. ఎన్. భార్గవి 992, పి. స్ఫూర్తిశ్రీ 990, బి. రోహిత్ 990. సిఇసి విభాగంలో ఎ. మధుమిత 961, యంఇసి విభాగంలో మెరుగు భానుప్రకాశ్ 951. మొదటి సంవత్సర ఫలితాలలో యం.పి.సి. నందు ఎ. లక్ష్మీహసిని 468, జి. శ్రీహిత 467, పి. హాసిని రావు 467, యం. సాత్విక 467, జి. శ్రీనిధి 467, కె. మైత్రి 467, 466 నందు 22 విద్యార్థులు మరియు 465 నందు 14 విద్యార్థులు బైపిసి విభాగంలో ఈ. అఖిల 437, ఔష సినివాసన్ 437, యస్ విష్ణు 436, వి. లహరి 436, అర్ అక్షయశ్రీ 436, సిహెచ్. కార్తిక్ 436 మరియు 430 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 13, యంఇసి. విభాగంలో ఎల్ కమలేశ్ కుమార్ 474, సూర మనీష 470. సిఇసి విభాగంలో టి. హరిణి 492, కె. అంజలి 491 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. శ్రీ చైతన్య గ్రూఫ్ అఫ్ జూనియర్ కళాశాలలు స్థాపించిన నాటి నుండి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు కేరాఫ్ గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తున్నామని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికలతో పాటు నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల అత్యుత్తమ బోధన విద్యార్థులు పట్టుదల, అహర్నిషల కృషి ఫలితంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులు, అత్యుత్తమ ఫలితాలతో విజయం సాధించారని తెలిపారు. ప్రతి ఏడాది ఎంసెట్, నీట్, ఐఐటి జెఈఈ తదితర పోటి పరీక్షలలో విద్యార్థులు ర్యాంకులు సాధించి శ్రీచైతన్య ఆణిముత్యాలుగా నిలుస్తున్నారని తెలిపారు. అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఈ ఘన విజయంలో పాలు పంచుకున్న తమ అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి , డీన్ జగన్ మోహన్ రెడ్డి , జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మల్లారెడ్డి , రాధాక్రిష్ణ , మోహన్రావుగారు, ఎజియం శ్రీనివాస్ అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసం షీ టీమ్ బృందాలు

- **సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి**




**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23, (మనం న్యూస్):** మహిళల రక్షణకు నిరంతరం షీ టీమ్ బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే షీ టీమ్ బృందానికి సమాచారం అందించాలని షీ టీమ్ బృందం సభ్యులు తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని దేశాయి బీడి కంపెనీ కార్మికులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, షీ టీమ్ విధులు, పోక్సో చట్టం వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాకు వీలైనంత వరకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు సిద్ధిపేట పోలీస్ కమీషనర్ సూచనలకు అనుగుణంగా జిల్లాలో షీ టీమ్ బృందాలు నిరంతరం విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. సామాజిక రుగ్మతల గురించి తెలుసుకోవాలని, జీవితంలో ముందడుగు వేయాలని సూచించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినట్లయితే వారితో జాగ్రత్తగా ఉండాలని , ఎవరైనా హేళనగా మాట్లాడినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే షీ టీమ్ సిబ్బందికి సమాచారం అందించాలని, లేదంటే డయ ఎల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో. షీ టీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుళ్లు లక్ష్మీ నారాయణ, ప్రవీణ్, బీడీ కంపెనీ మేనేజర్ దీవక్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూములకు పూర్తి రక్షణ

- ధరణి లోపాలు భూ భారతిలో ఉండవు
- ఏజెన్సీ చట్టాలు మరింత బలోపేతం
- భూ భారతిపై అవగాహనా సదస్సులో జిల్లా కలెక్టర్ జితేష్
- పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం



చర్ల, ఏప్రిల్ 23 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతుల భూములకు పూర్తిస్థాయి రక్షణ కలుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం చర్లలోని దేవభక్తుని నందీశ్వరుడు పుష్పావతి హాల్ లో భూ భారతి పై రైతులకు అవగాహన కల్పించారు. చట్టం తమ కల్లముందే అమలవడం ప్రతి ఒక్కరికి ఆనందంగా ఉంటుందని, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి రోజూ రాష్ట్ర వ్యాపితంగా భూ భారతి చట్టం అమలులోకి రావడం ప్రతి ఒక్కరికి గర్వకారనమని అన్నారు. రైతుల భద్రత, భూ సమస్యల పరిష్కారం కొరకు ఈ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. గతంలో ఉన్న దరణిలో చేర్పులు మార్పులకు అవకాశం ఉండేది కాదని, దానిలో ఉన్న లోపాలను సవరించి నూతన చట్టాన్ని తీసుకువచ్చినట్లు వివరించారు. రైతులకు ఉన్న లెక్క లిఖితంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రికార్డు లలో భూములకు రక్షణ లేనందున ఆన్ లైన్ లో భూముల వివరాలను నిక్షిప్తం చేస్తున్నట్లు వివరించారు. ధరణిలో భూ వివరాలలో తప్పులు సరిచేసే అవకాశం ఉండేది కాదని ఈ చట్టం ద్వారా తప్పులు సరిచేయవచ్చని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ఇకపై పట్టాదార్ పాస్ పుస్తకాలపై ఇకపై భూమికి సంబంధించిన మ్యాప్ ముద్రించనున్నట్లు తెలిపారు, ఈ విదానం ద్వారా భూ సరిహద్దుల వివాదంకు శాశ్వత పరిష్కారం లబిస్తుందని వివరించారు. సాదా బైనామా ద్వారా గతంలో దరఖాస్తు చేసుకున్న 9 లక్షల మందికి హక్కుపత్రాలు వస్తాయని పేర్కొన్నారు. వారసత్వ భూముల పంపకాల విషయంలో సైతం ఇకపై సక్రమంగా సాగుతుందని తెలిపారు. భూమి హక్కులు ఏవిదంగా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చని వెల్లడించారు. గతంలో భూ వివాదాల పరిష్కారం పై కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని భూ భారతి ద్వారా ఆర్ డి వో, జిల్లా కలెక్టర్ కే భూ సమస్యల పరిష్కార బాద్యత అప్పచెప్పనందున సమస్య త్వరగా పరిష్కారమవుతుందని వివరించారు. రైతులకు ఉచితంగా న్యాయ సహాయం అందుతుందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆదాబి, వ్యవసాయేతర భూములకు రికార్డ్స్ ఉంటాయన్నారు. ఏజెన్సీ చట్టాలకు భూభారతి చట్టం అడ్డురాదని స్పష్టం చేశారు. ఏజెన్సీ చట్టాలు యధావిధిగా అమలు అవుతాయని భరోసా ఇచ్చారు. భూ భారతి ద్వారా ఆదివాసి చట్టాలు మరింత బలోపేతం అవుతుందన్నారు. పాత చట్టంలో లోపాలను సవరించేందుకే ఈ చట్టం తీసుకొచ్చారన్న విషయం గుర్తించాలన్నారు. ప్రజలు తహసీల్ కార్యాలయాల వద్దకు రావద్దని, అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తారని వెల్లడించారు. గతంలో ఆన్ లైన్ ప్రైవేట్ వ్యవస్థ వద్ద ఉండేదని ప్రస్తుతం ప్రభుత్వమే ఆ పని చేస్తున్నందున భూములకు పూర్తి భద్రత ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్, జూలై నెలలో సభలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ భూ భారతి చట్టం ఒక మహోత్సవమైన చట్టంగా అభివర్ణించారు. ఆదివాసి చట్టాలకు భూభారతి ద్వారా మరింత రక్షణ కలుగుతుందని భరోసా ఇచ్చారు. గతంలో ధరణిలో చాలావరకు ఇంటి వద్దనే కూర్చొని సవరణ చేశారని, ఈ చట్టం ద్వారా ఆ పరిస్థితి ఉండదని వెల్లడించారు. గతంలో ఉన్న ఇబ్బందులను సవరించి ఈ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. పేదలకు అన్యాయం జరగకుండా ఉండకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. పైసా ఖర్చు కాకుండా వి వివాదాలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఇది భూములు కాపాడే చట్టంగా ఆయన అభివర్ణించారు. గతంలో వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని, భూములు కాపాడే వారే వీఆర్ఏ, వి ఆర్ వో లని ఈ వ్యవస్థను మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రావు, తహసీల్దార్ శ్రీనివాస్, చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు పరుచూరి రవికుమార్, మందపాటి అచ్యుత శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలి

- ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ నోడల్ అధికారిణి రాజేశ్వరి
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- నేలకొండపల్లి మండలం బుద్దారం, గువ్వలగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను తనిఖీ చేసిన నోడల్ అధికారిణి

ఖమ్మం/నేలకొండపల్లి, ఏప్రిల్ 23(మనం న్యూస్): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఎస్డీసి, పాలేరు నియోజకవర్గ నోడల్ అధికారిణి ఎం. రాజేశ్వరి తెలిపారు. సోమవారం నేలకొండపల్లి మండలం బుద్దారం, గువ్వలగూడెం గ్రామాలలో చేపట్టిన రెవెన్యూ సదస్సులను నియోజకవర్గ నోడల్ అధికారిణి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, నిర్వహిస్తున్న రిజిస్టర్లు, దరఖాస్తుదారులకు ఇస్తున్న రశీదు, ఏ ఏ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నది పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకుంటున్న రైతులతో సమస్యలు అడిగి తెలుసుకుని, భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ నోడల్ అధికారిణి మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని ఇంచార్జ్ కలెక్టర్ తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని నోడల్ అధికారిణి అన్నారు. బుద్దారం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 69, గువ్వలగూడెం గ్రామానికి సంబంధించి 63 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ లు శ్రీనివాస్, రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రవి**

మరిపెడ, ఏప్రిల్ 23 (మనం న్యూస్): వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు. రవి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ! ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖాన లో మొదటి మూడు నెలలో నమోదు అయ్యో విదంగా, ప్రభుత్వ దవాఖానాలో ప్రసవాలు జరిగే విధంగా చూడాలని, తెలిపారు. ప్రతి బుధవారం, శనివారా లలో పిల్లలకు ఇచ్చే వాక్సిన్ క్రమం తప్ప కుండా ఇచ్చి ప్రతిది ఆన్లైన్ అయ్యేల చూడాలన్నారు. అదేవిదంగా టీ,బి జబ్బు ఉన్నవారిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలన్నారు. ఆసంక్రిమిక వ్యాధులైన బిపి, షుగర్, ఉన్నవారికి మందులు అందజేయాలన్నారు, తెలంగాణ డైగ్నోస్టిక్ కి క్రమం తప్పకుండా రక్త నమూనాలు పంపాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు డ్రై డే పాటించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రాలలో మందులు మరియు ఓ ఆర్ ఎస్ ద్రావణాలు అందుబాటులో ఉండాలని, వడదేబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మంగమ్మ,సూపెర్వైసర్ కృష్ణ,సుదర్శన్, మాధవి, లక్ష్మి,పల్లె దవాఖాన సిబ్బంది అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీష్,సాయిశ్రీ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# టూరిస్ట్ లపై ఉగ్రదాడి పిరికి పందల చర్య

- ఉగ్రవాది దాడిలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటాం
- భారత ప్రభుత్వం ఉగ్రవాదులను పట్టుకొని హతమార్చాలి
- డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్



కురవి, ఏప్రిల్ 23 ( మనం న్యూస్):జమ్ము కాశ్మీర్లోని పహల్గాం టూరిస్టులపై జరిపిన ఉగ్రవాదుల దాడి పెరికిపందల చర్యని డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. బుధవారం అయినా మనం ప్రతినిధితో చరవాణిలో మాట్లాడుతూ జమ్మూలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు. అభం శుభం తెలియని పర్యాటుకులపై జరిపిన దాడి హేయమైన చర్యని పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని దేశంలో శాంతి పరిరక్షణకు విఘాతం కల్పించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. భారతదేశంలోని ప్రతి పౌరుడు సైనికుల్లా ప్రవర్తించాలని అన్నారు. జమ్మూ కాశ్మీర్లో స్వేచ్ఛగా స్వాతంత్ర్యంగా పర్యాటక ప్రాంతాలను ఆస్వాదించేందుకు విదేశాలు స్వదేశాల నుంచి వచ్చిన పర్యాటకులకు భద్రత కల్పించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. భారత ప్రజలపై ఉగ్రవాదులు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ భారత ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతౌ కాకుండా చూడాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్న పట్టుకొని శిక్షించాలని కోరారు.

## పోస్టు మార్టమ్ గదిని తక్షణమే ప్రారంభించాలి




- హాస్పిటల్ సమస్యలపై సిపిఎం అధ్వర్యంలో అందోళన

గార్ల ఏప్రిల్ 23(మనం న్యూస్): మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ప్రక్కన నూతనంగా నిర్మాణం చేపట్టిన శవపరీక్ష గదిని వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతిలు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.శవపరీక్ష గదిని వెంటనే ప్రారంభించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మూసి ఉన్న శవపరీక్ష గది ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శవపరీక్ష కోసం మండలం నుంచి 50 కిలోమీటర్లతో కూడిన వ్యయ, ప్రయాసలతో కూడిన ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని శవ పరీక్ష గదిని ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాప్ ను పెంచాలనీ, వెంటనే శవ పరీక్ష కేంద్రంలో ఫ్రీజర్ పెట్టాలని, సంబంధించిన డాక్టర్లను నియమించాలని వైద్య అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.పి.వెంకటేశ్వర్లు, యం. నాగమణి, అంబటి వీరాస్వామి, ఎస్. కె.మౌలానా, మాజీ ఎంపిటిసి వి.పద్మ,ఎస్. నాగరాజు, గిరి, ఉమా, పద్మ,సుజాత, ప్రవీణ్ కుమార్,నవీన్, ప్రసాద్, అంజయ్య,రోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పుత్రుని కుటుంబానికి మాజీ ఎంపీ నామ సహాయం

- పద్మశ్రీ వనజీవి రామయ్య దశదిన కర్మ నిమిత్తం నామ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం



ఖమ్మం, ఏప్రిల్ 23(మనం న్యూస్): ఇటీవల పరమపదించిన ప్రముఖ పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దశదిన కర్మ గురువారం జరగనున్న నేపథ్యంలో, ఆయన కుటుంబానికి ఆర్థికంగా తోడుగా నిలవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు, నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కొంత నగదు సహాయాన్ని అందించారు. ఇటీవల రామయ్య స్వగృహానికి నామ వచ్చినప్పుడు వారి కుటుంబానికి అండగా వుంటానని రామయ్య కుటుంబ సభ్యులకు నామ చెప్పడం జరిగిందని అందులో భాగంగా ఈ సాయాన్ని బుధవారం నాడు ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి లో రామయ్య స్వగృహం లో వారి సతీమణి జానమ్మకు బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవనజీవి రామయ్య పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన సేవలు భారతదేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. చెట్లను మనుషులుగా చూస్తూ వాటిని సంరక్షించడం ఆయన జీవిత ధ్యేయంగా మారిందని పేర్కొన్నారు. ఆయన జీవితం ప్రకృతి పట్ల ప్రేమ, పట్టుదల, త్యాగానికి చిరునామా అన్నారు. నామ నాగేశ్వరరావు గతంలో కూడా పలు సందర్భాలలో వనజీవి రామయ్యని వ్యక్తిగతంగా కలుసుకుని, ఆయన సేవలను అభినందించారని, అంతే కాకుండా వారి చేసే కార్యక్రమాలకు నామ తోడ్పాటు అందజేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. దశదిన కర్మకు అవసరమైన ఖర్చులను కొంతవరకూ భరించేందుకు ముందుకొచ్చిన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమయాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా మానవతా విలువలతో స్పందించటం అభినందనీయం అని పలువురు ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానించారు. వనజీవి రామయ్య గారు తన జీవితాంతం వృక్షాలను ప్రేమిస్తూ, వాటి పరిరక్షణకే తన జీవితాన్ని అంకితంగా గడిపారని తెలిపారు. వనజీవి రామయ్య మహోన్నత వ్యక్తి అని వారి కుటుంబానికి అండగా నిలవడం మన బాధ్యత అన్నారు. నామ నాగేశ్వరరావు నిరంతరం ప్రజల కోసం పాటుపడే నాయకుడే కాకుండా మానవతావాదిగా ఆయన చేసే సేవ కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## రైల్వే జనరల్ మేనేజర్ ని కలిసిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

**దంసలాపురం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి వినతి, హామీ ఇచ్చిన రైల్వే జి. యం**



ఖమ్మం, ఏప్రిల్ 23(మనం న్యూస్): దంసలాపురం దగ్గర గేట్ నెంబర్ 106 అండర్ బ్రిడ్జి నిర్మాణం గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉండటం వలన స్థానిక రైతులు పరిసర గ్రామ ప్రజలు ఇబ్బంది పడటం ప్రత్యక్షంగా చూసిన ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి ఈరోజు జనరల్ మేనేజర్ సౌత్ సెంట్రల్ రైల్వే వారిని కలిసి వినతిపత్రం సమర్పించి త్వరిత గతిన అండర్ బ్రిడ్జి నిర్మాణం నిర్మించాలని కోరారు. స్పందించిన రైల్వే జనరల్ మేనేజర్ సంబంధిత చీఫ్ ఇంజనీర్ తదితర అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభంచవలసిందిగా ఆదేశించారు అదేవిధంగా ఇంతకముందు ప్రతిపాదించిన డోర్నకల్ -మిర్యాలగూడెం, డోర్నకల్-గద్వాల రైల్వే లైన్ అలైన్మెంట్ మార్చి డోర్నకల్-వెన్నారం మరిపెడ మోతే ద్వారా వెళ్ళటానికి ఇంతకు ముందు ప్రతిపాదించిన పనులు పై చర్చించారు. అదేవిధంగా ఈ సందర్భంగా గతం లో రద్దు చేసిన రైళ్లను తిరిగి పున:రుద్దరించాలని ఖమ్మం, బోనకల్, ఎర్రుపాలెం మరయు డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్డు వెళ్ళే మార్గంలో గాంధీనగర్ స్టేషన్ లో రైళ్లను నిలుపుదల చేయాలని రైల్వే జీఎంని కోరండం జరిగింది.

## ఆకట్టుకున్న పోషణ్ పక్వాడ్ కళా జాతర



ఖమ్మం రూరల్, ఏప్రిల్ 23(మనం న్యూస్): ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని నాయుడుపేట గ్రామంలో పోషణ పక్షంలో భాగంగా బుధవారం నిర్వహించిన కళాజాతర కార్యక్రమం ఆకట్టుకుంది జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం రూరల్ ప్రాజెక్టు సిడిపిఓ కమల ప్రియ హాజరై ప్రసంగించారు.తల్లి పిల్లల ఆరోగ్యం సమతుల ఆహారం పోషకాలతో కూడిన ఆహారం ముఖ్యమని అన్నారు.చిన్నారుల తల్లిదండ్రులను శాలువాతోసత్కరించారు. సూపర్వైజర్ పుష్పలత ,గ్రామ ప్రజాప్రతినిధులు అంగన్వాడీ టీచర్స్ వివో ఎ లు ఆశా కార్యకర్తలు గ్రామంలోనే చిన్నారుల తల్లిదండ్రులందరూ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పెద్దతండ గ్రామ పరిధిలో మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి మేడం ఖమ్మం రూరల్ ఎంపీడీవో ఎస్ కుమార్ ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ పాల్గొన్నారు.

# మారుమోగిన కంట మహేశ్వర నామస్మరణం

- వేద పండితుల మంత్ర ఘోష నడుమ విగ్రహ ప్రతిష్ట
- కొండవనమాలలో కొలువుతీరిన గౌడ కుల దైవం
- శ్రీ బాలాజీ స్టేట్ అధినేత వత్సవాయిరవి ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవాలు
- సంబండ వర్గాలను ఏకం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్
- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- దైవచింతనతో మానసిక ప్రశాంతత
- శ్రీ బాలాజీ ఎస్టేట్ అధినేత వత్సవాయి రవి



ఖమ్మం(కొనిజర్ల), ఏప్రిల్ 23(మనం న్యూస్): కొండ వనమాల గ్రామంలో కొలువైన కొలువైన కంఠమహేశ్వరుడు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ గౌడ కులదైవం కొలువుదీరింది.గౌడ కులస్తుల ఆశలు ఆకాంక్షలను అద్దం పడుతూ భవిష్యత్తులో వారి కోరికలను తీర్చే కొంగుబంగారంగా కంఠమహేశ్వర స్వామి కొలువు తీరారు. శ్రీ బాలాజీ ఎస్టేట్ అధినేత వత్సవాయి రవి ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్ల కల సహకారం అయింది. మంత్రాల నడుమ భక్తుల జయ జయ ద్వానాల నడుమ విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం కొండ వనమాల సీతారాంపురం గ్రామంలో బుధవారం శ్రీ కంఠ మహేశ్వర స్వామి సురమాంబ దేవిల విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామ ప్రజలందరూ ఏకూవ జామునే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయం వద్దకు చేరుకొని ఉదయం 7:54 గంటలకు విగ్రహ ప్రతిష్ట తంతు ముగించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఆలయం వద్ద మహా అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి ఆ గ్రామ ప్రజలతో పాటు చుట్టుప్రక్కల గ్రామ ప్రజలందరూ విరివిగా హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి స్వామివారి సేవలో తరించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.



**- సంబండ వర్గాలను ఏకం చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్: వైరా ఎమ్మెల్యే రామాదాసు నాయక్**

సంపండవర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని చేపట్టిన మహా మనిషి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వైరా ఎమ్మెల్యే రామ్ దాస్ నాయక్ కొనియాడారు. ఆనాడే బడుగు బలహీన వర్గాలను ఒక తాటిపైకి తెచ్చి తనకంటూ సొంత సైన్యం ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటను చేజెక్కించుకున్నారని తెలిపారు. ఆ కోటనుండే ప్రజల ఆశలు ఆకాంక్షలను నిర్వర్తించే విధంగా ప్రజాపాలన కొనసాగించారన్నారు. అంతేకాకుండా పోరాటస్ఫూర్తినింపారని, దృఢమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆనాడే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిరూపించారని తెలియజేశారు.

**- దైవచింతనతో మానసిక ప్రశాంతత: శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి**

దైవచింతనతో మానసిక ప్రశాంతత కలిగిద్దని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే నాకు జన్మనిచ్చిన గ్రామంలో మా కుల దైవం కంట మహేశ్వర స్వామి సురుమాంబదేవిల ఆలయాన్ని నిర్మించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కార్యాలయపు ఇన్చార్జి తుమ్మూరు దయాకర్ రెడ్డి, కొనిజర్ల మాజీ ఎంపీపీ, గ్రామ పెద్దలు గోసు మధు, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, గోప నాయకులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్, గుడిద శ్రీనివాసరావు గౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్, బెల్లంకొండ శరత్ గౌడ్,కుక్కల నాగేశ్వరరావు గౌడ్, గ్రామ గౌడ కుల పెద్దలు వత్సవాయి పుల్లయ్య, పొలగాని సుధాకర్, మరీదు వెంకయ్య, మోతపోతుల వెంకటేశ్వర్లు, మరీదు నాగేశ్వరరావు, పొలగాని లక్ష్మీనారాయణ, బొజ్జగని రమేష్, యాదవ్ సంఘం పెద్దలు, పెద్ద గొల్ల జానబోయిన మల్లయ్య, గోసు సాయిబాబు, బొరిగల పుల్లయ్య, సింగాల కృష్ణ బాలాజీ ఎస్టేట్ కార్యాలయం ఇన్చార్జి పోగుల రవికుమార్, కార్యాలయపు సిబ్బంది మార్కెటింగ్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ పోషకాహారం తీసుకోవాలి



- అంగన్వాడి సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**చొప్పదండి, ఏప్రిల్23 (మనంన్యూస్):** ప్రతి మహిళ తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షం ముగింపు ఉత్సవాలకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహారం పట్ల మహిళలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి మహిళ పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో వండిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా మహిళలందరికీ ఉచిత వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, మహిళలందరూ ఆరు నెలలకు ఒకసారి ఉచిత పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మారాయని, రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన టీచర్లు అంగన్వాడిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పిల్లలకు పోషకాహారంతో పాటు కార్పొరేట్ కు ధీటుగా విద్యను నేర్పుతున్న అంగన్వాడీల్లో ఆరు సంవత్సరాల లో పిల్లలందరినీ చేర్పించాలని సూచించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించే డబ్బును పొదుపు చేసి భవిష్యత్తులో పిల్లల ఉన్నత చదువులకు విని యోగించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. పోషకాహార మేళాను పరిశీలించారు. గర్భిణీలకు సీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సిడిపిఓ నర్సింగారాణి, ప్రత్యేక అధికారి తిరుపతిరావు, డిసిపిఓ పర్వీన్, తహసిల్దార్ నవీన్ కుమార్, మెడికల్ ఆఫీసర్ శ్రీ కీర్తన, సూపర్వైజర్ శశి కుమారి పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం

- భూ భారతితో పొరపాట్ల సవరణకు అవకాశం
- అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**వాజేడు, ఏప్రిల్ 23, (మనం న్యూస్):** రైతుల భూములకు సంబంధించి పాస్ పుస్తకాల్లో పొరపాట్ల సవరణకు భూభారతి చట్టంలో అవకాశం ఉందని, దీర్ఘకాలిక భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహద పడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. బుదవారం వాజేడు మండలం కేంద్రం లోని రైతు వైదిక లో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావు లేకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదా బైనమాలు, పాసు పుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా 'భూధార్'ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, వారసత్వ మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్, తహసిల్దార్

ఇతర శాఖల అధికారులు, రైతులు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ఏప్రిల్ 23, (మనం ప్రతినిధి):** ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఇంటర్మీడియట పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించి మందమర్రి తెలంగాణ



ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఎం.పి.సి.లో జి అనూష పి (987), టి హర్షిత (982), బిపిసి లో పి వైశాలి (986), ఎం హాసిని (973), సి ఈ సి లో ప్రతిమాదేవి (932), కె.శ్రీనిధి (927) మార్కులు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో వార్షిక పరీక్షల ఫలితాలలో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మందమర్రి తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సారా తస్నీమ్, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సింగరేణి విజయ దుందుభి

- అత్యుత్తమ ఫలితాలు సాధించిన సింగరేణి మహిళా జూనియర్ కళాశాల
- ఇంటర్ ద్వితీయలో 80 శాతం , ప్రథమలో 73 శాతం ఉత్తీర్ణత
- ఇంటర్ విద్యార్థిని హాసిని 992 మార్కులతో సరికొత్త రికార్డు
- అభినందనలు తెలిపిన సింగరేణి ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం



**మంచిర్యాల, ఏప్రిల్ 23 ( మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రము లో మంగళవారం విడుదల అయిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కొత్తగూడెంలోని సింగరేణి మహిళా జూనియర్ కళాశాల విజయ దుందుభి మోగించిందని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ బుధవారం తెలిపారు .ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 71.37 కాగా ఈ కళాశాల 81 శాతం సాధించిందని, అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 66.89 కాగా ఈ కళాశాల 73.07 శాతం సాధించి తన ప్రతిభను చాటిందన్నారు . ఇంటర్ ద్వితీయ లో కళాశాల విద్యార్థిని హాసిని 1000 మార్కులకు 992 మార్కులు సాధించి కళాశాలలో సరికొత్త రికార్డు నెలకొల్పడంతో పాటు రాష్ట్రస్థాయి ర్యాంకర్ గా నిలిచిందని, అలాగే జూనియర్ హెచ్.ఈ.సి. విద్యార్థిని షేక్ అయిషా ఫర్హాత్ 500 మార్కులకు 489 సాధించి రాష్ట్రస్థాయిలో నిలబడిందని, జూనియర్ ఎం.ఈ.సి. విద్యార్థిని సోనాలి బజాజ్ 487 మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్ లలో ఒకరుగా నిలిచిందని, బై.పి.సి నుంచి ఐశ్వర్య 431/440, ఎం.పీ.సీ. నుంచి జె.రేణుశ్రీ 460/470, సి.ఇ.సి. నుండి షేక్ నశ్రీన్ సుల్తానా 459/500 సాధించి అగ్రభాగాన నిలిచారని తెలిపారు .

సింగరేణి ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం అభినందనలు :

సింగరేణి మహిళా జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయి సగటు ఉత్తీర్ణత కన్నా ఎక్కువ ఉత్తీర్ణత సాధించడమే కాక పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంపై సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ బుధవారం తన హర్షం ప్రకటిస్తూ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా ఇకపై కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ ఇచ్చిన స్ఫూర్తితో, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు మరియు డైరెక్టర్ (పి.పి. మరియు పా) కే.వెంకటేశ్వర్లు సహకారంతో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థుల కృషి ఫలితంగా ఉత్తమ ఫలితాలు సాధించామని ఇకపై కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తామని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తెలియజేశారు.

# భూభారతి నూతన ఆర్ ఓఆర్ చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మందమర్రి, ఏప్రిల్ 23 (మనం న్యూస్):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కుల ద్వారా భూసమస్యలు పరిష్కరించబడతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి నూతన ఆర్. ఓ.ఆర్. చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.అనిత, తహశిల్దార్ సతీష్, మున్సిపల్ కమీషనర్ రాయలింగు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, చట్టంలోని ప్రతి అంశాన్ని, ప్రతి హక్కును ప్రతి రైతు పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. ఈ చట్టంలో హక్కులు, రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని, భూధార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణతో పాటు మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వం, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అవకాశం వంటి అంశాలను పొందు పర్చడం జరిగిందని తెలిపారు. భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఇందు కొరకు కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన మండలంలో జూన్ 2వ తేదీ వరకు సమస్యల పరిష్కరించి, మిగిలిన మండలాలలోని సమస్యలను గుర్తించి ఆగస్టు 15వ తేదీ లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, సర్వే ప్రక్రియలో సంబంధిత సర్వేయర్లు, ఇతర అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని, రైతులకు పట్టాభూమి, లావుని పట్టా, ఇతర రకాల భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ ఆదేశాలు, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, టైటిల్, పొసెషన్ సంబంధిత సమస్యలు, కోర్టులో కొనసాగుతున్న కేసులను మినహాయించి మిగిలిన వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

**వరి ధాన్యం కొలువులు కేంద్రం ప్రారంభం**

అనంతరం మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతు సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ.ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం గ్రామంలో పొలాలలో వరి కోత ప్రక్రియను పరిశీలించారు.

వరి కోత సమయంలో హార్వెస్టర్ పంకా వేగం 19గా నిర్వహించాలని, పంట పూర్తిగా కోత దశకు వచ్చిన తరువాత మాత్రమే కోయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత మోటివేషన్ తరగతులు



**వేములవాడ, ఏప్రిల్ 23 (మనం న్యూస్) :** వేములవాడ పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్(ఐసీఐ) రీజినల్ ప్రెసిడెంట్ కుతాడి తిరుపతి ఉచిత మోటివేషనల్ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా కుతాడి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులకు ఇంటికి వెళ్తున్నారు సెలవులు 50రోజులు ఉన్నందున విద్యార్థుల యొక్క ఆలోచన విధానం ఒక్కరిలో ఒక్కో రకంగా ఉంటుంది కాబట్టి ఈ సెలవుల సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.వారు ఏ విషయాలు ఎక్కువగా ఆలోచిస్తారో అవే పనులు చేస్తారని దానికి సంబంధించిన విషయాలు ఎక్కువ తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తారని అన్నారు. ఎప్పుడైతే ఒక సరి అయిన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని తమకు ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకొంటే అప్పుడు విజయానికి దగ్గర అవుతారని అన్నారు.విద్యార్థులు సాధించలేనిది అంటూ ఏమి ఉండదన్నారు. ప్రస్తుతం పరిస్థితులలో చాలా మంది తమకు ఉన్న సమయాన్ని వారికీ అవసరమున్నాదానికోసం కాకుండా వారికి ఎలాంటి సంబంధం లేని దానికోసం వేస్ట్ చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు చదివిన విషయాలను మరిచిపోకుండా హాలిడేస్ తరువాత కొత్త తరగతి లోకి అడుగు పెడుతారు కాబట్టి ఈ సెలవుల సమయంలో కొత్త విషయాలు నేర్చుకోవాలని కోరారు. అలాగే ఆరోగ్యం బాగా చూసుకోవాలన్నారు. పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం ఐసీఐ రీజినల్ డైరెక్టర్ ఆవుల సుధాకర్ మాట్లాడుతూ సెలవుల సమయంలో తల్లిదండ్రులకు చెదోడు వాదోడు గా ఉండాలని తల్లిదండ్రులకు ఎప్పుడు సహాయం చేస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ఐసీఐ రీజినల్ ప్రెసిడెంట్ కుతాడి తిరుపతిని, ఐసీఐ రీజినల్ డైరెక్టర్ ఆవుల సుధాకర్ ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభ, అధ్యాపకురాళ్లు, ఉపాధ్యాయులు కలిసి వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు.

# వెంకటేష్ కుటుంబానికి రూ. 8 లక్షల చెక్కు అందజేసిన ఎస్పీ డి.జానకి



**హైదరాబాద్, ఏప్రిల్ 23(మనంన్యూస్):** ఎస్కార్ట్ విధులు నిర్వహిస్తు హార్ట్ ఎటాక్ తో మరణించిన ఏ అర్ పీసీ 3274 వెంకటేష్ కుటుంబ సభ్యులకు భద్రతా నిధి నుండి రూ. 8 లక్షల చెక్కుని జిల్లా ఎస్పీ డి. జానకి బుధవారం అధికారికంగా అందజేశారు. సేవలు పోలీస్ శాఖకు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, వెంకటేష్ మరణం కుటుంబానికి తీరని నష్టం కలిగించిందని , వారి సేవలను గుర్తిస్తూ వారి కుటుంబాన్ని ఆదుకోవడంలో జిల్లా ఎస్పీ డి. జానకి, వారి కుటుంబ సభ్యులను ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వెంకటేష్ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేయడం బాధాకరం.

పోలీస్ శాఖ తరపున వారి కుటుంబానికి మా పరామర్శలు తెలియజేస్తున్నాము.

ఈ భద్రతా నిధి ద్వారా వారి కుటుంబానికి కొంత ఆర్థిక సాయాన్ని అందించగలమని ఆశిస్తున్నాము.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఎల్లప్పుడూ మద్దతుగా నిలబడడం మా బాధ్యత. పోలీసుల సేవలు త్యాగమే కాకుండా సమాజానికి రక్షణగా నిలుస్తాయి. వారి త్యాగాన్ని మేము ఎప్పటికీ మర్చిపోము. అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకటేష్ కుటుంబ సభ్యులు మరియు అవో రుక్మిణి భాయి తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ ప్రజలందరూ గర్వపడేలా

# పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 23(మనంన్యూస్):** మహబూబ్ నగర్ ప్రజలందరూ గర్వపడేలా పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మహబూబ్ నగర్ పట్టణం లోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్ నగర్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఆర్ అండ్ బి గెస్ట్ గా హౌస్ ప్రాంగణంలో గత ప్రభుత్వం వెజ్ నాన్ వెజ్ మార్కెట్ మార్కెట్ గా ఎలాంటి అనుమతులు లేకుండా అధికారుల పైన ఒత్తిడి తెచ్చి కొంత నిర్మాణం చేసి, మధ్యలోనే నిర్మాణపు పనులను ఆపివేశారని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో విజ్ఞానాన్ని అందించే అధునాతన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. అందుకే గత 15 నెలలు గా ఎంతో మంది అధికారులను ఒప్పించి మెప్పించి ఈ నెల 16 వ తేదిన కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నాలెడ్జ్ సెంటర్ కోసం జీఓ జారీ చేశారని ఆయన తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ కోసం 17 కోట్లు కేటాయించారని, ముందుగా 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 17 కోట్లు రూపాయలతో ఇక్కడ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అంతర్జాతీయ స్థాయి లైబ్రరీ స్థాపిస్తామని, అందులో సెమినార్ హాల్స్, రీడింగ్ రూమ్స్, డిజిటల్ హాల్స్, క్లాస్ రూం లు తో ఒక మంచి అహ్లాదకరమైన వాతావరణం కల్పించి లక్ష పుస్తకాలు ఇక్కడ ఉండేవిధంగా అధునాతన లైబ్రరీ ఏర్పాటు చేయాలనే తన సంకల్పం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కూడా విద్యకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం (గ్రంథాలయం ) అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయంగా ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది అని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో కళాశాలు, పాఠశాలలు , కోచింగ్ సెంటర్లు, హాస్టల్స్ ఉన్నాయని, అందుకే విజ్ఞాన కేంద్రంగా ఈ ప్రదేశం అందరికీ ఉపయోగపడుతుంది అని ఆయన చెప్పారు. అలాగే మెట్టు గడ్డ ప్రాంతంలోని డైట్ కళాశాల ప్రాంగణంలో టిడి గుట్ట వెజ్ నాన్ వెజ్ మార్కెట్ గా నామకరణం చేసి అక్కడ నిర్మాణం చేస్తుంటే , విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేశారని, డైట్ కళాశాల స్థలం లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఏమిటి అని విద్యార్థులు ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు. అందుకే అక్కడ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తిని ఇచ్చిన వారు జ్యోతి బా పూలే , బాబా సాహెబ్ అంబేద్కర్ అని, ఆంగ్లేయులు పరిపాలిస్తున్న కాలంలో దేశంలో కేవలం 5% అక్షరాస్యత ఉన్న సమయంలో తన ఆస్తులను అమ్మి 28 పాఠశాలలను ఏర్పాటు చేశారని , అలాగే దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బాబా సాహెబ్ అంబేద్కర్ చదువు విలువ తెలిసిన వారని అందుకే వారి పేర్లను విజ్ఞాన కేంద్రానికి పెట్టడం జరిగింది అని ఆయన స్పష్టం చేశారు. త్వరలో ఈ పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్, మండల ఓబిసి సెల్ చైర్మన్ రాజు గౌడ్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలలో తేజస్ విద్యార్థుల విజయకేతనం




**కొత్తపల్లి ఏప్రిల్ 23 (మనం న్యూస్) :** మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభతో ఉత్తమమైన ఫలితాలు సాధించినట్లు తేజస్ జూనియర్ కళాశాల డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సిహెచ్ సతీష్ రావు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఏ శ్రీవర్ధన్ 466 బి రిషిత్ యాదవ్ 466 ఎం వర్షిత్ 465 ఏ నందీశ్వర్ 464 ఏ విట్టల్ 462 మార్కులు సాధించడం సిఇసి విభాగంలో బి రామ్ చరణ్ 490 జి రాజేందర్ 483 ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కే మారుతి 993 బైపిసి విభాగంలో పరిశురాములు 969 సీఈసీ విభాగంలో ఎం మనోజ్ కుమార్ 929 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినట్లు తెలిపారు తమ అకాడమీలో కాంపిటేటివ్ సిలబస్ అందించడంతో 2 వేల పైగా విద్యార్థులు రక్షణ రంగం తో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నట్లు తెలిపారు 2025- 26 విద్యా సంవత్సరం నుండి బాలికల కొరకు కూడా ఇంటర్ తో పాటు డిఫెన్స్ ఉద్యోగాలకు ఐఐటి నీట్ కోచింగ్ ప్రారంభించడం జరుగుతుందని మా అకాడమీలో అన్ని రకాల ఆట స్థలాలు మైదానాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని కాబట్టి వాలీబాల్ క్రికెట్ వంటి క్రీడల కొరకు ప్రత్యేకమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు విద్యార్థులకుఎలాంటి ఒత్తుది లేని చదువులతో పాటు ఉత్తమ మార్కులు అధిక ఉద్యోగాలు సాధించి తెలంగాణలోనే అత్యధిక ఫలితాలు సాధించిన అకాడమీగా పేరు పొందామని తెలిపారు.

# నెరవేరిన 14 వేల మంది జనరల్ మజ్దూర్ల కల

- ఇకపై సింగరేణి జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్ గా గుర్తింపు
- కార్మికుల డిజిగ్నేషన్ మార్పును అమలు జరుపుతూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు




మంచిర్యాల, 23, ఏప్రిల్, ( మనం న్యూస్): సింగరేణి జనరల్ మజ్దూర్ల కు శుభవార్త . నెరవేరిన 14 వేల మంది జనరల్ మజ్దూర్ల ల డిజిగ్నేషన్ మార్పుకోరిక. ఇకపై సింగరేణి జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్ గా గుర్తింపు గా కార్మికుల డిజిగ్నేషన్ మార్పును అమలు జరుపుతూ ఉత్తర్వులు తాజాగా జారీ చేసిన సింగరేణి యాజమాన్యం. సింగరేణి సంస్థలో కేటగిరి-1 లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై ఆ పేరుతో కాకుండా జనరల్ అసిస్టెంట్ గా నామకరణం చేస్తూ సింగరేణి యాజమాన్యం బుధవారం అనగా ఏప్రిల్ 23వ న ఉత్తరులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వేజ్ బోర్డు ఒప్పందంలో ఈ పేరు మార్పునకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ తక్షణమే అమలు జరపాలని ఆదేశించడంతో ఈ మేరకు సర్కుల ర్ జారీ చేయడం జరిగింది. కొన్ని పదుల ఏళ్లుగా ఉన్న ఈ డిజిగ్నేషన్ దీనితో జనరల్ మజ్దూర్ అనే పేరు ఇకపై కనుమరుగు కానుంది. దీనిపై సింగరేణిలోని 14 వేల మంది జనరల్ మజ్దూర్ల తోపాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సింగరేణి సంస్థలో కేటగిరీ-1లో పనిచేసే వారిని జనరల్ మజ్దూర్ అని పిలవడం అలవాటుగా వస్తున్నది, మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలి అని అర్థం, సింగరేణి సంస్థలోనే కాక కోల్ ఇండియాలో కూడా ఈ కింది స్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తూ వస్తున్నారు, బొగ్గు తవ్వకం తొలి రోజుల్లో గుత్తే దారులే యజమానులుగా ఉంటుండేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతం నుంచి కూలీలను (మజ్దూర్) లను తీసుకొని వస్తుండేవారు. కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్ లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తు, జనరల్ మజ్దూర్ లుగా గుర్తించడం చేశారని చెప్పాలి . గతంలో కేవలం నిరక్షరాస్యులు మాత్రమే జనరల్ జనరల్ మజ్దూర్లు గా పనిచేస్తుండేవారు, కానీ నేడు కారుణ్య నియామకాల్లో (డిపెండెన్ట్ లు) ఉన్నత చదువులు చదివిన వారు కూడా తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై ఏడాది తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తించబడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా ఉంటున్నం దువల్ల, వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్ గా మార్పు చేశారు. ఈ మార్పును వెంటనే అమలు జరిపిన సంస్థ ఛైర్మన్ ఎన్. బలరాం కు కార్మికులు, కార్మిక సంఘాలు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీరాంపూర్ ఏరియా స్ట్రక్చర్ సమావేశం

- పాల్గొన్న ఏరియా జిఎం, అధికారులు-గుర్తింపు సంఘం చర్చల ప్రతినిధులు



మంచిర్యాల, 23, ఏప్రిల్, ( మనం న్యూస్): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో చాలా కాలం తర్వాత సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధుల మధ్య శ్రీరాంపూర్ ఏరియా స్ట్రక్చర్ సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా , ఎస్.ఓటు జిఎం సత్యనారాయణ, పర్సనల్ డిపార్ట్మెంట్ ఏరియా డీజీఎం అరవింద రావు, సంబధిత గనులు, డిపార్ట్మెంట్ లకు చెందిన అధికారులు పాల్గొన్నారు. అలాగే గుర్తింపు సంఘం, ఏఐటియుసి యూనియన్ తరపున చర్చల ప్రతినిధులు గా బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరు కొమరయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, బాలకృష్ణ లు పాల్గొన్నారు. ఏరియాలో స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం యూనియన్ నాయకులు ప్రతిపాదించిన పలు డిమాండ్ లపై యజమాన్యం యూనియన్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. డిమాండ్ ల ముఖ్య వివరాల ప్రకారం, అన్ని గనుల్లో కొత్తగా వచ్చిన ఎస్డిఎల్ యంత్రాలకు సౌకర్యంగా ఉండేలా కొత్త సీట్లను ఏర్పాటు చేయాలని, ఆర్కే -6 గని మ్యాగజైన్ మూలమలుపు దగ్గర సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఆర్కే-7, ఆర్కే న్యూటెక్ గనుల మ్యాన్ వె లలోని ల్యాండ్ ఫోన్లు మరమ్మతులు చేయించాలని, మాస్టర్ డిస్ ప్లే బోర్డును ఏర్పాటు చేయాలని, అవి పని చేయడం లేదని అధికారులకు నాయకులు తెలిపారు. అదేవిధంగా ఆర్కే న్యూ టెక్ గనిలో కంపెనీ అవసర నిమిత్తం ఉపరితలం పై పనులు చేయించి అదే రోజు వారికి అండర్ గ్రౌండ్ లో కోత విధించడం నిలిపివేయాలని, ముక్కిడి పోచమ్మ ఆలయం దగ్గర ఉన్న డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలని, ఏరియాలోని ఎంవిటిసిలో ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, డైనింగ్ హాలు, స్టాఫ్ కు, కార్మికులకు మరుగుదొడ్లు ఏర్పాటు , మరమ్మతులు చేయాలని, ఏరియా స్టోర్ లోని అన్ని షెడ్ లలో ఎలక్ట్రికల్ వైరింగ్ సక్రమంగా చేయించాలని ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, పురుషులకు మరుగుదొడ్లు నిర్మించాలని,టెండాల్ సూపర్వైజర్లు నియమించాలని అన్నారు. అదేవిధంగా స్టోర్ కు కొత్తగూడెం నుంచి మెటీరియల్ తక్కువగా వస్తుందని అవసరం మేరకు మాత్రమే తెప్పించాలని, ఉదాహరణకు చలానా బుక్కులు నెలకు 10 మాత్రమే, షాట్ ఫైరర్ బుక్కులు 15 మాత్రమే కానీ , ప్రతి నెలకు కావాల్సింది 5 వందలని అలాగే ఓవర్ మెన్ , సర్దార్ బుక్స్ కూడా తక్కువ వస్తున్నాయన్నారు. శ్రీరాంపూర్ ఆస్పత్రికి సంబంధించి 9 మంది డాక్టర్లకు కేవలం నలుగురు మాత్రమే ఉన్నారని డాక్టర్ లను నియమించాలని, ప్లేడేలలోమొదటి బదిలీలో వార్డు అసిస్టెంట్ల లను నియమించాలని, అదేవిధంగా మూడు చుక్కలలో ఎన్ అండ్ పిసి సిబ్బందిని నియమించాలని, ఫార్మాసిస్టు ,ఫిజియోథెరఫిస్ట్ లకు ప్లే డే లు ఇవ్వాలని, సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను సీనియార్టీ ప్రకారం గతంలో ఉన్న ప్యానల్ లిస్ట్ నుంచి ఇవ్వాలని డిప్యూటేషన్ లో పంపించరాదన్నారు. అదేవిధంగా బేసిక్ తగ్గిందని సర్ఫేస్ జనరల్ మాస్టర్ రద్దు చేసుకున్న వారి స్థానాలను ప్యానల్ లిస్ట్ నుంచి భర్తీ చేయాలన్నారు. పదవి విరమణ కన్న మూడు నెలల ముందే కార్మికులు క్వార్టర్ ను ఖాళీ చేస్తే యాజమాన్యం ఆ కార్మికుడికి క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని నాయకులు అధికారులకు వివరించారు . శ్రీరాంపూర్ డివిజన్ లో గత 40 సంవత్సరాల నుంచి నివాసం ఏర్పరచుకున్న కార్మికులు, కార్మికేతర్ల ఇంటి మరమ్మతుల కోసం కోరినప్పుడు, ఏర్పాటు చేసే కమిటీ ప్రతినెల సమీక్ష చేసి ఇంటి మరమ్మతులకు అనుమతిని మంజూరు చేయాలని, అన్ని గనుల్లో రోప్ స్లై సర్ , హామర్ మెన్ , బ్లాక్ స్మిత్ , కార్పెంటర్లను నియమించాలని ఆథరైజేషన్ ఇవ్వాలని, యాక్టింగ్ లను రికార్డ్ చేయాలని గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యానికి విన్నవించారు.

## పూలే సినిమాను విడుదల చేయాలి

మంచిర్యాల 23,ఏప్రిల్ (మనం న్యూస్ ):మహాత్మా పూలే జీవిత చరిత్రపై హిందీలో వస్తున్న పూలే సినిమాకు అడ్డంకులను తొలగించి యధాతథంగా విడుదల చేయాలని మంచిర్యాల జిల్లా బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రోజున మంచిర్యాల బీసీ భవన్ లో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భరతమాత బిడ్డలలో అనైక్యతను సృష్టించిన కుల వ్యవస్థను కొందరు స్వార్థపరులే కృత్రిమంగా సృష్టించారని, ఆ కులదురహంకార వర్గాల దౌర్జన్యాలపై 170 యేళ్ల క్రితమే సమర శంఖం పూరించిన మహాత్మా పూలే సాగించిన పోరాటాల ఆధారంగా పూలే సినిమా వస్తుంటే, మనువాద వర్గాల అభ్యంతరాల కారణంగా సినిమా విడుదల వాయిదా పడిందని తెలిపారు. ఈ దేశంలోని మెజార్టీ వర్గాలపై జరిగిన దౌర్జన్యాల గురించి ప్రస్తావిస్తే, మా మనోభావాలు దెబ్బతింటున్నాయంటూ దబాయిస్తున్నారని ఆరోపించారు. మెజారిటీ వర్గాల మనోభావాలను సైతం అధికారులు పట్టించుకోవాలని, జరిగిన చరిత్ర విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియాలి, మెజార్టీ వర్గాలకు సామాజిక న్యాయం దక్కాలని డిమాండ్ చేశారు. కుల దురహంకారుల అభ్యంతరాలను సెన్సార్ బోర్డు పట్టించుకోరాదని, ఎలాంటి కత్తిరింపులు లేకుండా యధాతథంగా సినిమాను విడుదల చేయాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కోఆర్డినేటర్ చలమల్ల అంజయ్య, రిటైర్డు ఎంఇవో శ్రీరామోజు కొండయ్య, వేముల అశోక్, కొండ శంకరయ్య, కర్నాల మధు, కొండపాక ప్రభాకర్, చుంచు సాగర్, రవీందర్, చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (మనం న్యూస్):కన్నపు దొంగతనాలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన, అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు దొంగలను కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ కథనం మేరకు గత సంవత్సరం జులై నెలలో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి 2లక్షల25వేల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అదేవిధంగా కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ రోడ్డు, పివిఆర్ గార్డెన్స్ సమీపంలో కె.రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్ను అపహరణకు గురైంది. ఈ ఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ పర్యవేక్షణలో, కొత్తపల్లి ఎస్ హెచ్ ఓ, ట్రైనింగ్ ఐపీఎస్ వసుంధర మార్గదర్శకత్వంలో విచారణ ముమ్మరంగా సాగింది. దర్యాప్తులో నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం, ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్ (29), విక్రమ్, హత్రు సింగ్ (41), జితేన్ గా పోలీసులు గుర్తించారు. వీరిపై కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లలో రెండు



కేసులు నమోదు చేశారు. ఈ ఘటనల్లో ప్రధాన నిందితుడైన ప్రదీప్ను గత మార్చి నెలలో అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. మరో నిందితుడైన హత్రుసింగ్ (41)మధ్యప్రదేశ్లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం రావడంతో, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి మంగళవారం అతడిని అరెస్టు చేసి కరీంనగర్కు తీసుకువచ్చారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, మరో ఇద్దరు నిందితులు విక్రమ్, ప్రదీప్ ఇంకా పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని రూరల్ ఏసిపి శుభం ప్రకాష్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తితో పాటు సిబ్బంది శ్రీనాథ్, అబ్దుల్ ఖదీర్, షరీఫ్, సాంబరెడ్డి, దేవేందర్ లను రూరల్ ఏసిపి ప్రత్యేకంగా అభినందించారు.

## ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళి



మందమర్రి, ఏప్రిల్ 23 (మనం న్యూస్): జమ్మూ కశ్మీర్లోని పహల్గాం సమీప బైసరీన్ వ్యాలీలో నిన్న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ, ఈ దాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయినందుకు సంఘీభావంగా బుధవారం సాయంత్రం మందమర్రి మార్కెట్లో అంబేద్కర్ విగ్రహం వద్ద క్యాండిల్లతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని మందమర్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.క్యాండిల్ ర్యాలీలో పలువురు పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సహించకూడదని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఉపాధి హామీ పనుల పరిశీలన

నవాబుపేట, ఏప్రిల్ 23 (మనం న్యూస్): ఉపాధి హామీ పనులను బుధవారం డిఆర్డిఓ ఆఫీసర్ ముసాయిదా బేగం, ఎంపీడీవో జయరాం నాయక్, ఏపీవో జ్యోతి, కలిసి నవాబుపేట, రుద్రారం లో జరుగుతున్న పనులను సందర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కూలి పని కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నమని. మండల పరిధిలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం ఉపాధి కూలీలతో డి ఆర్ డి ఓ ఆఫీసర్ ముసాయిదా బేగం,నవాబుపేట ఎంపీడీవో జయరాం నాయక్ ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 46 మంది ఉపాధి కూలీలు హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న పని దినాల లక్ష్యం అధికమించే దిశగా అధికారులు సాగుతున్నామని తెలిపారు.

**వలసలు వెళ్లకుండా..**

వేరే రాష్ట్రాలకు వలసలు వెళ్లకుండా స్థానికంగా



ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కూలి పనులు కల్పించడానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో ఉపయోగకరమైన పనులను గుర్తించడంతో పాటు నిర్దేశిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నవాబుపేట ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కూలి పని కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్ అసిస్టెంట్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం



## చైనాపై సుంకాలు తగ్గుతాయి: ట్రంప్

వాషింగ్టన్,ఏప్రిల్ 23: చైనా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని.. కానీ, అవి సున్నా మాత్రం కావని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. చైనా ఉత్పత్తులపై అగ్రరాజ్యం 145 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. చైనా ప్రతీకార చర్యల ఫలితంగా ఆ దేశ ఉత్పత్తులపై టారిఫ్లను 245 శాతం పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించడంతో ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యయుద్ధం తారస్థాయికి చేరింది. కాగా ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని.. కానీ సున్నా మాత్రం కావని అన్నారు. భవిష్యత్తులో చైనాతో జరగనున్న చర్చల్లో బీజింగ్తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడానికి ప్రయత్నిస్తానన్నారు. అయితే దశాబ్దాల అమెరికా వాణిజ్య విధానాన్ని దెబ్బతీసినందుకు గాను చైనా తమతో ఏదైనా ఒక ఒప్పందానికి తప్పక అంగీకారం తెలపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం తాము చైనాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు సజావుగానే జరుగుతున్నాయని.. ఎందుకంటే ప్రతి దేశం అమెరికా మార్కెట్లో ఉండాలని కోరుకుంటుందన్నారు. ఆ దేశంతో తాము ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎదురుచూస్తున్నామన్నారు. కాగా చైనాపై విధించిన సుంకాల్లో తగ్గింపులు ఉండొచ్చని ఇప్పటికే ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ దేశాలపై సుంకాల విధింపులో భాగంగా వాణిజ్యదేశాలతో పాటు ట్రంప్ చైనా పైనా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనికి ధీటుగా గతంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించిన చైనా.. తాజాగా వాటిని 125 శాతానికి పెంచింది. అంతేకాకుండా అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ విమానాల ఆర్డర్లను తీసుకోవద్దని తమ కంపెనీలను ఆదేశించడంతోపాటు కీలకమైన ఖనిజాల ఎగుమతిని నిలిపివేసింది. దీంతో ఆగ్రహించిన అగ్రరాజ్యం చైనా ఎగుమతులపై ఏకంగా 245 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించింది. కాగా ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, ఈ చర్యలు దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని చైనా పేర్కొంది.

# ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్న కేరళ జడ్జిలు, ఎమ్మెల్యేలు

త్రివేండ్రం, ఏప్రిల్ 23: జమ్మూ కశ్మీర్ పర్యటనకు వెళ్లిన కేరళ హైకోర్టు న్యాయవాదులు, ఎమ్మెల్యేలు పహల్గాంలో ఉగ్రదాడుల నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. జమ్మూ కశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమం ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ దాడిలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయాలతో బయటపడ్డారు. పర్యటన నిమిత్తం జమ్మూ కశ్మీర్కు వెళ్లిన కేరళ హైకోర్టు న్యాయవాదులు, ఎమ్మెల్యేలు ముష్కరుల దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఈమేరకు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం వివరాలు వెల్లడించింది.''జమ్మూ కశ్మీర్ పర్యటనకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పీజీ అజిత్ కుమార్, జస్టిస్ జి.గిరీష్.. ఎమ్మెల్యేలు ముకేశ్, కేపీఏ మజీద్, టి. సిద్ధిక్, కె.అన్నాలన్ వెళ్లారు. ఉగ్రవాదుల దాడి నుంచి వీరు త్రుటిలో తప్పించుకున్నారు. ప్రస్తుతం శ్రీనగర్లో వీరంతా సురక్షితంగా ఉన్నారు. జమ్మూ కశ్మీర్లో చిక్కుకున్న ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం'' అని ఓ ప్రకటనలో పేర్కొంది. ''ఈ ఘటనపై సీఎం పినరయి విజయన్ విచారంవ్యక్తంచేశారు. ఎర్నాంకులమ్కు చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అతడి కుటుంబసభ్యులను జాగ్రత్తగా ఇంటికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తామని సీఎం తెలిపారు'' అని సీఎంవో తెలిపింది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కొచ్చిలోని ఎడపల్లికి చెందిన ఎన్. రామచంద్రన్ ప్రాణాలు కోల్పోయారు. కాగా.. పహల్గాం



సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు పురుషులే లక్ష్యంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ఈ దాడిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి భద్రతా దళాలు వేటను ముమ్మరం చేశాయి. ఈ దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో సభ్యులుగా తేలింది. వీరిని పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

మాస్కో, ఏప్రిల్ 23 : ఉక్రెయిన్తో ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ఆయన ఇలాంటి ప్రతిపాదన చేయడం గమనార్హం. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్.. రష్యా దేశ అధికారిక వార్తా ఛానల్లో ఈ మేరకు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పరోక్షంగా స్పందించారు. పౌరులపై దాడులు ఆపేలా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎలాంటి చర్చలకైనా సిద్ధమని చెప్పారు.



**లండన్‌లో చర్చలు..**

యుద్ధానికి ముగింపు పలికేందుకు ఉక్రెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా అధికారులు బుధవారం లండన్లో చర్చలు జరపనున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్ సర్కారు జోక్యాన్ని కొనసాగించాలా వద్దా అన్నది నిర్ణయించడంలో ఈ భేటీ కీలకం కానుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టంచేశారు. ఒకవైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా-ఉక్రెయిన్లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా, దానిని అమలు చేయలేదు. తాజాగా ఉక్రెయిన్లోని ఒడెసా, జపోరిజియా నగరాలపై డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడింది. ఇందులో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోగా.. నలుగురు చిన్నారులు సహా 27 మంది గాయపడ్డారు. యుద్ధం ముగించేందుకు జరిపే శాంతి చర్చలు తక్షణ ఫలితాలను ఇచ్చే అవకాశం లేదని రష్యా అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ప్రకటించారు. పౌర వసతులపై దాడులను ఆపాలన్న జెలెన్స్కీ ప్రతిపాదనపై చర్చలకు ప్రణాళికేదీ తమ వద్ద లేదన్నారు.

**వారంలో యుద్ధం ఆగిపోతుంది: ట్రంప్**

మరోవైపు ఉక్రెయిన్, రష్యాల మధ్య ఈ వారంలో శాంతి ఒప్పందం కుదిరి, యుద్ధం ఆగే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు. ఈ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయన్నారు. శాంతి ఒప్పందంపై చర్చించడానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ ఈ వారం రష్యాలో పర్యటించనున్నారు.

# దేశీయ హెచ్‌పీవీ పరీక్ష కిట్లు: కేంద్రం




ఢిల్లీ,ఏప్రిల్ 23: సర్వైకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన హెచ్పీవీ పరీక్ష కిట్లు విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం బుధవారం వెల్లడించింది. ఈ మేరకు ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ''90 శాతానికిపైగా సర్వైకల్ క్యాన్సర్ కేసులు 'హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్పీవీ'కు సంబంధించినవే. అందుబాటు ధరలో టీకాలు, పరీక్షలు, చికిత్స అనేది జాతీయ బాధ్యత. ప్రజలకు సరసమైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు చికిత్స అందించడం ప్రభుత్వ లక్ష్యం. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రైవేట్ రంగ సంస్థలు ముందుకు రావాలి. ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో ప్రజలకు సామూహిక వైద్య పరీక్షలు చేయడం మరింత సులభతరం అవుతుంది.హెచ్పీవీ కిట్లతో పరీక్షలు నిర్వహించి ఫలితాలను తెలియజేయాలి'' అని వ్యాఖ్యానించారు. కొందరు భారతీయ మహిళల్లో సాధారణంగా సర్వైకల్ క్యాన్సర్ ఉన్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. అయితే క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మహిళలు ఈ కిట్లను ఉపయోగించుకోవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం.. ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు సర్వైకల్ క్యాన్సర్తో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్ మరణాల్లో 25 శాతం మంది భారతీయ మహిళలే ఉన్నారు. వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం వల్ల తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# మున్సిపల్ దుకాణలకు ముగిసిన వేలం పాట




- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 23, మనం న్యూస్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు దుకాణాల నిర్వహణకు గాను ఇచ్చిన ప్రకటన అనుసారం బుధవారం రోజున పలు దుకాణాలకు వేలం పాట నిర్వహించడం జరిగిందని దుబ్బాక మున్సిపల్ కమీషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం నిర్వహించిన వేలంపాటలో పోచమ్మ ఆలయం వద్ద గడువు ముగిసిన ఐదు దుకాణాలకు, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద గల దుకాణాలలో ఆరు దుకాణాలకు, డబుల్ బెడ్ రూమ్ ల వద్ద గల నాలుగు దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వేలంలో పోచమ్మ ఆలయం వద్ద గల షాపు నెంబ ర్ 7కు ఇద్దరు వేలంలో పాల్గొనా రూ.12500ల నెలసరి అద్దెకు మహమ్మద్ నజీర్ అధిక పాట పాడి దక్కించుకున్నాడని, షాపు నెంబర్ 14 కు ఇద్దరు పాల్గొనగా గంట రాజు రూ. 7500లకు, షాపు నెంబర్ 17కు ఐదుగురు వ్యక్తులు వేలంలో పాల్గొనగా సోమ వినయ్ రూ. 9300లకు అధిక వేలంపాట పాడి దక్కించుకున్నారని తెలిపారు. అదేవిధంగా పోచమ్మ గుడి వద్ద గల షాపు నెంబర్ 4కు, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద గల షాపు నెంబర్ 8కి ఒకే దరఖాస్తు రావడంతో వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. కాగా మరిన్ని దుకాణాలకు ఎలాంటి దరఖాస్తులు రానందున ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేయడం జరుగుతుందని, తదుపరి వారి ఆదేశానుసారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# భూ భారతి ద్వారా రైతులకు వారి భూములపై అన్ని హక్కులు

- ఎమ్మెల్యే వేముల వీరేశం



కేతేపల్లి/నకిరేకల్, ఏప్రిల్ 23,(మనం న్యూస్): భూ భారతి ద్వారా రైతులకు వారి భూములపై అన్ని రకాల హక్కులు కల్పించబడతాయని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు.భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గం, కేతేపల్లి తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ధరణిలో అధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు .అంతేకాక భూ భారతిలో ప్రతి సంవత్సరం రికార్డులను అప్డేట్ చేయడమే కాకుండా, భద్రపరచడం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని అన్నారు . అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూముల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్డ్ సర్వేయర్లను నియమించనుందని, భూ భారతి చట్టం దేశానికి ఆదర్శం కానున్నదని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు .చట్టంలో మోకపై ఉన్న రైతులకు హక్కు ఉండాలన్నదే భూ భారతి చట్టం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు .భూ భారతి వల్ల కేతేపల్లి మండలంలో రైతులకు న్యాయం జరుగుతుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. 99 శాతం కేసులు భూ భారతిలో తహసిల్దార్ వద్దనే పరిష్కారం అవుతాయని, ఇవి కూడా ఉచితంగానే పరిష్కారం అవుతాయని, ఎవరు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. రికార్డులను సవరించే అవకాశం భూ భారతి లో ఉందని, మ్యుటేషన్లు 30 రోజుల్లో అవుతాయని, ఒకవేళ కాకపోతే ఆటోమేటిక్ గా 31 రోజు అవుతుందని తెలిపారు.కింది స్థాయి నిర్ణయాన్ని పై స్థాయిలో అప్పీల్ అవకాశం భూ భారతిలో ఉందన్నారు. జాతీయ రహదారి పై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు వెంటనే జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టుకు లేఖ రాస్తామని తెలిపారు. అలాగే కొప్పోలు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్ డి ఓ వై. అశోక్ రెడ్డి ,తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి లు భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, తదితరులు మాట్లాడారు.

# రైతుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి



గరిడేపల్లి,ఏప్రిల్ 23,మనం న్యూస్: రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలు బాటలు బాగు చేసుకునే వెసులుబాటు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి తెలిపారు.మండలంలోని ఎల్బీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల కింద చేపట్టిన ఆర్సిపి రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పేద మధ్యతరగతి కూలీలకు ఉపాధి లభించాలని అన్నారు.రైతులందరూ తమ పంట పొలాలకు వెళ్లే బాటలను మంచిగా చేసుకొని ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్,ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చిరంజీవి, అధ్యక్షులు సామల వెంకటరెడ్డి,టెక్నికల్ అసిస్టెంట్ వనజ,పంచాయతీ కార్యదర్శి శివ,ఫీల్ అసిస్టెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు వీల్ చైర్ అందజేసిన అధికారులు



తిరుమలగిరి, ఏప్రిల్ 23 (మనం న్యూస్): జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తుంగతుర్తి సిడిపిఓ ఆదేశాల మేరకు మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన నలుగురు వికలాంగులకు వీల్ చైర్ బుధవారం అధికారులు అందజేశారు. తిరుమలగిరి మండలం తాటిపాములగ్రామానికి చెందిన నక్క లింగయ్య యాదవ్, వల్లపు సుభద్ర, బందెల అరవింద్ కోర్ణ వెంకన్న, నలుగురి వికలాంగులకు వీల్ చైర్ అందజేశారు. గత మూడు సంవత్సరం లో 100 శాతం శారీరక వికలాంగునిగా డాక్టర్ ధృవీకరణ పత్రం కలిగి ఉన్న. కానీ ఇంతవరకు ఈ నలుగురికి వికలాంగుల పించన్ రావడం లేదని, కనీసం కూర్చోవడానికి వీల్ చైర్ కూడా అధికారులు అందించకపోవడంతో తాటిపాముల గ్రామానికి చెందిన కోల రమేష్ గౌడ్ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తుంగతుర్తి సిడిపిఓ ఆదేశాల మేరకు వీల్ చైర్ తాటిపాముల గ్రామంలో అంగన్వాడీ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కందుకూరి మంగమ్మ అంగన్వాడి సిబ్బంది పుష్పలత సునీత భూషణమ్మ పాల్గొన్నారు.

# పాఠశాలలకు ఇక సెలవు మా సొంత ఊరికి వెళ్తాస్తాం

- వేసవి సెలవులకు ఇంటికి బయలుదేరిన గురుకుల పాఠశాలల విద్యార్థులు



తుంగతుర్తి, ఏప్రిల్ 23,(మనం న్యూస్): ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు ఉపశమనం లభించింది పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరానికి ఇది చివరి రోజు రేపటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. తస్నేహితులు స్నేహితురాళ్ళని వీడిపోతున్నందుకు కాస్త బాధగా... చెమ్మగిల్లిన కళ్ళతో వీడుకోలు పలికిన వేల్లొస్తానంటూ తను పాఠాలు చదివిన తరగతి గదిగోడలను తుడుముతూ ,ఆటలాడిన మైదానం వంక చూస్తూ తల్లి తండ్రులతో పాటు పలు రకాల వాహనాలపై తమ సొంత గ్రామాలకు వెళుతూ ఒకవైపు సంతోషం ఇటు స్నేహితులను విడిచిపోతున్నామన్న బాధతో పాఠశాలకు భాయ్.. భాయ్ అంటూ తిరిగి మళ్ళీ జూన్ లో వస్తానంటూ తమ సొంత గ్రామాలకు వెళుతున్న విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరంలో బుధవారం చివరి పని దినం. 1 నుండి 9వ, తరగతి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. తుంగతుర్తి మండల కేంద్రంలోని వివిధ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థుల వద్దకు తల్లిదండ్రులు వెళ్లి స్వగృహాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు బస్సులలో ట్రంకు బాక్సులను తమ వెంట తీసుకొని బయలు దేరారు. విద్యర్థులకు వేసవి సెలవులు రావడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.

భాయ్ భాయ్ అంటూ తన తోటి స్నేహితులకు తాత్కాలిక వీడ్కోలు తెలుపుతూ తమ సొంత గ్రామాలకు తరలి వెళ్లారు. ప్రస్తుతం ఎండలు ముదిరినందున పిల్లలు మధ్యాహ్నవేళలో బయటికి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అలాగే ఈత కోసం చెరువులు కాలువల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



చిలుకూరు, ఏప్రిల్ 23 ( మనం న్యూస్): చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామంలో ఉదయం గ్రామ శాఖ మహాసభలో గన్నా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ₹ ధాన్యం ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మార్కెట్లో పెద్ద ఎత్తున ధాన్యం రాసులు పోసుకొని ఎదురుచూస్తున్నప్పటికి అధికారులు మ్యాచింగ్ పేరుతో గోనెసంచుల కొరతతో లోడింగ్ సరిగా జరగకపోవటం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా అధికారులు ముందు జాగ్రత్త లేనందువల్ల ఈ రకమైన సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రభుత్వ పెద్దలుముందు జాగ్రత్తతో అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదని తక్షణం ధాన్యం కొనుగోలు జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీతారాంపురం గ్రామ నూతన కమిటీని తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ప్రధాన కార్యదర్శిగా కనకం రుద్రయ్య సహాయ కార్యదర్శిగా పుట్టపాక రవి కమిటీ సభ్యులుగా బాల బోయినగురవయ్య సాతులూరి అలివేలు గన్న వెంకటేశ్వర్లు పిల్లుట్ల చంద్రయ్య తోడేటి కోటయ్య పార్వతమ్మ లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతులకి బహుళ ప్రయోజనాలు

- భూభారతి చట్టం రైతులకు సులభతరమైన, న్యాయమైన సేవలు...
- గత ధరణి పోర్టల్ లో రెవెన్యూ అధికారులకు ఏమాత్రం అధికారం లేదు...
- గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యల పరిష్కారం దిశగా ప్రజా ప్రభుత్వం కృషి
- భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రజా ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకం.
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



హుజూర్ నగర్,ఏప్రిల్ 23,(మనం న్యూస్): రైతులకి బహుళ ప్రయోజనాలు చేకూర్చేలా ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం మఠంపల్లి మండలంలో విఆర్ఎస్ పంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి చట్టం-2025పై అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన, న్యాయమైన సేవలు అందుతాయన్నారు.ఈ చట్టంలో ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తమ సమస్యను దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని వివిధ స్థాయిలలో నిర్ణీత సమయాలలో ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. భూముల సమస్య సులభంగా పరిష్కారం కోసం మార్పులు చేర్పులు(వికేంద్రీకరణ) చేయడం జరుగుతుందన్నారు.గత ధరణి పోర్టల్ లలో రెవెన్యూ అధికారుల కు ఏమాత్రం అధికారం అవకాశం లేకుండా ఉండేదని తెలిపారు. నూతన చట్టంలో అనేక సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుండి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు.భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారి,మండల సర్వేయర్లను నియమించుకోవడం కోసం సన్నాహాలు చేస్తుందన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో నూతన రికార్డుల నిర్వహణకు సులభతరంగా ఉంటుందని సూచించారు.అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ గత ధరణి సమయాలలో రైతులు చిన్న చిన్న భూ విషయాలకు చాలా ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం 2025,ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు.రెవెన్యూ సదస్సుకు హాజరైన కొంతమంది రైతులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చి రానున్న గ్రామసభల ద్వారా తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఇవ్వాల్సిందిగా తెలిపారు. సదస్సుకు హాజరైన రైతులు భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం-2025 మంచి నిర్ణయం అని రైతులు కొనియాడారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు తహసీల్దార్ మంగా,ఎంపిడిఓ జగదీష్,డిటి బాలరాజు, పిఎసిఎస్ చైర్మన్ జవ్వాజి రామ చంద్రయ్య, వైస్ చైర్మన్ బాబు నాయక్, డిప్యూటీ తాసిల్దారులు,రెవిన్యూ సిబ్బంది, తదితరులు,పాల్గొన్నారు.

# కాశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషం



- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యం డి సలీమ్

నల్లగొండ, ఏప్రిల్ 23 (మనం న్యూస్): కాశ్మీర్ లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని సిపిఎం నల్గొండ జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీమ్ తీవ్రంగా ఖండించారు, మృతులకి నివాళులర్పిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్మూ కాశ్మీర్ లో పర్యటించడానికి వెళ్లిన సందర్శకులని ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన హేయమైన చర్య అని అన్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ చర్యలను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. మిల్ట్రీ దుస్తుల్లో ఉగ్రవాదులు వచ్చారని కథనాలు వెలువడుతున్నాయని, మొత్తం ఘటనపై సమగ్రమైన విచారణ చేయడం ద్వారా వాస్తవాలు ప్రజల ముందు పెట్టాలని అన్నారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించడం ద్వారా కాశ్మీర్ లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. కాశ్మీర్ ప్రజలంతా ఉగ్రవాదుల దాడులకు నిరసనగా బంద్ ప్రకటించి, పాటించడం మంచి పరిణామమని అన్నారు. కాశ్మీర్ ఉగ్రవాదుల దాడిని ఆసరాగా చేసుకొని దేశంలో మత విద్వేషాలను సృష్టించే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉగ్రవాదుల చర్యలను ఖండించడంతోపాటు మృతుల కుటుంబాలకి అందరం అండగా నిలబడాలని యడి సలీమ్ విజ్ఞప్తి చేశారు.

# రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలి



త్రిపురారం, ఏప్రిల్ 23(మనం న్యూస్): మండలం కేంద్రం, సుశీలా నర్సింహా రెడ్డి ఫంక్షన్ హల్ లో ఏప్రిల్ 27 న వరంగల్ లో జరిగే పార్టీ ఆవిర్భావ రజతోత్సవం సందర్భంగా త్రిపురారం మండలం లోని ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరైనా ఎమ్మెల్సీ యం.సీ. కోటి రెడ్డి,మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాంచందర్ నాయక్ ప్రభుత్వం వైఫల్యాలు ప్రజా వ్యతిరేకత వరంగల్ సభ వేదికగా ఎండగట్టాలి.27 న పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి పల్లెలో పట్టణంలో గులాబీ జెండా ఎగరేయాలి.27 వ తారీఖున ఉదయం 8:00 గంటల వరకు హాలియా పట్టణానికి చేరుకోవాలి రేవంత్ రెడ్డి పాలన పెయిల్ అయింది.. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు నాశనం చేసిండు, భూముల అమ్మకాల పేరుతో మూగ జీవాల గోస పోసుకున్నాడు. మూగ జీవాలు రేవంత్ రెడ్డిని క్షమించవు అని ఆయన అన్నారు.రుణమాఫీ చేస్తా అని సగం రుణమాఫీ చేసి చేతులు ఎత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పామోజీ వెంకటా చారి, బాబురావు నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ కామెర్ల జానయ్య, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ గుండెబోయినా వెంకటేశ్వర్లు,కలకొండ వెంకటేశ్వర్లు, మడుపు వెంకటేశ్వర్లు,రాయన బోయనా వెంకన్న,బైరం కృష్ణ, సుశీల్ నాయక్, శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,గగ్గేనే పల్లి వనజ రెడ్డి, త్రిపురారం మండలం లోని ముఖ్య నాయకులు,మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీ లు, గ్రామ శాఖ అధ్యక్షులు,వివిధ హోదాల్లో ఉన్న అనుబంధ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు చికిత్స తప్పనిసరి

- గాలి కుంటు వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించాలి
- జిల్లా పశు వైద్యాధికారి డి శ్రీనివాసరావు



తుంగతుర్తి, ఏప్రిల్ 23 ,( మనం న్యూస్): ప్రతి రైతు విధిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ డి శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో పశు వైద్య అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం రైతులతో మాట్లాడుతూ మనుషులలో కరోనా వైరస్ లాగానే పశు గణాలను కూడా వేధిస్తున్న అంటువ్యాధులలో మహా ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధిని ఆంగ్లంలో 'ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ 'అని అంటారు. కలుషితమైన గాలి ద్వారా సోకే ఈ గాలికుంటు వైరస్ వ్యాధి ఒకప్పుడు మార్చి నుండి సెప్టెంబర్ మాసాల మధ్య వ్యాపించేది. కానీ ఈ మధ్యకాలంలో ఏడాది పొడవున పశువులు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాధి పశువుల లోనే కాక సన్న జీవాలకు వ్యాప్తి చెందుతుందని ఈ వ్యాధి వేగంగా ఒక పశువు నుండి మరొక పశువుకు వ్యాప్తి చెందుతుందన్నారు. ఇది ప్రత్యేకంగా రెండు గిట్టలు కలిగినటువంటి జంతువులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు మరియు పందులకు వ్యాపిస్తుందని పశువులు తినే గడ్డి, మేత కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుందన్నారు. పశువుల పాక లో పనిచేయు వారి వలన గడ్డి కోసే యంత్రాల ద్వారా కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. తల్లిపాల ద్వారా దూడలకు వ్యాప్తి చెంది మొత్తం పశుగణం అంతా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుంది కావున రైతులు జాగ్రత్త వహించి తగు నివారణ చర్యలు ముందుగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు ఈ వ్యాధి ప్రమాదకరమైనదని పశువులకు ఒకదాని నుండి మరొకదానికి సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి సోకకముందే టీకాలు వేయించి నివారణ చర్యలు చేపట్టాలని గాలికుంటు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుండి దూరంగా ఉంచాలని లేనట్లయితే అన్ని పశువులకు వ్యాధి సోకి తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం పశు వైద్య శాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకొని గాలికుంటు వ్యాధి టీకాలు వేయించి తమ పశువులు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 143 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఏ నరేష్, విలేజ్ అసిస్టెంట్ రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు ,గోపాలమిత్ర కుంచాల శ్రీనివాసరెడ్డి, పసుమిత్ర గణిత లతో పాటు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రూపొందించిన చట్టం భూభారతి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్‌నాగరాజు




**వరంగల్ ,ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి):** రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం భూభారతియని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా వర్షన్నపేట మండలం కేంద్రంలోని ఏబీఎన్ ఫంక్షన్ హాల్ లో, పర్వతగిరి మండలం కేంద్రంలోని పిఏసీఎస్ భవనంలో బుధవారం రైతులు, ప్రజలకు నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సు లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు ముఖ్య అతిధులు గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూభారతి- నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు.అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలనే సదుద్దేశంతో భూభారతి పోర్టల్ను తీసుకొచ్చామని తెలిపారు. రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకునే భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.ధరణి పోర్టల్ తీసుకురావడంతో గ్రామాల్లో మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. రైతులు, ప్రజలు భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సమస్యలు ఒక్క పైసా ఖర్చు లేకుండా నిజమైన రైతులకు, ప్రజలకు భూహక్కులు లభిస్తాయన్నారు.భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు.ఈ చట్టం ద్వారా ఏవైనా న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు కమిషన్ ఏర్పాటు చేస్తారని, తద్వారా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా లభించనుందని అన్నారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టాలు ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. గతంలో తహసిల్దారు పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయిలోని సత్వరం పరిష్కారం అవుతాయని తెలిపారు.ఈ పోర్టల్లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్‌ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, ఇతరాల పేరిట ప్రత్యేక మాడ్యూల్స్, సెక్షన్స్ గురించి కలెక్టర్ వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో ప్రతిరోజు రెండు మండలాల చొప్పున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూభారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా నూతన చట్టం, తమ భూ సమస్యల గురించి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సులో వర్షన్నపేట, పర్వతగిరి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజల భూ సమస్యలకు సంబంధించిన సందేహాలను రెవిన్యూ అధికారులు నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా నీటిపారుదల అధికారి శంకర్, జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు గౌస్ హైదర్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ లు విజయ్, వెంకటస్వామి, ఎంపిడివో లు వెంకటరమణ, శంకర్, పిఏసీఎస్ చైర్మన్లు గొర్రె దేవేందర్, మనోజ్ గౌడ్ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు సేవాభావం కలిగిఉండాలి



- మంత్రి సీతక్క

**ములుగు,ఏప్రిల్ 23(మనం ప్రతినిధి):** ఉన్నత చదువులు చదవడం గొప్పకాదని, ఉన్నత చదువులు చదివిన వారు సేవాభావం కలిగి ఉండి సేవ చేసినప్పటికీ వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను ప్రకటించిన సందర్భంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థినీ, విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని బుదవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అధ్యక్షతన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడం ఆశించదగ్గ విషయమని, ఎంత నేర్చుకున్నాం అనేది ముఖ్యం కాదని నేర్చుకునే విషయాలు అనేకంగా ఉంటాయని అన్నారు. ఎవరైనా సముద్రాన్ని దాటగలరు కానీ జ్ఞానం ఎంత నేర్చుకున్న సరిపోదని అన్నారు. పోటీ పరీక్షల్లో నెగ్గడానికి జ్ఞానం పెంపొందించుకోవాలని, ఉన్నత చదువులు చదివిన వారు సేవ భావం లేనప్పుడు వారి చదువుకు గుర్తింపు ఉండదని అభిప్రాయపడ్డారు. ఉన్నత చదువులు చదివిన వారు మారుమూల గ్రామాలలోని ప్రజలకు సేవలు అందించడానికి ముందుకు రావాలని, తాను సైతం భీకరవై ఎన కరోనా సమయంలో ఏజెన్సీ గ్రామాలలో పలు కార్యక్రమాలు నిర్వహించడంతోనే తనకు గుర్తింపు లభించిందని వివరించారు. పిల్లలను పెద్దలను గౌరవించడం నేర్చుకోవడంతో పాటు సమాజ సేవ బాధ్యతలను నేర్చుకోవాలని, హాయ్ అనే పలకరింపు పదం మన సంస్కారం కాదని, నమస్కారం అని తెలిపారు. ములుగు జిల్లా విద్యార్థులలో పాటు తాను బాధ్యతలు వహిస్తున్న అసిఫాబాద్ జిల్లా విద్యార్థులు రెండవ స్థానంలో ఉండడం తనకు గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి రాష్ట్రంలో దేశంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, ములుగు జిల్లా విద్యార్థిని విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలపడానికి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు చొరవ చూపడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేయడంతో పాటు సన్మాన కార్యక్రమాన్ని, పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అవార్డులు ఇప్పిస్తామని అన్నారు. ఈ సమావేశం లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి చంద్రకళ, లెక్చరర్లు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి - చట్టం 25 అవగాహన సదస్సు




**మహబూబాబాద్,ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి - చట్టం 25, అవగాహన సదస్సు సోమవారం ఇనుగుర్తి, నెల్లికుదురు మండల కేంద్రం రైతువేదిక లలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణవేణి, గణేష్, ఏడి ల్యాండ్ సర్వే ఏ.నరసింహమూర్తి, స్థానిక తాసిల్దార్లు రవీందర్, కె రాజు, ఎంపిడిఓలు హరిప్రసాద్, బాలరాజు తదితరులు హాజరై తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి, చదివి రైతులకు భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై అవహన కల్పించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన, న్యాయమైన సేవలు అందుతాయని అన్నారు, ఈ చట్టంలో ఉచిత న్యాయ సేవలు, అందుబాటులో ఉన్నాయని, తమ సమస్యను దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని, వివిధ స్థాయిలలో నిర్ణీత సమయాలలో దరఖాస్తులను క్షేత్రస్థాయి లో పరిశీలించి రైతుకు న్యాయం చేయడం జరుగుతుంది అని అన్నారు, భూముల సమస్య సులభంగా పరిష్కారం కోసం మార్పులు చేర్పులు (వేకేంద్రీకరణలు ) చేయడం జరుగుతుందన్నారు, గత ధరణి పోర్టల్ లలో రెవెన్యూ అధికారులకు ఏమాత్రం అధికారాలు, అవకాశం లేకుండా ఉండేదని తెలిపారు. నూతన చట్టంలో అనేక సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు,ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుండి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారి, మండల సర్వేయర్లను నియమించుకోవడం కోసం సన్నాహాలు చేస్తుందన్నారు, తద్వారా క్షేత్రస్థాయిలో నూతన రికార్డుల నిర్వహణకు సులభతరంగా ఉంటుందని సూచించారు, -అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి మాట్లాడుతూ.... గత ధరణి సమయాలలో రైతులు చిన్న చిన్న భూ విషయాలకు చాలా ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏం చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు, ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌ఓఆర్ చట్టం 2025, ద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన సేవలు అందిస్తామన్నారు,రెవెన్యూ సదస్సుకు హాజరైన కొంతమంది రైతులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్, కలెక్టర్ సమాధానాలు ఇచ్చి రానున్న గ్రామసభల ద్వారా తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఇవ్వాల్సిందిగా కోరారు, సదస్సుకు హాజరైన రైతులు భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం - 2025, మంచి నిర్ణయం అని రైతులు కొనియాడారు,ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీనివాస్, స్థానిక డిప్యూటీ తాసిల్దారులు, పంచాయతీ, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల కోసమే సన్నబియ్యం పథకం
### వర్షన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు

**వరంగల్ జిల్లా/పర్వతగిరి: ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి):** బుధవారం పర్వతగిరి మండల కేంద్రంలో చెనిమాల పుష్ప నర్సయ్య సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి వర్షన్నపేట శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు భోజనం చేశారు. అన్నదాత సుఖీభవ అని దీవిస్తూ దంపతులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీరను బహుమానంగా సమర్పించగా, ఎమ్మెల్యే ఇంటి ఆడపడుచుల కట్నం పెడుతూ వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల కోసం మహత్తరమైన పథాకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఏదైన సమస్య వుంటే నా దృష్టికి తీసుకురండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్, ఏప్రిల్ 23(మనం ప్రతినిధి):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్యలు వుంటే తన దృష్టికి తీసుక రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందికి సూచించారు. ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిం చారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సిబ్బంది శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, సిబ్బంది సమస్యల పరిష్కరం కోసం తీసుకోవాల్సిన చర్యలు పై పోలీస్ కమిషనర్ సంబంధిత పరిపాలన విభాగం అధికారులు అడిగి తెలుసుకున్నారురు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ విభాగంలో ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది చాలా కీలకమన్నారు. సమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏ.ఎస్పీ మనన్ భట్, ఏసీపీలు జితేందర్ రెడ్డి,నాగయ్య, అనంతయ్య, సురేంద్ర ఆర్.ఐ పాల్గొన్నారు.

## ఇంటర్‌లో స్నేహ వొకేషనల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23 (మనంన్యూస్):** ఇంటర్ ఫలితాల్లో స్నేహ (నియో) వొకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు సెక్రటరీ, కరస్పాండెంట్ దుగ్యానీ వెంకటేశ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీహెచ్యు ద్వితీయ సంవత్సరంలో తయ్యాబా ఫాతిమా 941, నూనె శ్రావణి 915, మార్కులు ఎంఎల్టీ ద్వితీయ సంవత్సరం లో పత్రి నర్మద 856 మార్కులతో సత్తాచాటారని తెలిపారు. ఎంపీహెచ్ డబ్ల్యూ ఫస్టియర్ కొంకటి హర్షిత 466, పెందెల శైలజ 433, ఎంఎల్టీలో సయ్యద్ అనాస్ 433. ఈటీలో గాజుల హర్షవర్ధన్ 439 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

## బిఆర్‌ఎస్ రజతోత్సవ సభాస్థలి పరిశీలన

**వరంగల్, ఏప్రిల్ 23 (మనం ప్రతినిధి):** (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు,శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితర ప్రముఖులతో కలిసి ఎంపి రవిచంద్ర బుధవారం మధ్యాహ్నం ఎల్కతుర్తిలో రజతోత్సవ సభాస్థలిని సందర్శించారు.బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో పార్టీ వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా ఈనెల 27వతేదీన భారీ బహిరంగసభ జరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు గాను బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎల్కతుర్తి సభాస్థలిని సందర్శించారు.ఇక్కడ కొనసాగుతున్న పనులు, వేదిక నిర్మాణం,వాహనాల పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్థలాన్ని, లైటింగ్ ఏర్పాట్లను ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి,మాజీ మంత్రి దయాకరరావు తదితర ప్రముఖులతో కలిసి పరిశీలించారు, పర్యవేక్షించారు, సమీక్షించారు. కేటీఆర్ సభాస్థలి వద్ద విలేకరులతో మాట్లాడడానికి ముందు నాయకులు, గులాబీ శ్రేణులతో కలిసి జమ్ముకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల ఊచకోతలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ లు తక్కళ్లపల్లి రవీందర్ రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ మంత్రులు రెడ్యానాయక్,సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి,పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్,గండ్ర వెంకట రమణారెడ్డి,శంకర్ నాయక్, పార్టీ నాయకులు బాలమల్లు, గెల్లు శ్రీనివాస్ యాదవ్,వాసుదేవ రెడ్డి, సతీష్ రెడ్డి,రాఘువ,అమృత్ చౌహాన్, యాకూబ్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## విదేశీ సుందరీమణుల పర్యటన ఏర్పాట్లు పూర్తిచేయండి



- కలెక్టర్ దివాకర

**ములుగు, ఏప్రిల్ 23,మనం ప్రతినిధిః** వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు మే 14వ తేదీన ములుగు జిల్లా పర్యటన కు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతంగా సాగేవిధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచిం చారు. బుదవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లోని రామప్ప ఆలయం, హరిత హోటల్, ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లలో జరుతున్న పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజధాని హైదరాబాద్ నగరం లో నిర్వహించే ప్రపంచ సుందరీ పోటీలలో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు హైదరాబాద్ నుండి ములుగు పర్యటనలో భాగంగా రామప్ప దేవాలయం ను సందర్శించనున్న నేపథ్యంలో రామప్ప పరిసర ప్రాంతాన్ని స్వాగత ఆర్చ్, ఆలయంను లైటింగ్ తొ సుందరికరించి, గ్రీనరీ పెంచాలని, స్వాగత ఏర్పాట్లు, కాకతీయ కట్టడాలను ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడానికి విదేశీ పర్యటకులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో మొదటిసారిగా ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా దేశాల సుందరి మనలను పర్యాటక ప్రాంతాలకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన వివరించారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రపంచానికి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం చరిత్రక విశేషాలను తెలియజేసేందుకు లభించిన ఈ అవకాశాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు, షో బోట్ ఈవెంట్ ప్రతినిధి పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి



- సిఐటియు జిల్లా కార్యదర్శి, దుంపల రంజిత్ కుమార్

**మంచిర్యాల, ఏప్రిల్ 23(మనం న్యూస్):** మధ్యాహ్న భోజన కార్మికులకు అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి, దుంపల రంజిత్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలపై మంచిర్యాల జిల్ల కలెక్టర్ కార్యాలయం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ( సిఐటియు) , జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలోనిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారిని కలసి పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బియ్యంలో పురుగులు వస్తున్నాయని జిల్లా డిఈఓకు చెప్తే, వస్తే ఏరి మంచిగా పెట్టండి అంటూ చులకనగా మాట్లడటం సరి కాదని, అలాగే పురుగులు వస్తున్నాయని కార్మికుల తొలగింపులు కూడా సరికాదని అన్నారు .

### శుభకార్యాలకు ప్రముఖులు హాజరు



**ములుగు, ఏప్రిల్ 23,మనం ప్రతినిధిః** ములుగు జిల్లా కాశిందేవిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అహ్మద్ పాషా మహమ్మద్ కుమార్తె వివాహానికి ములుగు మండలం ఇంచర్ల ఎంఆర్ ఫంక్షన్ హాల్ లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య ,జిల్లా నాయకులు ములుగు మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుక్కల నాగరాజు మండల నూతనంగా ప్రారంభిస్తున్న పావని మిల్క్ బార్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య పాల్గొని ప్రారంభించారు.



# నల్లబ్యాడ్జీలతో ప్లేయర్స్



ఐపీఎల్ 2025 సీజన్లో ఉప్పల్ మైదానం వేదికగా ఇవాళ సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బాధిత కుటుంబాలకు బీసీసీఐ సంఘీభావం తెలపనుంది. ఇందులోభాగంగా ఎస్ఆర్హెచ్, ముంబయి ఆటగాళ్లు నల్ల బ్యాడ్జతో బరిలోకి దిగనున్నారు. వీరితోపాటు అంపైర్లు ధరించనున్నారు. ఈ మ్యాచ్లో చీర్ లీడర్స్కు అనుమతి లేదు. ఒక నిమిషం పాటు ప్రేక్షకులతోపాటు అందరూ మౌనం పాటించాయి. 2019లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురుకాగా.. అప్పుడు కూడా 12వ సీజన్ ప్రారంభోత్సవాలను బీసీసీఐ నిర్వహించలేదు. అందుకు బదులుగా నిర్వహణకు ఖర్చు పెడదామనుకున్న డబ్బును బాధిత కుటుంబాల సంక్షేమం కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉగ్రదాడిపై భారత్‌కు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. తాజాగా సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్య బాధితులకు మద్దతుగా నిలిచారు.



IPL-2025



## ఇది ఏ రకమైన యుద్ధం..

కశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిని యావత్ ప్రపంచం ఖండిస్తోంది. పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ముష్కరులను వదిలేయొద్దని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఈ క్రమంలోనే భారత క్రికెటర్లు పలువురు ఇప్పటికే ఎక్స్ వేదికగా పహల్గామ్ దాడిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. పేసర్ మహ్మద్ సిరాజ్ సైతం తన ఆవేదనను పంచుకున్నాడు. ఇది అసలు ఏరకమైన యుద్ధం. మనుషుల ప్రాణాలకు విలువన్నదే లేకుండా పోయింది అంటూ స్పీడ్‌స్టర్ తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చాడు.

## పాకిస్థాన్‌తో క్రికెట్ అసలే వద్దు.. బీసీసీఐకి లేఖ రాసిన క్రికెటర్

**న్యూఢిల్లీ:** పెహల్గామ్ ఉగ్రదాడినేపథ్యంలో ఆర్సీబీ మాజీ క్రికెటర్ శ్రీవత్స్ గోస్వామి ఇండో-పాక్ క్రికెట్ అంశంపై స్పందించారు. ఇండియా, పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలను నిలిపివేయాలని అతను కోరాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐకి లేఖ రాశారు. తన ఎక్స్ అకౌంట్‌లో ఓ లెటర్‌ను అతను పోస్టు చేశాడు. ఇక పాక్‌తో క్రికెట్ ఆడవద్దు అంటూ పేర్కొన్నాడు. పెహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు లష్కరే తోయిబాతో లింకున్న అనుబంధ సంస్థకు సంబంధం ఉన్న నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత క్రికెటర్లు ఆడకూడదని పేర్కొన్నాడు.పాక్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, దీని వల్లే తాను పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడవద్దు అని కోరుతున్నట్లు చెప్పాడు. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు ఇండియా ఆ దేశానికి వెళ్లలేదు. తటస్థ వేదికపై మ్యాచ్‌లను ఇండియా ఆడింది. క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టవద్దు అని, వాటికి అతీతంగా చూడాలని కొందరు అభిప్రాయాలు వ్యక్తం చేశారని, పాక్‌లో ఆడేందుకు ప్రభుత్వం కానీ బీసీసీఐ కానీ వ్యతిరేకించినప్పుడు గగ్గోలు చేశారని క్రికెటర్ శ్రీవాత్స్ గోస్వామి తెలిపారు. అమాయకులను చంపడం పాకిస్థాన్‌కు జాతీయ క్రీడగా మారిందని ఆరోపించారు. 2012-13 నుంచి పాకిస్థాన్‌తో ఇండియా ద్వైపాక్షిక క్రికెట్ నిర్వహించడంలేదు. ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్నా.. భారత జట్టు మాత్రం పాక్‌లో ఆడలేదు. అయితే కొన్ని రోజుల క్రితమే పెహల్గామ్ వెళ్లానని,ఆ సమయంలో కశ్మర్ లోయలో మళ్లీ శాంతి వికసించినట్లు ఆలోచనలు వచ్చాయన్నారు. కానీ అంతలోనే అక్కడ రక్తపాతం సష్టించడం ఆందోళనకు గురి చేసిందన్నారు. ఇలాంటి ఘటనలో మనుషుల్ని మార్చేస్తాయని, ఎన్నిసార్లు సైలెంట్‌గా ఉండాలన్న ఆలోచనలు వస్తాయన్నారు. మనవాళ్లు చస్తుంటే క్రీడలా.. ఇక ముందు ఇలాంటివి వద్దు అని శ్రీవాత్స్ గోస్వామి తెలిపారు.

## చీకటి రోజు.. నరకంగా భూతల స్వర్గం: పహల్గాం ఉగ్రదాడిపై సినీ ప్రముఖులు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం ఉగ్రవాదులు తెగబడ్డారు. ప్రకతి అందాలను చూసి పరవశిస్తోన్న వారిపై పాశవికంగా దాడి చేసి 28 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ పెనువిషాదంపై సినీప్రముఖులు స్పందిస్తున్నారు. దాడిని ఖండిస్తూ మతులకు సంతాపం తెలుపుతున్నారు. దీనిపై వీడియో చేస్తూ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కన్నీరు పెట్టుకున్నారు. ఇది మాటలకు అందని విషాదమన్నారు. ఇది క్షమించరాని చర్య అని చిరంజీవి పోస్ట్ పెట్టారు.



''పహల్గాం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా, బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా'' – కమల్‌హాసన్



'భూతల స్వర్గమైన కశ్మీర్.. నరకంగా మారుతోంది. అమాయక ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. ఒక్క అమాయకుడిని చంపడం.. మొత్తం ప్రపంచాన్నే హత్యచేయడంతో సమానం'' – సల్మాన్‌ఖాన్



''అదో చీకటి రోజు. పహల్గాం ఘటన కలిచివేస్తోంది. అలాంటి క్రూరత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నా. ఈ విషాదం నుంచి బాధిత కుటుంబాలు బయటపడాలని ప్రార్థిస్తున్నా'' – మహేశ్‌బాబు



28 మంది అమాయకులను బలిగొన్నదారుణమైన ఈ దాడి హదయ విదారకమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా, వారి నష్టం తీర్చలేనిది. – చిరంజీవి



బాధితులను చూస్తుంటే నా హదయం బరువెక్కుతోంది. మతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా, శాంతి కోసం ప్రార్థిస్తున్నా – ఎన్టీఆర్

''పహల్గాం ఘటన విషయంలో ఉన్న కోపాన్ని, బాధను మాటల్లో చెప్పలేకపోతున్నా, బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా, మనమంతా ఒక్కటిగా నిలిచి, ఈ హేయమైన చర్యకు వ్యతిరేకంగా పోరాడదాం'' – షారుక్‌ఖాన్

పహల్గాం ఉగ్రదాడి గురించి తెలిసి దిగ్భ్రాంతి చెందాను. నా హదయం బరువెక్కింది. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల వచ్చే కోపాన్ని అణచివేయలేకపోతున్నా, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా, మేమంతా మీ వెంట ఉన్నాం. ఈ బాధ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని దేవుడిని వేడుకుంటున్నా, – జాన్వీ కపూర్

## 'కల్కి 2' రిలీజ్ ఎప్పుడు?.. నాగ్ అశ్విన్ ఫన్నీ రిప్లై

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకొని కలెక్షన్ల సునామీ సష్టించింది. దీంతో దీని సీక్వెల్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ 'కల్కి 2' రిలీజ్‌పై ఫన్నీ రిప్లై ఇచ్చారు.'కల్కి 2' ఎప్పుడు రిలీజ్ చేస్తారని అడగ్గా.. ''కల్కి'ని 3, 4 గ్రహాలు ఒకే వరుసలో ఉన్నప్పుడు విడుదల చేశాను. దాని సీక్వెల్‌ను 7, 8 గ్రహాలు ఒకే వరుసలోకి వచ్చినప్పుడు రిలీజ్ చేస్తా. వేచి ఉండండి' అని ఫన్నీగా స్పందించారు. ప్రస్తుతం ఆయన రిప్లై వైరల్‌గా మారింది. ఇక ఇటీవల కూడా ఆయన 'కల్కి 2'పై స్పందించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పార్ట్ 2లో ప్రభాస్ ఎక్కువసేపు స్క్రీన్‌పై కనిపిస్తారని.. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుందని తెలిపారు. రెండో భాగంలో వీరిద్దరి పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు.భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇందులో అగ్ర నటులు అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, కమల్ హాసన్.. సుప్రీం యాస్కిన్‌గా ఆకట్టుకున్నారు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలతో అలరించారు.



## ఇది మీ టర్నింగ్ పాయింట్ అవ్వొచ్చు: చిరంజీవి



అంతర్జాతీయ స్థాయిలో భారత్ను ఎంటర్టైన్మెంట్ హబ్గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వరల్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను నిర్వహించనుంది. ముంబయిలో మే 1 నుంచి 4 వరకు జరగనుంది. అది ప్రతిభను నిరూపించుకునే వేదిక అని వేవ్స్ అడ్వైజరీ బోర్డులో సభ్యుడు, ప్రముఖ నటుడు చిరంజీవి పేర్కొన్నారు. ఈ మేరకు http://www.wavesindia.org/ లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈవెంట్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు (World Audio Visual Entertainment Summit).''నేను మొగల్తూరు నుంచి భారీ ఆశలతో వచ్చానని మీలో చాలామందికి తెలుసు. నా నట ప్రయాణం కాలేజ్లో ప్రారంభమైంది. ఎలాగైనా సినిమాల్లోకి వెళ్లాలనేది నా కల. దాని కోసం ముందడుగేశా. 'వేవ్స్' మీకు ఫస్ట్ స్టెప్లాంటిది. మీ డ్రీమ్స్ నెరవేరేలా చేస్తుంది. మీ కెరీర్ టర్నింగ్ పాయింట్ కావొచ్చు'' అని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. 'స్టార్టప్ బూత్ బుకింగ్ అండ్ ఇన్వెస్టిమెంట్ పిచ్ ఆపర్చునిటీస్' విభాగంలో ఆసక్తిగల వారు తమ ఆయా రంగాల గురించి ఆలోచనలు పంచుకోవచ్చు. తమ ప్రొడకట్స్ గురించి చెప్పొచ్చు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.